

ఆంధ్ర సచిత్రవార పత్రిక



20-6-69

40 పై.


శ్రీరాజ్ ఆర్ట్ ఫిలింస్
సగర్వంగా సమర్పించు
విచిత్ర కుటుంబం
మాటలు: భమిడిపాటిరాధాకృష్ణ • పాటలు: డా॥సి.నారాయణరెడ్డి • సంగీతం టి.వి.రాజు • కెమెరా: ఆర్.సంపత్
దర్శకత్వం: కె.ఎస్.ప్రకాశరావు
నిర్మాత: వి.కె.పి.సుంకవల్లి
VIJAYA
ఆంధ్ర-సీడెడ్: విజయా
నైజాం: ఉమాఫిలింస్
VIJAYA



ప్రతీకారంతో ఆయింటి కోడలైన ఒక సాహసవతి గాథ!
బాలాజీ ఫిలిమ్స్ వారి
మామకు తగ్గ కోడలు
దర్శకత్వం
సి.యస్. రావు B.A. (LIT)
సంగీతం
యస్. రాజేశ్వరరావు

ఉత్తరాలు

సీరియల్

మీరు ప్రచురిస్తున్న నవల 'ఏది సత్యం? ఏదసత్యం' ఎంతో హృద్యంగా ఉంది. ఏనాడో తెలుగు పాఠకుల హృదయాలలో స్థానం సంపాదించుకొన్న రచయిత్రి ఆనందరామంగారు ఈ నవల ద్వారా తన స్థానాన్ని సుస్థిరం చేసికొంటున్నారు. అటు ప్రేమకు ఇటు స్నేహానికి కళంకం రాకుండా చాలావరకు ప్రయత్నం చేసి నెగ్గినారు. సుమిత్ర పాత్రను ఇంకా బాగా తీర్చిదిద్దితే బాగుండేదేమో!

"వెలుగు నీడలు" ఆరంభంలో నన్ను ఆ తీయని తేనెలొలికే తెలుగు గీతిక అయిందంటే నిండుగా ఉండేది. రాజస్థాను నుండి వ్రాసిన రచయిత్రిగారు తన ప్రత్యేకమైన తెలుగు శైలిలో పాఠకుల హృదయాలను పులకింప చేస్తున్నారు.

(శ్రీమతి పి. విజయలక్ష్మి, (ఈదులవలస)

కథలు

ఎస్. రాజేశ్వరిగారు వ్రాసిన "స్నేహలత" కథ చాలా బాగున్నది. కథ చదువుతున్నప్పుడు మనకి తెలియకుండానే అప్రయత్నంగా కళ్ళవెంట నీళ్ళు వస్తాయి. రచయిత్రిగారు పాఠకుల మనస్సులను తమ కథద్వారా ఆకట్టుకున్నారు. స్నేహానికి విలువ నిస్తూ మంచి కథను మాకు అందించినందులకు రచయిత్రిగారికి అభినందనములు. ఇంకా ఆ పత్రికలో "అమరత్వంలో అమ్మ" అను కథ కూడ బాగున్నది.

ఎం. క్రిష్ణవేణి (హైదరాబాదు)



హైదరాబాదు ఆంధ్రపత్రిక ఏజంటు శ్రీ ఎం. శివనారాయణగారి ప్రథమ పుత్రిక చి. సౌ. అనంతలక్ష్మికి శ్రీ శిలవేరి వెంటయ్యగారి ప్రథమ పుత్రుడు చి. ప్రభాకర్‌కు యిటీవల హైదరాబాదులో వైభవంగా వివాహం జరిగింది. వివాహానికి పలువురు ప్రముఖులు విచ్చేసి వధూవరులని ఆశీర్వదించారు.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 20—6—'69

శ్రీసౌమ్యనామ సం॥ అధికాషాఢ శుద్ధ పంచమి

సంపుటము : 61 సంచిక : 43

స్థాపితము :
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
4, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటి విజయలలిత ('సప్తస్వరాలు'లో)


ముస్లిం మతోద్ధారణ కోసం
మలప్పురం జిల్లా
కేరళ మంత్రివర్గం
నిర్ణయం
ముస్లిం ప్రజానీకం
తెలంగాణా
గొడవల్లో
కేంద్రం
జోక్యం
తెలంగాణా
నీళ్లు
పర్వతాల బదిలీ!
భారతదేశంతో
స్నేహం
కోసం
భారతదేశంపై
పాకిస్తాన్
కన్నెర్ర
ఈగుఱ్ఱం మీ
చెప్పు చేతల్లో
నడుస్తుంది.
నడుం కట్టండి.
తమిళనాడు కాంగ్రెస్

రష్యా అనుకరణ అన్నిట్లోనూ ఉందా?

ప్రధానమంత్రి మేనత్తగారు మేడమ్ విజయలక్ష్మీ పండిట్ ఒకసారి లాల్‌బహదూర్ శాస్త్రి గారి ప్రభుత్వాన్ని 'సందిగ్ధావస్థ' బందీ అన్నారు. ఇప్పటి భారతప్రభుత్వం ఇంకా బందీగానే ఉంటున్నదని ఎందరో పత్రికా రచయితలు—జార్జి వెర్గీస్, ఫ్రాంక్ మొరేస్‌ల వంటివారు—రాస్తున్నారు. దానివల్ల భారతదేశ ప్రజలు ఎంత నష్టపోతున్నారో వివరిస్తున్నారు.

సందిగ్ధావస్థ

ఇండియన్ ఎయిర్లయిన్స్ కార్పొరేషన్ వారు కొత్త విమానాలు కొందామనుకుంటున్నారు. ఏ విమానాలు కొనాలో ప్రభుత్వం వారు నాలుగు నెలల నుంచి ఆలోచిస్తున్నారు. ఇంత దాకా ఏ నిర్ణయానికీ రాలేదు. దీనికి సంబంధించిన మంత్రి గారు నాజీ జమ్మూ, కాశ్మీరు మహారాజావారు. వారు ఎప్పుడు చూసినా విదేశయాత్రలు చేస్తూ వుంటారు. దానివల్ల ఇతరదేశాల యాత్రికాదాయాలు పెరగవచ్చుగాని భారతదేశంలో (విదేశ యాత్రికుల వల్ల వచ్చే ఆదాయం మాత్రం తగ్గింది. పోయిన సంవత్సరం యాత్రికుల సంఖ్య పెరిగినట్టు లెక్కలు చెప్తాయి; ఇది యదార్థ పరిస్థితిని సూచించే లెక్కలుకావు. ఎందుచేత నంటే, పోయిన ఏడాది భారతదేశంలో ఎన్నో సమావేశాలు జరిగాయి. వాటికి ఎందరో విదేశ ప్రతినిధుల వచ్చారు. వారివల్ల అంకెలు పెరిగాయి.

కూటిఖర్చులు

ఇక ఇండియన్ ఎయిర్లయిన్స్ పయిలట్లు భత్యాలు పెంచమని సమ్మె చేశారు. మనది పోషలిస్టు విధానాలని అనుసరించే దేశం. ఈ దేశంలో కోట్ల మందికి రోజూ కడుపునిండా భోజనం దొరకటం లేదు. ఇటువంటి దేశంలో పయిలట్లు మధ్యాహ్నం భోజనానికి ఎనిమిది రూపాయలు, రాత్రి కూటికి ఇరవయి రెండు రూపాయలు, 'టీ'కి అయిదు రూపాయలూ కావాలంటున్నారు. విమానాలలో ప్రయాణాలకి ఇచ్చే ఆహారం వారికి నచ్చదు.

ఇండియన్ ఎయిర్లయిన్స్‌లో డ్రయివర్‌కి నెలసరి ఆదాయం రు. 500. సామాను ఎక్కించి, దింపే మనిషికి సుమారు రు. 300, ఇంకా ఎక్కువ కూడా. పోయిన ఏడు 10 మంది సీనియర్ పయిలట్లు రు. 72,438 జీతం, భత్యాలుగా ఆర్జించారు. 12,000 పన్ను(టాక్స్) లేని ఎలవెన్సులు.

లాలాజీ

ఇం. ఎ. కా. పయిలెట్లు తరుచు సమ్మె చెయ్యటానికి కారకులు లాలా గుల్జారీలాల్‌నందా గారు. సుమారు 10 సంవత్సరాల క్రితం, విమానదళం పయిలట్లని ఇం. ఎ. కా. విమానాలని తోలేట్లు ఏర్పాట్లు చెయ్యాలని కేంద్ర మంత్రివర్గంలో సూచించటం జరిగింది. అప్పుడు లాలాజీ ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు అధ్యక్షులు. వారే ఈ సూచనని తోసివేశారు. పని చేసేవారికి సమ్మె చేసే హక్కు ఉందని వారు చెప్పారు, ప్రభుత్వం వారికి ఈ హక్కుని రద్దు చేసే హక్కులేదని అన్నారు. లాలాజీ సిద్ధాంతాల ధర్మమా అని ప్రభుత్వం లక్షలు నష్టపోయింది. జనానికి ఇబ్బంది సంగతి సరేసరి.

మేడమ్ గాంధీగారు ప్రభుత్వరంగం సంస్థల పక్షం వహిస్తూ మాట్లాడుతూ ఉండగానే వీటిలో ఒకటి అయిన ఇం. ఎ. కా.కి పగుళ్లు కనిపించటం మొదలుపెట్టాయి. ఇం. ఎ. కా. మాదిరి సంస్థ. ఎయిర్ ఇండియా కూడా ప్రభుత్వరంగం సంస్థ., కాని ఆ సంస్థ ఇం. ఎ. కా.తో పోటీ పడకుండా ప్రభుత్వం అడ్డం వస్తోంది.

తినరాని తిండి


అనుభవం మీద ఎందరో చెప్పగలిగింది—విమానాలలో తిండి తినటం కష్టం. ఎయిర్ హోస్టెస్‌లు ఎలిజబెత్ మహారాణి—2 తో పోటీ పడుతున్నట్లు ప్రవర్తిస్తారు. ఈ సంస్థకి సంబంధించిన మంత్రి గారు నాజీ మహారాజు, అధ్యక్షులు లాలా భరత్‌రామ్, అయినా ఇం. ఎ. కా. వారు ప్రయాణీకులని గమనించలేకపోతున్నారు.

రష్యాలో విమాన చోదకులు తరచు సమ్మె చేస్తే ప్రభుత్వం వయిఖరి ఎలా ఉంటుంది? రష్యాలో ఎన్నిరకాల యూనియన్లు ఉన్నాయి? అన్నీ కమ్యూనిస్టు పార్టీ చేతికిందవే కదా? రష్యాలో సమ్మెలని నిషేధించే శాసనాలు లేవు కాని అవి ప్రభుత్వానికి ప్రతికూలమయిన కార్యక్రమాల క్రింద పరిగణింపబడుతాయి కాబట్టి సోషలిస్టు శాసనాల ప్రకారం ప్రభుత్వ చర్యలకి గురి అవగలవు.

రష్యా అనుకరణ

రష్యా గురించి ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే నేడు రష్యాని అనుకరించటం రాజధానిలో కొందరు పెద్దమనుష్యులకి అలవాటుయిపోయింది. కొన్ని వారాల క్రితం రష్యా నాయకుడు శ్రీ కోసిజిన్ ప్రధానమంత్రిని చూడటానికి వెళ్లినప్పుడు మేడమ్ గాంధీగారు ఆయన కోసం గది బయట కాచుకుని వుంచున్నట్లు ఒక ఫోటో పడింది. బ్రిటిష్ రాణి గాని, అమెరికా అధ్యక్షుడు గాని వస్తే మేడమ్ గాంధీగారు అలాగ నుంచుంటారా?

'సందిగ్ధావస్థ విధానాలు' (వీటినే కాన్సెన్సస్ విధానాలని కూడా అంటారు కొందరు) పశ్చిమ బెంగాలులో, తెలంగాణాలో ఎన్నో అరాచకాలకి దారి తీస్తున్నాయి. కలకత్తాలో నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్దేశాలు అందరికీ తెలిసినవే.



విజయవాడలోని భారతీ మహిళామండలి ప్రాంగణంలో యిటీవల శ్రీ త్యాగరాజస్వామి 202 వ జయంత్యుత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ సంగీత సభల సమాఖ్య, శ్రీ త్యాగరాజసొసైటీ జయంత్యుత్సవ కమిటీ సంయుక్తంగా జరిపాయి. ఈ సందర్భంలో పలువురు ప్రముఖుల ఊరేగింపు చేశారు, సంగీతకచేరీలు జరిగాయి. ఊరేగింపు సందర్భంలో శ్రీయుతులు ఎం. ఎస్. రామబ్రహ్మ శర్మ, పేకాటి వెంకటేశ్వర్లు, మద్దులపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి, అన్నవరపు రామస్వామి, రామగోపాలం, కె. వి. సుబ్బారావు ప్రభృతులని చిత్రంలో చూడవచ్చు.

అయిదు సంవత్సరాలలో పోలీసులని, విద్యార్థులను బాగా మార్చి భారతదేశంలో చిన్న సోవియట్ ఒకటి ఏర్పరుస్తారు.

తెలంగాణా

తెలంగాణా పరిస్థితి వేరు.

ఫజలాలీకమిషన్ అప్పుడే తెలంగాణాని వేరే రాష్ట్రంగా ఏర్పరచాలని సలహా ఇచ్చింది ఆంధ్ర ప్రదేశ్‌లో ఇన్ని సంవత్సరాల తర్వాత భావసమైక్యత ఏర్పడ లేదంటే ఆంధ్రప్రదేశ్ నాయకులదే కదా బాధ్యత?

రెండు తప్పులు ఒక ఒప్పు కావు (రెండు మైనస్లు ఒక ప్లస్ అయినట్లు) తెలంగాణా ఉద్యమం దవుర్జన్యాలకి లొంగటం తప్పు. అసలు ఆంధ్ర దేశం ఒకరు ఉపవాసంచేసి మరణించటం వల్ల ఏర్పడింది

1947 తర్వాత

1947 తర్వాత భారత ప్రభుత్వం ఎవరు దుండగీతనం చేసిన వారికి లొంగిపోతూ వచ్చింది. అందుచేత రాజకీయాలలో దవుర్జన్యం పెరిగింది ఎక్కడయినా గొడవ వచ్చేట్లు ఉంటే దానిని ఎదురు చూసి నడుచుకొనటం ప్రభుత్వం కర్తవ్యం ఈ కర్తవ్యాన్ని భారతప్రభుత్వం ఎప్పుడూ నెరవేర్చ లేదు. ఈ సంగతి గొడవచేసే వారికి ఎందరికో తెలుసు. ప్రభుత్వం గట్టిగా ఉంటే తమ ఆందోళన తగ్గించుకుంటారు.

పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, కేరళ, పంజాబు లలో కాంగ్రెసుకి మంచి దెబ్బలు తగులుతున్నాయి. కాంగ్రెసు అధ్యక్షులు మాత్రం పెద్ద విదేశ యాత్ర మీద వెళ్లారు. విదేశాలలో వారికి ఇప్పుడేమిటి పని?

అమాయకుల కష్టాలు

తిరిగి తెలంగాణా— కొందరు అమాయకులు, మంచీ—చెడ్డా తెలియనివారు కష్టాలకి గురి అయ్యారు. కొందరు మంత్రి పదవులు పొందలేక పోవటమే దీనికి కారణం కష్టాలు పడ్డవారు మంత్రులు ఎప్పుడు కాగలరు?

ఇంకొక ముఖ్యమయిన సంగతి గమనించాలి.

'హిందీ—ఇతర' రాష్ట్రాలన్నీ చీలిపోతున్నాయి. కేరళ, మయిసూరు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల వారి మధ్య అయిక్యమత్యం ఏర్పడే అవకాశాలు తగ్గిపోతున్నాయి

ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోతే హిందీ అభిమానులకే లాభం

తెలంగాణా వస్తే కమ్యూనిస్టులకే లాభమే.

మేడమ్ గాంధీగారు ఆఫ్ఘనిస్తాన్‌కి వెళ్లేముందు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారిని ఢిల్లీకి పిలిచారు, తామూ హైదరాబాద్ వెళ్లి వచ్చారు సేట్ శాంతి ప్రసాద్ జయిన్‌గారి పత్రికలు మేడమ్ గాంధీ గారి పర్యటనకి మంచి ప్రచారం చేస్తున్నాయి. మేడమ్ గాంధీ గారు అక్కడ (కాబుల్‌లో) ఏమి చేసి వస్తారు? వారు లేనప్పుడు శ్రీ మొరార్జీదేశాయి గారు ఇక్కడ ఏమి చేస్తారు, చెయ్యగలరు?

గడ్డు సమస్యకి ఎంత పరిష్కారాలు

గిరీశం బండివాడికి పెద్ద ఉపన్యాసం ఇవ్వగా ఆ బండివాడు ఈ ఊరి కానిస్టేబిలు ఎప్పుడు బదిలీ అవుతాడని అడిగాడుట. ఇది బండివాడి అజ్ఞానానికి తార్కాణం కాదు, గిరీశానికి పల్లెటూర్లని గురించి అంతగా తెలియదనటానికి మాత్రమే తార్కాణం! ఎవరో ఎప్పుడో అన్నట్లు ఎవరి గొడవలు వారివి ఈ గొడవలని చక్కబెట్టుకునే హక్కు కూడా వారిదే. చెడుదయినా స్వంత పరిపాలనే మంచి విదేశీ పరిపాలన కన్నా మంచిదని గాంధిగారే అన్నారు.

కాని, విదేశీ పరిపాలన అంటే ఏమిటి? ఇతర ప్రాంత పరిపాలనకూడా ఇదేరకమయినదేనా? ఇది కేవలం పాలితులు నిర్ణయించ వలసిన విషయం. పాలకులకి దీనితో ప్రమేయం లేదు

ఈ సిద్ధాంతాన్ని స్వీకరించిన తర్వాత ఎన్నో సందేహాలు కలుగుతాయి ఉదాహరణకి— పాలకులు ఎవరు, పాలింపబడేవారు ఎవరు? అని.

నేటి 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రాన్నే తీసుకోండి. దీనిని పాలించే వారు ఎవరు? ప్రజల ప్రతినిధులు ఈ ప్రతినిధుల నాయకులు ఎవరు? వారిలో వారు ఎన్నుకున్న వారే కదా!

ఇందులో పరప్రాంత పాలన ఏముంది? మనది ప్రజాస్వామ్య వ్యవస్థకదా? రాజులు లేక నవాబుల పరిపాలన కింద ఉండేది కాదుకదా? ప్రస్తుతం దేశాన్ని ఏలుతున్నది ఉత్తరప్రదేశ్ వారూ, ఆతర్వాత గుజరాత్‌వారూనా?

ఈ ప్రశ్నలకి ఎవరూ సమాధానం ఇవ్వలేరేమో!

ఒకవేళ ఇద్దామనుకున్నా 'సహజీవనం' అని సనగ వలసి రావచ్చు. అలా నసిగిన తర్వాత సహజీవనం వీలు కానప్పుడు విడిపోవటమే శ్రేయస్కరం అని అంగీకరించి తీరవలసి వస్తుంది

ప్రస్తుతం తెలంగాణాలో (చాలా భాగాలలో) ఆంధ్రప్రదేశ్‌నుంచి తాము విడిపోతామని కొందరు తీవ్రమయిన ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు.

కారణాలు ఏవయితే నేమి ఈ ఉద్యమం దుర్భరమయిన పరిణామాలకి దారి తీసింది. తెలంగాణాలో ఎందరో ప్రజలలో ప్రగాఢద్వేష భావాలని రగుల్కొలిపింది. ఈ ద్వేషభావాల ఫలితాలని అందరూ ప్రతిదినం గమనిస్తూనే ఉన్నారు.

విరిగిన తర్వాత అతకటం కష్టం కలిసి ఉండటం వీలుకానప్పుడు విడిపోవటమే మేలు. ఇది అందరికీ తెలిసినదే!

అయితే విడిపోయినప్పుడు అందరికీ న్యాయం జరగాలి.

ఈ సందర్భంలో ఒక చిన్న ఉపమానం చెప్పవలసి వస్తోంది కొందరు కలిసి ఒక వ్యాపారం పెడ్తారు. భాగస్వాములలో ఒకరికి పెద్ద ఇల్లు ఒకటి ఉంది. అది పెద్దదే కాని చాలా మరమ్మత్తులు ఉన్నాయి అందరూ దానిని వ్యాపారానికి కార్యాలయంగా వాడుకొనటానికి నిశ్చయించుకుని దానిని తగిన కర్చుతో బాగు చేయించుకుంటారు. కొన్ని సంవత్సరాలు— పదమూడే అనుకోండి!— వ్యాపారం చురుగ్గా జరుగుతుంది. ఇంతలో భాగస్వాముల మధ్య పేచీలు., పేచీలు దుర్భరం అయిపోయి, వ్యాపారం విడిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. పంపకాలు మొదలవుతాయి. వాటాలు చాలా మట్టుకు తేలికగా పంచ తగినవే. కాని, కార్యాలయం కట్టడం మాట ఏమిటి? దాని మీద జరిగిన కర్చు ఎవరు భరిస్తారు?

న్యాయం ప్రకారం కర్చులన్నిటినీ అందరు భాగస్వాములూ భరించ వలసినవే!

న్యాయం తెలిసిన ఇంటి సొంతదారు దీనికి ఒప్పుకుంటాడు.

ఒప్పుకోక పోతే? విడిపోవటం కష్టం!

నేటి హైదరాబాదు పరిస్థితి కూడా ఇలాగే ఉంది విశాలాంధ్ర రాజధాని కాబట్టే అందులో అంత అభివృద్ధి జరిగింది. ఈ అభివృద్ధికి అన్ని విధాలా 'ఆంధ్ర' ప్రాంతం వారే ప్రధాన కారకులు. వారి వల్ల ఏర్పడిన అభివృద్ధి ఫలితాలు వారికి పూర్తిగా రాకుండా చెయ్యాలనటం న్యాయంగా కనిపించదు.

అసలు 'ఆంధ్ర' ప్రాంతంవారు హైదరాబాదుకి ఎలా వచ్చారు? విశాలాంధ్రరాష్ట్రంలో భాగస్వాములుగా వచ్చారు యాచకుల్లుగానూ రాలేదు, ప్రభువులుగానూ రాలేదు.

ఎందరో తెలంగాణావారు డాక్టర్లుగా, కూలీలుగా, ఇంజనీర్లుగా, దర్జీలుగా, పెద్ద ఆఫీసర్లుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలకి వెళ్లారో అలాగే కొందరు ఆంధ్ర ప్రాంతంవారు తెలంగాణా అందులోనూ రాజధాని అయిన హైదరాబాదుకీ వచ్చారు.


ఈ విధంగా 1956 నుంచి వచ్చారు. ఎందరో ఉద్యోగార్థం, (వ్యాపారార్థంకూడా) వచ్చి స్థిరపడి పోయారు. తమ జీవిత సర్వస్వాలని ధారపోసి స్థిరనివాసం ఏర్పరచుకున్నారు చాలా మంది.

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఉన్నప్పుడే వారిని ఈవిధంగా హింసిస్తున్న తెలంగాణా తీవ్రాభిమానులు ప్రత్యేక తెలంగాణా వస్తే ఏమి చేస్తారు?

అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిని రక్షించటానికి ఇప్పుడే తన కర్తవ్యాన్ని నిర్వహించటం లేదు రేపు తెలంగాణా రాష్ట్రం వస్తే అప్పటి ప్రభువులు వీరిని కాపాడుతారా? ఇది లోకజ్ఞానం ఏమాత్రమయినా ఉన్నవారు నమ్మదగ్గ విషయమేనా?

కాదని జనవరినుంచి జరుగుతూ వస్తున్న సంఘటనలే చెపుతున్నాయి.

అందుచేతనే ఎంతో తెలంగాణాకి చెందని జనాభా కల హైదరాబాదుని అంత తేలికగా ఎవరికీ 'ఇచ్చివెయ్యటం' కూడదు.



అసలు తెలంగాణా 'ఇచ్చేది' ఎవరు? పుచ్చుకునేది ఎవరు?

తెలంగాణా ప్రజలే కదా?

అయితే వీలయినంత త్వరలో తెలంగాణాలో ప్రజాభిప్రాయ సేకరణకి ఏర్పాట్లు చెయ్యాలి. ఈ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారమే నిర్ణయం అమలు పరచాలి.

తెలంగాణాలో చేరమనే జిల్లాలవారిని ఆంధ్రప్రాంతంలో చేరనివ్వాలి

అన్నిటికన్నా ముఖ్యం ఎందరో ఆంధ్ర ప్రాంతంవారి కృషివల్ల అభివృద్ధి చెందిన హైదరాబాదుని ప్రత్యేక ప్రాంతంగా కేంద్ర పరిపాలన కింద ఉంచటం ఉత్తమం.


అప్పుడు హైదరాబాదుకి నేటి బెర్లిన్ పరిస్థితి ఏర్పడవచ్చు. ప్రస్తుతం జరుగుతున్న దానినంతా చూస్తే ఇదే సమస్యలన్నిటికీ పరిష్కారం అనిపిస్తుంది.

— తెలంగాణా శ్రేయోభిలాషి

భూలోకంలో యమలోకం

ముగ్గురు మూర్ఖులు

*** మహేష్ ***



'మనదేశంలో రోజురోజుకూ సమస్యలు పెరిగిపోతున్నాయి' అన్నాడు చూడామణి.

'అవును. పెరిగిపోతున్నాయి. అయినా వీటిని యేదో ఒకవిధంగా పరిష్కరించ వచ్చును. కాని యెవరూ పరిష్కరించలేని ముఖ్యమైన సమస్య ఒకటి మన దేశానికి ఉంది' అన్నాడు చిదంబరం.

'ఏమిటది?'

'1968 వ సంవత్సరం నవంబరు నెలలో యిందిరా నెహ్రూ గాంధీ యిలాగ అంది 'మనదేశం చాలా పెద్దది. దేశ పరిమాణమే ఒక సమస్య' అన్నాడు చిదంబరం.

'అవును. దేశ పరిమాణమే ఒక సమస్య అయినప్పుడు యెవరుమాత్రం యేం చెయ్య గలరు?' అని ప్రశ్నించాడు చంచ్రలావు.

'ఏం? చెయ్యకేం? దేశ పరిమాణాన్ని తగ్గించడానికి యిదివరకు జవహర్‌లాల్ నెహ్రూ కృషి చేశాడు. ఇప్పుడు ఆయన కుమార్తె కూడా శక్తివంచన లేకుండా అందుకు కృషి చేస్తూ ఉంది. జవహర్‌లాల్ నెహ్రూ బెరుబరీని పాకిస్తానుకు యిచ్చివేశాడు. ఆయనకాలంలోనే చైనా నేఫా ప్రాంతాన్ని ఆక్రమించుకొంది.

'ఇందిరా నెహ్రూ గాంధి యిప్పుడు కచ్ ప్రాంతాన్ని పాకిస్తానుకు ధారాదత్తం చేసింది. కచతీవు విషయంలో సింహళదేశం వివాదాన్ని లేవతీసింది.' అంటూ చూడామణి తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

'ఏవస్తువైనా, అది పెద్దదో, చిన్నదో యెవరూ చెప్పలేరు. ఇంకో వస్తువుతో పోల్చినప్పుడే మొదటివస్తువు పెద్దదని గాని చిన్నదనిగాని చెప్పవచ్చును.'

'ఉదాహరణకు ఆవు పెద్ద జంతువా? చిన్న జంతువా? అని ప్రశ్నిస్తే యెవరైనా సమాధానం చెప్పగలరా? మేకతో పోల్చితే ఆవు పెద్ద జంతువు. ఏనుగుతో పోల్చితే ఆవు చిన్న జంతువు.

ఇందిరానెహ్రూగాంధి 'మన దేశం పెద్దది' అని అన్నదంటే మనదేశాన్ని ఆమె తన సామర్థ్యంతో పోల్చినదన్న మాట. ఆ పోలికలో తన సామర్థ్యం చిన్నదిగాను దేశం పెద్దదిగాను ఆమెకు కన్పించాయి. అందుచేతనే ఆమె 'దేశం పెద్దది' అని ప్రకటించింది. దేశ పరిపాలాభారాన్ని వహించే సామర్థ్యం తనకు లేదని ఆమె యీ విధంగా చెప్పిందని మనం ఊహించవచ్చును. ఈ పరిస్థితిలో ఆమె ప్రదానమంత్రి పదవికి రాజీనామా యిచ్చివేయడం ఉచితం.'

అయినా 'దేశం పెద్దది అయిపోయింది' అనే ప్రధానమంత్రిణి, జాతీయత అంటే యేమిటో తెలియని దేశీయాంగమంత్రి దేశానికి లభించడం దేశంయొక్క దురదృష్టం' అన్నాడు చూడామణి.

'ఏం? మన దేశీయాంగమంత్రికి జాతీయత అంటే యేమిటో తెలియదా?' అని ప్రశ్నించాడు చిదంబరం.

'తెలియదు' అని అంటూ చూడామణి చెప్పడం ప్రారంభించాడు.

'1968 వ సంవత్సరం డిశెంబరు నెలలో దేశీయాంగమంత్రి చవాన్ రాజ్యసభలో ప్రసంగించాడు: హిందూరాజ్యవాదం సెక్యులరిజాన్ని వ్యతిరేకిస్తుంది కాబట్టి ఆయన హిందూరాజ్యవాదాన్ని తిరస్కరించాడు. ఆ సందర్భంలో ఆయన యిలాగ అన్నాడు. 'సెక్యులరిజాన్ని వ్యతిరేకించే వారు జాతీయ వ్యతిరేకులని చెప్పడానికి నేను సందేహించను.'

'హిందూరాజ్యవాదం మంచిదా? చెడ్డదా? అనే విషయాన్ని గురించి నేను యిక్కడ చర్చించడం లేదు. జాతీయతకు సెక్యులరిజానికి సంబంధం ఉన్నదా? అనే విషయాలను గురించే నేను చెబుతున్నాను.'

'సెక్యులరిజమే జాతీయత. హిందూ రాజ్యాన్ని కోరేవారందరూ జాతీయ వ్యతిరేకులు' అనే చవాన్ వాదాన్ని మనం అంగీకరించినట్లయితే, యింతవరకు మనకు గల అభిప్రాయాలను చాలా మార్చుకోవలసి ఉంటుంది.

'మొగలాయి పరిపాలకులను యెదిరించి హిందూరాజ్యాన్ని స్థాపించిన ఛత్రపతి శివాజీ జాతీయ వ్యతిరేకి. హిందూరాజ్యం కోసం అష్టకష్టాలను అనుభవించిన రాణాప్రతాప్ కూడా జాతీయ వ్యతిరేకి. హిందూరాజ్య రమావల్లభుడయిన శ్రీకృష్ణదేవరాయలు జాతీయ వ్యతిరేకి అని వేరే చెప్పవలసిన అవసరం లేదు.

ఇక ఆధునికుల విషయాన్ని ఆలోచిద్దాం. 'హిందూ ధర్మం భారతదేశం యొక్క ఆత్మ' అని ప్రకటించిన స్వామీ వివేకానంద జాతీయ వ్యతిరేకి. 'హిందూమతం లేని భారతదేశం శవంతో సమానం' అని అన్న అనీబిసెంటు జాతీయ వ్యతిరేకి. రామరాజ్యం కోసం కృషి చేసిన మహాత్మగాంధీ జాతీయ వ్యతిరేకి. హిందూమతం యెడల అపారమైన భక్తి శ్రద్ధలను కలిగిన తిలక్, మాలవ్యాల వంటి వారందరూ కూడా జాతీయ వ్యతిరేకులే కాగలరు.'

'అంతేకాదు. జాతీయతను గురించి చవాన్ యిచ్చిన నిర్వచనాన్ని మనం అంగీకరించినట్లయితే మరొక విషయాన్ని కూడా ఒప్పుకోవలసి ఉంటుంది. పాకిస్థానులో సెక్యులరిజం లేదు. అక్కడ యిస్లాం జాతీయమతం. సింహళంలో సెక్యులరిజం లేదు. అక్కడ బౌద్ధమతం జాతీయమతం. ఇలాగే చాలా దేశాల్లో సెక్యులరిజం లేదు. ఏదో ఒక మతం ఆయా దేశాల్లో జాతీయమతంగా ఉన్నది. పై దేశాల్లో సెక్యులరిజం లేదు కాబట్టి చవాన్ వాదం ప్రకారం ఆ దేశాల్లో అసలు జాతీయత అనేదే ఉండడానికి అవకాశం లేదు. ఆ దేశాల్లో ఉన్న వాళ్లందరూ జాతీయ వ్యతిరేకులే అని మనం చెప్పవలసి ఉంది' అన్నాడు చూడామణి.

'నువ్వు చెప్పినదాంట్లో ఒక తేడా కన్పిస్తుంది. జాతీయత అంటే యేమిటో 1968వ సంవత్సరంలో దేశీయాంగ మంత్రి చవాన్ వివరించాడు.

'కొన్ని వందల సంవత్సరాలకు పూర్వం ఉన్న శివాజీ, రాణాప్రతాప్ వంటి వారలకు యిప్పటి వివరణ వర్తిస్తుందా?'

'అలాగే చవాన్ భారతదేశంలోని జాతీయతను గురించి చెప్పాడు గాని విదేశాల్లోని జాతీయతను గురించి చెప్పలేదు కదా! అటువంటప్పుడు యీ వివరణను అనుసరించి విదేశాల్లో అందరూ జాతీయ వ్యతిరేకులే కాని, జాతీయవాదులు యెవరూ లేరని చెప్పడం సరియైనదేనా?' అని ప్రశ్నించాడు చిదంబరం.

'జాతీయత అనేది సర్వకాలీనము; సర్వదేశీయము. ప్రేమ, త్యాగం, బాధ మొదలైన పదాలకు యే కాలంలోనైనా యే దేశంలోనైనా ఒకే నిర్వచనం అమలులో ఉంది. జాతీయత కూడా అటువంటిదే. దేశాన్ని బట్టిగాని కాలాన్ని బట్టి గాని జాతీయతకు అర్థం మారిపోదు. ఏ కాలంలోనైనా సరే, యే దేశంలోనైనా సరే జాతీయతకు ఒకటే అర్థం' అన్నాడు చూడామణి.

'ఏమిటా అర్థం?' అని చిదంబరం ప్రశ్నించగా చూడామణి తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

'ఏ పరిస్థితిలోనైనా సరే దేశశ్రేయస్సునే ప్రధానంగా తలచే వారందరూ జాతీయవాదులు.

'మత సంబంధమైన కారణాల వల్లగాని రాజకీయ సిద్ధాంతాలవల్లగాని, ఆర్థిక కారణాల వల్లగాని దేశశ్రేయస్సుకంటే కూడా మరొక దాన్ని ప్రధానంగా తలచే వారందరూ జాతీయ వ్యతిరేకులు.'

'జాతీయత అనే భావం స్వతంత్రమైనది. సెక్యులరిజంమీద కాని మరొక సిద్ధాంతంమీద కాని అది యెంతమాత్రం ఆధారపడలేదు. అందుచేత సెక్యులరిజాన్ని వ్యతిరేకించేవారందరూ జాతీయ వ్యతిరేకులు కానవసరంలేదు.'

ఇవ్వాళ చవాన్ 'సెక్యులరిజమే జాతీయత' అంటున్నాడు. రేపు యింకొకరు 'సోషలిజమే జాతీయత' అనవచ్చును. ఇంకోనాడు యిందిరా నెహ్రూగాంధీ ఇలాగన వచ్చును. 'జాతీయత అంటే వేరే యేమీ లేదు. నేనే జాతీయత. జాతీయతే నేను. అందుచేత నన్ను అనుసరించేవారందరూ జాతీయవాదులు. నన్ను వ్యతిరేకించే వారందరూ జాతీయ వ్యతిరేకులు.'

'ఇప్పుడు చవాన్ వాదాన్ని మనం అంగీకరించినట్లయితే తరవాత యిందిరా నెహ్రూ గాంధీ వాదాన్ని కూడా అంగీకరించవలసి ఉంటుంది'

'ఇక్కడ మనం యింకొక విషయాన్ని కూడా ఆలోచించాలి. భారతదేశంలో ప్రస్తుతం హిందువుల సంఖ్య అధికంగా ఉంది కాబట్టి హిందూరాజ్యం కావాలని కొంతమంది హిందువులు కోరుతున్నారు. 'ఇది జాతీయ వ్యతిరేకత' అని దేశీయాంగ మంత్రి చవాన్ స్పష్టంగా ప్రకటించాడు.

'భారతదేశంలో మహమ్మదీయుల జనాభా 51% ఉండాలని అల్ జమయత్‌వంటి పత్రికలు రాస్తున్నాయి. అప్పుడు భారతదేశాన్ని యిస్లామిక్ రిపబ్లిక్ చెయ్యవచ్చునని వారి ఉద్దేశం. ఇదీ సెక్యులరిజాన్ని వ్యతిరేకిస్తున్నది. అయినా యిది జాతీయ వ్యతిరేకత అని చవాన్ ప్రకటించలేదు.

'అలాగే క్రైస్తవమత ప్రచారకులు 'యిండియా ఫర్ క్రైస్ట్' అనే నినాదంతో ప్రచారంచేస్తూ హిందువులను క్రైస్తవులుగా మార్పిచేస్తున్నారు. భారతదేశంలో క్రిస్టియన్ల సంఖ్య పెరిగితే దీన్ని 'క్రిస్టియన్ రిపబ్లిక్' చేయవచ్చునని వారి అభిప్రాయం. ఇది సెక్యులరిజానికి వ్యతిరేకమే అయినా 'యిది జాతీయ వ్యతిరేకత' అని చవాన్ ప్రకటించలేదు.'

'మహమ్మదీయులు, క్రైస్తవులు దేశంలో తమ సంఖ్యను పెంచుకొనడానికి ప్రయత్నం చేస్తున్నారు. అదే సమయంలో హిందువుల జనాభాను తగ్గించడానికిగాను ప్రభుత్వం కుటుంబనియంత్రణను అమలు జరుపుతున్నది. హిందువుల శ్రేయస్సులు కోరే నాయకుడొక్కడూ కూడా లేడు' అన్నాడు చూడామణి.

'ఈ విషయంలో ప్రభుత్వాన్ని యేమీ అనడానికి వీలులేదు. దేశంలో జనాభా రోజురోజుకు పెరిగిపోతుంది. ఈ పెరుగుదలను ఇప్పుడు అరికట్టకపోతే యిముందు చాలా యిబ్బందులు కలుగుతాయి. అందుచేత ప్రభుత్వం కుటుంబనియంత్రణను అమలు చేస్తున్నది' అన్నాడు చంద్రరావు.

జనాభా పెరుగుదలను అరికట్టడమే ప్రభుత్వంయొక్క లక్ష్యం అయితే 'యిద్దరు పిల్లలు పుట్టినతరువాత ప్రతి

(8వ పేజీ చూడండి)

భర్తను లొంగదీసుకోవడము ఎలా?

పరిమళా సోమేశ్వర్

ఎవతె మొగుణ్ణి లొంగదీసుకొనే ముందు ఆ మొగుడు స్వభావం ఎలాటిదో క్షుణ్ణంగా తెలుసుకుని ఉండాలి—మందు వాడేముందు డాక్టరు అసలు జబ్బేమిటో సరిగ్గా తెలుసుకున్నట్లు. జబ్బు కనుక్కున్నంత మాత్రాన ట్రీట్‌మెంట్ సులభం కానట్లే భర్త స్వభావం తెలిసినంతమాత్రాన యిట్టే అయన్ను లొంగదీసుకోగలమని భావించటం కూడా పొరపాటే!

కొందరి శరీరతత్వానికి ఎల్లోపతి మందు మంచిగా పనిచేస్తుంది. కొందరికి హోమియోపతి తప్ప మరోరకం మందు పంటబట్టదు. ఇంకా కొందరికి ఆయుర్వేదం ఘాటు నసాళానికి అంటితే తప్ప రోగం కుదరదు. కాబట్టి మొగుణ్ణి మచ్చిక చేసేముందు ఏ తీరున ఆయన్ను మచ్చిక చేసుకోవాలోకూడా నెమ్మదిగా ఆలోచించాలి.

ముందు భర్తలలోని రకాలు చూద్దాం. స్థూలంగా భర్తలను మూడు తరగతులుగా విభజించవచ్చు:

1. మూగి భర్తలు, 2. చిటపట భర్తలు, 3. సాధించే భర్తలు. మూగి భర్తలంటే అర్థం—భార్యచేసే పనులకు, ఆమె మాటలకు మౌనంగానే తిరస్కారాన్ని చూపేవారు.

కాస్త కాఫీకాయటం ఆలస్యం అయిందంటే, చొక్కాలాగూ తొడిగేసుకుని అనరాంతం చెప్పకుండా వీధిలోకి వెళ్లిపోతారు. హోటల్లో కాఫీ తాగివచ్చి యేమీ ఎరగనట్లే పేపరు చదువుకుంటూ కూర్చుంటారు. 'ఏమండీ ఇందాక కాఫీ కావాలన్నారు. కలుపుకొచ్చేసరికే ఐపు లేకుండా పొయ్యారే!' అని పెళ్లాం అడిగినా బెల్లంకొట్టిన రాయిలా మాట్లాడకుండా కూర్చుంటాడు. ఇంకా గట్టిగా అడిగితే 'నేనిప్వమన్నప్పుడు ఇవ్వలేదుగా. అందుకని హోటలుకెళ్లి తాగొచ్చేను' అంటూ అసలు సంగతి బయటపెడ్తాడు.

ఇంక జన్మలో ఆ యిల్లాలు కాఫీ ఆలస్యం చెయ్యదు. ఎన్ని పనులున్నా, ఓ పక్క అన్నం చిమిడిపోతున్నా, పప్పు మాడిపోతున్నా ముందాయనకి కాఫీ కలిపిచ్చి అప్పుడు మిగతా పన్లు చూసుకుంటుంది.

అలాగే కూరలో కాస్త ఉప్పుకాని, కారం కాని ఎక్కువయిందంటే చాలు, చటుక్కున చెయ్యి కడిగేసుకుని భోజనం ముందునుండి లేచి పోతారు. ఆ తరువాత భార్య ఆ కూర తింటే తప్ప ఏ మెక్కువయిందీ తక్కువయిందీ అంతుబట్టదు.

పెళ్లాన్ని కొట్టకుండా, తిట్టకుండా సమానంగా గౌరవిస్తున్నామనుకుంటారు యిలాటి భర్తలు. కాని కంచంలో చెయ్యి కడిగేసుకుని, తినే తినే అన్నం ముందు నుండి భర్త లేచిపోతే ఆడదానికి అంతకంటె రంపపు కోత యింకోటుంటుందా? అంతకన్న 'కూరలో కారం ఎక్కువెందుకు వేసేవు?' అంటూ ఓ దెబ్బ వేసే భర్తనే ఎక్కువ ప్రేమిస్తుంది స్త్రీ. మౌనం తోటి శాసించే భర్త కన్నా, ప్రేమతో శిక్షించే భర్తనే కాంక్షిస్తుంది ప్రతి స్త్రీ కూడా.

ఐతే యీ మూగి భర్తలను లొంగదీసుకోవటమనే సమస్య లేదు. ఎందుకంటే ఆంతర్యంలో మొండిగా ఉన్నా పైకి లొంగి ఉన్నట్లే కనపడతారు యీ రకం భర్తలు. ఈ రకం మనుషులను ఆ బ్రహ్మదేవుడు కూడా మార్చలేడు. నిజంగా నిద్రపోతున్న వాడిని మేల్కొలప వచ్చు. నిద్ర నటిస్తున్న వాడిని మేల్కొలపటం ఎంత దుస్సాధ్యం!

ఈ రకం మూగి భర్తలను పొందటం వల్ల ఉన్న ఒకే ఒక లాభం యేమంటే యిల్లు మాత్రం ప్రశాంతంగా ఉంటుంది. కలతలు, కలహాలు యేమీ ఉండవు. భార్యాభర్తల మధ్య మాటలున్నప్పుడే కదా, పోట్లాటలు కూడా రావటానికి అవకాశం ఉండేది!

మాట్లాడే చనువు కూడా లేనందున పోట్లాట లెప్పుడూ ఆమడ దూరంలో ఉంటాయి ఆ దంపతులకు. ఏ రకమైన ఫీలింగ్సూ లేని మొద్దు రాచిప్పలాటి స్త్రీ తప్ప కాస్త సెన్సిటివ్‌గా ఉండే ఏ స్త్రీ కూడా మూగి భర్తను భరించలేదని నా ఉద్దేశ్యం. ఐతే ఆ రకం యిల్లు పైకి ప్రశాంతంగా ఉన్నట్లు కనపడినప్పటికీ లోపల ప్రేమరాహిత్యంలో పడి మ్రగ్గిపోతుంటుంది స్త్రీ హృదయం. అందులోని మనుషులు ఒక కప్పు కింద నివసిస్తున్నా ఒకరికొకరు వెయ్యి యోజనాల దూరంలో జీవిస్తుంటారు. నిజంగా అలాటి బ్రతుకు ఒక పెద్ద శాపం!

ఇక రెండవరకం చిటపట భర్తలు.

ఈ రకం భర్తలు మన ఆంధ్రదేశంలో నూటికి తొంభైతొమ్మిది యిళ్లల్లో కనిపిస్తారు. ఏ చిన్న పొరపాటు జరిగినా బుస్సుమంటూ తారాజువ్వలా లేస్తారు. పులుసులో పోపుమాడటం దగ్గరనుండి, సిరాబుడ్డి ఒలికిపోవటం వరకు వీళ్లకు



చిరాకు తెప్పించని విషయమేంటూ ప్రపంచంలో—ఎట్‌లీస్ట్—యింట్లో—ఉండదు.

చాకలివాడు బట్టలు సమయానికి తేకపోయినా, చంటాడు వళ్లో కూర్చుని బట్టలు పాడుచేసినా, పెద్దాడు ఆ రోజు వచ్చిన న్యూస్‌పేపర్ చింపినా, పనిమనిషి అవసరమైన కాగితాన్ని చెత్తతోపాటు ఊడ్చినా, వీటన్నిటికీ బాధ్యురాలు భార్యేనని వీరి దృఢ విశ్వాసం. అందుకే యింట్లో తమ యిష్టానికి వ్యతిరేకంగా ఏ పని జరిగినా, ఏ చిన్న పొరపాటు దొర్లినా భార్యమీద విరుచుకు పడతారు యీ చిటపట బర్తలు.

'నిన్న సాయంత్రం ఏడింటికిస్తానన్న చాకలాడు యివ్వాళ ఉదయం ఎనిమిది గంటలైనా బట్టలింకా తేలేదెందుకు ? వాడికింత అలుసిచ్చింది నువ్వుకాదూ ? 'అన్నరోజుకు తేపోతే అయ్యగారూరుకోరు' అని వాడికి ముందే చెప్పక్కర్లేదూ నువ్వు ? ఇంట్లో ఆడదానివి, గృహిణివి—ఆ మాత్రం బాధ్యుండక్కర్లే నీకు ?'

పిల్లవాడు బట్టలు పాడుచేస్తాడని తెలిసి నావళ్లోయెందుకు కూర్చోపెట్టేవు ? ఆఫీసుకు వెళ్లబోతున్నానని తెలియదూ ? ఈ బట్టలన్నీ ఖరాబైగదా. మళ్లీ పెట్లోంచి యిస్త్రీ మడతలు తియ్యాలి. ఛ! ఎంతమంది పిల్లలు పుడితేనేం! ఇంకా ఎన్నాళ్లకి తెలిసొస్తాయ్ నీ కిలాంటి జాగ్రత్తలు ?'



'ఈ రోజొచ్చిన పేపరు నేనింకా చదవలేదని తెలియదూ ?' 'పేపరు కుర్రాడు అక్కడ పడేసేడేమోచూశ్లేదు' అంటావా పైగా. పేపరు ఏ టైముకి వచ్చేది నీకు తెలుసుకదా. టైముకు కాచుకుని కూర్చుని పేపరు రాగానే తీసి పైన పిల్లలకందకుండా పెట్టలేవూ ? ఆ మాత్రం భర్త మీద భక్తి, శ్రద్ధ లేకపోయేక ఎందుకు? ఈ మాత్రంకూడా నా నోటితో అడిగించుకోవాల్సిందేనా? నీకై నువ్వు బుద్ధిపుట్టి చెయ్యవుకదా ?'

'ఏదీ నేనిక్కడ పెట్టిన బ్రౌనురంగు పేపరేమయింది ? ఏమిటీ? పనిపిల్ల యిప్పుడే యిల్లూడ్చిందా? అయ్యోఖర్మ! చదువురాని పెళ్లాన్ని కట్టుకుంటే యింతే గతి! ఎంత మొద్దునైతేమాత్రం కాస్త పని పిల్ల యిల్లూడ్చేటప్పుడు ఏమేం ఊడ్చేస్తోందో కాస్త రెండుకళ్లూ పెట్టి చూడక్కర్లేదుటే ? ఎంత సేపూ ఆ వంటింట్లోపడి ఏడవటంతప్ప బయట యేం జరుగుతోందో, పనిది వాగిరాలే ఊడ్చేస్తోందో, వంకీకున్న చొక్కా జేబులోంచి డబ్బులే గుంజేస్తోందో చూట్టం అక్కర్లే ? ఇంకా ఎన్నేళ్లు కాపురంచేస్తే నీ కర్థమవతాయే యిలాంటి విషయాలన్నీ ? ఇంతకీ బుద్ధితక్కువ నాది. అకొగితంమీద

యిట్ పెట్టటం మరచేను''

ఇలా ప్రతివిషయానికి భార్యని కాల్చుకు తింటుంటాడు చిటపట భర్త. ఆ యిల్లాలు కనక సౌమ్యురాలైతే గుడ్లనీళ్లు కక్కుకోటమో మౌనంగా ఆ దీవెనలన్నీ వింటమే చేస్తుంది. ఇంక ఆవిడకూడా చిటపటమనిషి అయిందంటే దీపావళిపండగ అక్కర్లేకుండానే రోజూ ఆ యింట్లో సీమ టపాకాయలు పేలుతూంటయ్.

ఈ చిటపట భర్తలను లొంగదీసుకోవటానికి చాలానేర్పు, ఓర్పు కావాలి. సాధ్యమైనంతవరకు వాళ్లకు అసంతృప్తి, కోపం కలిగించే పనులు జరగకుండా జాగ్రత్తపడాలి. పొరపాటున అలాటిదేమన్నా



జరిగినా, ఆయనకోపాన్ని చిరునవ్వుతో ఎదుర్కోగల శక్తి ఉండాలి స్త్రీకి.

సాధారణంగా యిలా పైకి చిటచిట్లాడే మగవాళ్లు ఆంతర్యంలో చాలా మృదువుగా ఉంటారు. మృదుత్వాన్ని తెలివిగల భార్య మాత్రమే అర్థం చేసుకోగలదు. ఐతే ఎంత తెలివితేటలున్న భార్యయినా ఆమె కూడా మనిషేకదా! భర్త రుసరుసలాడుతూ అలా కోపావేశంతో తనని ముంచెత్తేస్తుంటే నిలదొక్కుకోవటం ఆమెకు ఎంతో కష్టం. అందుకే యీ రకం భర్తల కోపతాపాలకు తట్టుకుని విజయవంతంగా వారిని వశపరచుకోవాలంటే భార్యకు ఎంతో మనోబలం (ఒక్కోప్పుడు శారీరక బలంకూడా) ఉండటం అవసరం.

మూడవరకంవారు సాధించే భర్తలు.


సాధించటం ఆడవాళ్ల లక్షణం అనుకుంటారు చాలామంది. కాని మగవాళ్లలో కూడా యీ సాధించేరకం చాలా పెద్ద సంఖ్యలోనే ఉంటారు ముఖ్యంగా 'మొగుడు' స్థానాన్ని ఆక్రమించిన తరువాత మగవాడికి సంక్రమించే అనేక (అవ) లక్షణాలలో యీ సాధింపుకూడా ఒకటి.

అందునా చదువుకున్న భార్యలను చేసుకున్న మగవాళ్లలో చాలామంది యీ రకం జాబితాలోకి వస్తారు. వీళ్లకు పెళ్లాన్ని గట్టిగా నిలదీసి మొహంమీద తిట్టటానికి మొహమాటం! (లేదా కొందరి విషయంలో 'భయం' అన్నా నా కభ్యంతరం లేదు.) కాని మొగుడుస్థానంలో ఉండటంవల్ల తమకు లభించబోయే గౌరవ సత్కారాలకు లోటు రావటంకూడా భరించలేరు. మరోవంక అందువల్ల తమ మర్యాదకి భంగం కలిగినట్లు అనుమానం తోచినా, తమ యిష్టానికి వ్యతిరేకంగా ఏపనైనా భార్య చేస్తున్నట్లు పసిగట్టినా వీళ్లు తమ అసమ్మతిని సాధింపుధోరణిలో వ్యక్తం చేస్తుంటారు.

ఉదాహరణకి సినిమాకువెళ్తూ ఒకామె నీలంరంగుచీర, అదేరంగు జాకెట్టు వేసుకుందనుకోండి. ఆ డ్రెస్సులో ఆమె అందంగా కనపడినా, ఏ కారణంవల్లనో ఆయనగారికి కనుక ఆచీర నచ్చకపోతే యింక సాధించటం మొదలెడ్తాడు. 'జానే నేను ఎన్నిసార్లు ఆచీర కట్టుకోవద్దని చెప్పినా నువ్వు ఆచీరే పంతంకొద్దీ కట్టుకుంటావు కదా! ఆ గులాబిరంగు ఫుల్ వాయిల్‌చీర ఎంతో మనసుపడి కొన్నాను ఎప్పుడూ పెట్టెఅడుగున పడెయ్యటం తప్ప దాన్ని ఒక్కసారైనా కట్టుకున్న పాపాన పోవుకదా జాను. నాకు నచ్చినచీర నువ్వెందుకు కట్టుకుంటావు? ఎంత సేపూ నీ అందం, నీ షోకులూ తప్ప అవి నాకెంత ఆనందాన్ని కలిగిస్తున్నాయోనన్న ఆలోచన నీకుంటుదా? నీ అందం ఎవరికోసం? నీకోసం లోకం కోసమా, నీ భర్తకోసమా? అదో! అప్పుడే వచ్చేసింది కోపం. చదువుకున్న ఆడవాళ్లతో వచ్చిన చిక్కేయిది. గట్టిగా మాట్లాడితే నాకు నచ్చినచీర కట్టుకుంటానికి కూడా యింట్లో నాకు స్వాతంత్ర్యంలేదా?' అంటూ విరుచుకుపడ్తారు. అంతేతప్ప తనూ ఒకే ఆడదనీ, తనకే ఒక మొగుడున్నాడనీ యిష్టాలుంటాయనీ ఆలోచించ వద్దూ?'

ఇన్నిమాటలు చెప్పేకన్న బయల్దేరే ముందు 'చూడు యివ్వాళ అగులాబిరంగు చీరకట్టుకో. ఆ చీరలో నువ్వెంతో అందంగా ఉంటావు' అని ఆ మొగుడంటే యింక ఏ పెళ్లాం మాత్రం యింకో చీర కట్టుకోమన్నా కట్టుకుంటుందా? సినిమాకి వెళ్లనీ, పబ్లిక్ గార్డెన్సుకి పోనీ, పార్టీలకు హాజరవనీ పేరంటానికి పోనీ ఎప్పుడూ ఆ గులాబిరంగు చీర చిరిగి ముక్కలయ్యేదాకా దాన్నే కట్టుకుంటుంది' 'ఆ చీరలో నువ్వెంతో అందంగా ఉంటావు' అన్న వాక్య ప్రభావం ముందు ఎన్ని మంత్రాలు, గారడీలు కూడా పనికి రావు.

కాని వచ్చిన చిక్కల్లా యేమిటంటే యిలాటి చిన్న చిట్కాలే, కిటుకులే తెలియవు మగవాళ్లకు. నా ఉద్దేశ్యంలో కాస్త మగవాడు గనుక ఆడది అల్పసంతోషి అన్న అనల్పసత్యాన్ని అర్థంచేసుకుని తదనుగుణంగా ప్రవర్తించేడో ఏ సంసారం



లోనూ పొరపొచ్చాలంటూ ఉండవు. కాని ఆమాత్రం ఓర్పు, నేర్పు మగవాడికి లేవు. కాబట్టి నేను యిదంతా వ్రాయటానికి యిన్ని తిప్పలు పడవలసి వస్తోంది. వాళ్లకు లేని గుణాలు మనమన్నా అలవర్చుకుని సంసారాన్ని స్వర్గతుల్యంగా చేసుకుందామని నా తాపత్రయం!

(పైవారం: భర్తని లొంగదీసుకోడంలో మొదటి మెట్టు)

బి ఆర్, మద్రాసు

అలవాటా? వైరా అన్న మీ వ్యాసం చదివాక ఈ జవాబు రాయకుండా ఉండలేక పోయాను. ఇలాగే పనికివచ్చే వ్యాసాలకోసం చూస్తూంటాను.

మీకా వ్యాసం నచ్చినందుకు సంతోషం.

కె ఎమ్, హనుమకొండ

హైదరాబాదునుండి వెలువడే రంగవల్లి స్త్రీల కార్యక్రమానికి రచనలు పంపాలంటే ఏ ఎడ్రసుకి పంపాలి.

రంగవల్లి, స్త్రీల కార్యక్రమం, ఆలిండియా రేడియో, హైదరాబాదు

బి బిహెచ్, బెల్లంపల్లి

నవల వ్రాయునపుడు సందార్భాను సారంగా పాటలు వ్రాయవచ్చా రామలక్ష్మి గారు—

మహారాజులాగా వ్రాయండి భీమయ్యగారూ, నవలలో నాటకంలోలా డైలాగులు రాసినది యీ మధ్యనే ఓ నవల చదివాను మీరు వారికంటే వో అడుగు ముందేస్తానంటున్నారు కానివ్వండి

కె ఎస్. ఆర్, బెక్కం

ఆంధ్రప్రదేశ్‌లో, కాదు కాదు ఇండియా మొత్తంలో తెలుగు రచయితల వివరాలు కావాలంటే ఏంచేయాలి,

ది సదరన్ లాంగ్వేజస్ బుక్‌ట్రస్టు, పూనమల్లి హైరోడ్డు, మద్రాసు వారికి వ్రాయండి వారు అలాంటిదే ఓ పుస్తకం ప్రచురించారు

ఎమ్ ఏ, కొత్తగూడెం

నేటి ఆడపిల్లల వేషధారణలలో మగ వాళ్లని ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు.

పొరపాటు వారి సరదాకోసం వేసుకుంటున్నారనండి ఆకర్షించడం అన్నది సెకండరీ

సౌమ్యశ్రీ, హైదరాబాదు

అయినదానికి కానిదానికి భార్యమీద చేయి చేసుకొనే మా స్నేహితుడొకాయన ఉన్నాడు దగ్గిర స్నేహితులు బంధువులు ఏవిధంగి మందలించినా ఆయన మీరలేదు ఆయన రోగానికి మందేదైనా చెపుతారా ?

వద్దంటే మంకుతనం చూపే పసితనం వదలని ఆపెద్దమనిషికి తన పద్ధతిలో బుద్ధి చెప్పుకో కలదీ, చెప్పవలసినదీ—ఆయిన భార్య ఒక్కతే ఆవిడే పూనుకొని ఉంటే ఎప్పుడో మాన్పించ కల్గేది మీరంతా పెత్తందారీ తనం నెత్తిన వేసుకో కండి అనవసరం.

ఎస్ పి జగిత్యాల

ప్రేమ గుడ్డిదంటారు కదా. ఈ గుడ్డి ప్రేమకు చికిత్స అంటూ ఏమైనా ఉందాండీ ?

పెళ్ళి, పేరాజుగారూ ఈగుడ్డిప్రేమకు తగిన చికిత్స పెళ్లి

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

రజని, విజయనగరం

తన అందచందములు పోతాయని డబ్బా పాలతో పసిపిల్లల కడుపులు నింపే మాతృమూర్తులను ఏమని పిలవాలి ?

చాలామంది కిలాంటి అపోహ ఉంటుంది కాని నిజం దీనికి విరుద్ధం బాలెంతగా పాలివ్వని స్త్రీలు తరువాత కాలంలో వక్షానికి సంబంధించిన అనేక రోగాలకి గురి కావలసి ఉంటుందనీ— పాలివ్వక పోవడం, బిగువు బాడీలు ధరించడం మొదలైనవి కూడా బ్రెస్ట్ కాన్సరుకి కారణాలలో కొన్ని అనీ ఈ మధ్య ఒక రష్యనుపత్రికలో ప్రముఖ వైద్యుడొకాయన రాశాడు నాలుగేళ్లు వచ్చినా కూడా పాలిచ్చే అరబ్ మొదలైన తెగల స్త్రీలలో యీ వ్యాధి వాలా స్వల్పంగానూ, పిల్లల కసలు పాలివ్వక కృత్రిమంగా పాలను తీసేయించుకునే యూరోపియన్ మొదలైన తెగల స్త్రీలలో యీ వ్యాధి ఎక్కువగా ఉందనీ పరిశోధనలవల్ల తేలిందట ప్రకృతి సహజమైన వాటి పనికి నిరోధం కల్గించడంవల్లనే యీ వ్యాధి పొడసూపే అవకాశాలెక్కువ అని ఆవ్యాసంలో విపులంగా ఉంది పాలివ్వకపోతే అందం మిగిలి పోతుందనే అమాయకత్వం—విచారకరం

ఆర్ ఎన్ ఎస్ హుజూర్‌నగర్

ఆడవానిచేత అర్థము, మగవానిచేత బిడ్డ బ్రతకదంటారు. ఎందుచేత ?

అని పూర్వపు రోజుల్లో అనేవారు .

ఎమ్ ఎమ్ ఆర్ ఆదిలాబాద్

మీ రచనలో స్త్రీకి ఎక్కువ ప్రాముఖ్యం యిచ్చి పక్షపాతం చూపిస్తున్నారేమో.

కులమతాలకి, ఇవ్వకుండా స్త్రీకో పురుషుడికో యివ్వడం ఎంతోమెరుగు బ్రదర్,నన్నభినందించాలి.

వి ఎస్ హైదరాబాదు

మీరు సినిమాలో గయ్యాళిపాత్ర ధరిస్తే చాలా బావుంటారని నా ఉద్దేశ్యం.

వద్దు సుజాతా, నాకు మార్పుకావాలి— నిత్య జీవిత చలన చిత్రంలో ఆ వేషం వేస్తూనే ఉన్నానుగా?!

జి ఎస్ కొత్తగూడెం

ప్రకృతిలోని విశిష్టత ఏమిటి ?

నిత్యనూతనంగా ఉండడం

కె ఎస్. ఆర్. కె ఆర్. గుడివాడ

మిమ్మల్ని చూస్తే నాకు ఎందుకో విపరీతమైన నవ్వు వచ్చింది

'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు ?' .. ఏమంటారు ?

కె, ఎస్. ఆర్ జయపురం

బాగా చదువుకొని సంస్కారం కల మనుషులు ఏమీ తెలియనట్టు ఉంటారు గాని, ఏదో గుమస్తాపనిచేస్తూ కొంత మంది పెద్ద ఆఫీసరులా అనుకొంటూ తిరుగుతారేమిటి ?

ఎప్పుడూ వినలేదా— 'అన్నీ వున్న విస్తరి అణిగి ఉంటుందని— చదువుతున్న కొద్దీ, తమకు తెలిసినదెంతటి స్వల్పమో తెలిసివస్తూ ఉంటుంది సంస్కారం కలవారికి అది లేనివారే ఓ అక్షరం గ్రహించి వ్యాఖ్యలు రాస్తాం అంటారు

సపశ్రీ హైదరాబాదు

'కవుల పేర్లు గొప్ప కవయిత్రి నంటావు, వట్టిమూటలాడు వనిత నీవు నీటిమూట బోలు నీతులులేనట్టి రచన సేయనేల రామలక్ష్మి.. అని మిమ్మల్ని ఎవరైనా అంటే

'భళిరా, తెప్ప బల్కితివి ననగా' అక్షరలక్షలివిగో తీసుకొని బొమ్మ అంటాను నేనే భోజరాజునో సింగభూపాలుణ్నో అయినట్టయితే

జి వి ఎస్ పక్లీస్‌పూర్ (మైసూరు)

పెళ్ళి నిశ్చయమయింది ... చివరికి ఇరవైమందికి అన్నం పెట్టలేని పెద్ద మనిషి [illegible]

ఈ సంగతి తెలిస్తే పెళ్ళి భోజనానికి వచ్చిన వాళ్ళు సిగ్గుపడకలరు [illegible] బ్రదర్ అయినా యీ భోజనాలూ, [illegible] ఎప్పుడు తగ్గుతాయో అప్పుడే కొంతైనా [illegible] యానికి దారి ఏర్పడుతుంది సరదాగా పెళ్ళి చేసుకుంటూ లిట్ల దీవనలూ శాపనార్థాలు చూస్తూంటే నాకు కంపరమెత్తుతుంది ..

యత్నంలేని యశస్సు



శివపురంలోని జనోపయోగ గ్రంథాలయంనుంచి ఒక జాబు వచ్చింది — ఆ గ్రంథాలయం వార్షికోత్సవానికి నన్ను ప్రధానోపన్యాసకునిగా నిర్ణయించినట్లూ, గ్రంథాలయోద్యమ నాయకుడు రమేశ్‌బాబు అధ్యక్షత వహించడానికి సమ్మతించినట్లూ, నా అంగీకారం తెలిసినవెంటనే ఆహ్వానపత్రిక అచ్చువేయ దలచినట్లూ గ్రంథాలయాధికారి వీరేశ్వరరావు ఆ జాబు వ్రాశాడు.

అతనితో నాకు పరిచయం లేదు. పరిచయం లేకున్నా ఆ రీతిని నన్ను ఆహ్వానించడానికి నేను ప్రసిద్ధ వ్యక్తిని కాను. ఆ జాబు చదివి ఆశ్చర్యపోయాను. అది నాకేనా అనే అనుమానంతోచి ఎడ్రస్సు రెండుమూడుసార్లు చదువుకుని—అది నాకే అని ధృఢపరుచుకున్నాను.

శివపురంలోగాని, ఆ చుట్టుపక్కలగాని నన్ను ఎరిగినవ్యక్తి వున్నట్లు జ్ఞప్తిలో లేదు. మరి నా పేరు అతనికి ఎలా తెలిసినట్లు? ఆమధ్య రెండుమూడు సార్లు—పత్రికలో పడిన నా వ్యాసాలు చూచి ముగ్ధుడై వీరేశ్వరరావు యిలా వ్రాసి ఉంటా అని తీర్మానించు కున్నాను.

వెంటనే నా అంగీకారాన్ని అతనికి ఎక్స్‌ప్రెస్ డెలివరీ లెటరు మూలంగా తెలియచేశాను.

ఈ సమాచారం వెంటనే మా మిత్ర మండలికి తెలిసిపోయింది. వారందరూ నన్ను అభినందించారు.

'చూడరా, మన ధనంజయం అదృష్టం! ఒకటి రెండుసార్లు పత్రికకు ఎక్కేసరికే ఆహ్వానాలు వస్తున్నాయి ఉపన్యాసాలు యివ్వమంటూ' అని గోపు నా యెదుటే కౌస్తుభంతో అన్నాడు.

'మనవాడివల్ల మన మిత్రులందరికీ ఒక గౌరవం వచ్చిందనుకో? అక్కడి నుంచి రాగానే మనం ఘనంగా సమ్మానించాలి. దానికి తగిన యేర్పాట్లు యిప్పట్నుంచే జరగాలి' అని కౌస్తుభం అందుకున్నాడు.

పొంగి పొరలి వస్తున్న ఆనందాన్ని లోలోపలనే అణచుకుని ఒక్క చిరునవ్వు నవ్వేశాను.

మరొక వారంలోపుగానే అచ్చయిన ఆహ్వానపత్రికలు వచ్చాయి. పరిచిత మిత్రులకు ఇవ్వడానికని వీరేశ్వరరావు అదనంగా పదింటిని పంపాడు. కొందరు మిత్రులు నాతోకూడా శివపురానికి రావడానికి సిద్ధమయారు. కాని అనవసరంగా రైలు ఖర్చులు ఎందుకనిచెప్పి రావద్దన్నాను. ఉపన్యాసం యెలాగూ పత్రికలలో పడుతుంది కాబట్టి దాన్ని చదివి తృప్తిపడాలని కోరాను.

ఆనాటి మహాసభలో నేను ప్రధానోపన్యాసకుడిని. అంటే యింకా మరికొన్ని ఉపన్యాసాలుంటాయన్నమాట! తక్కిన వారి ఉపన్యాసాలకంటె నా దానిలో కొంత విశిష్టత ఉండాలిగదా! అందుకని రెండు రోజులు తీవ్రంగా ఆలోచించి చక్కని వ్యాసం తయారు చేశాను. అందులో గ్రంథాలనూ, గ్రంథాలయాలనూ గురించి మాత్రమే కాకుండా అందరికీ ఆసక్తిని కలిగించే రాజకీయాలను గురించి కూడా తీవ్రంగా వ్రాశాను. భాషలో ఒక విప్లవాన్ని లేవదీసి జనులలో నూతన చైతన్యం కలిగించేవిధంగా ఆ వ్యాసం తయారైనది. నాకు ఎంతో తృప్తి కలిగింది.

రాత్రి ప్రయాణమనగా—ఉదయంనుంచీ ఆ ప్రయత్నంలోనే వున్నాను. చిన్న సూట్‌కేసులో ముద్రణకు సిద్ధం చేసివున్న నా రచనలనూ, మూడుజతల దుస్తులనూ, అవసరమైన వస్తువులనూ పెట్టాను. అన్నిటినీ సమంగా పెట్టానో లేదో అని చూచుకొనడానికి రెండుసార్లు సర్దవలసి వచ్చింది. బెడ్డింగును చక్కగా చుట్టి కట్టడానికి అరగంటసేపు పట్టింది.

ఈ హడావిడి అంతాచూసి మా శ్రీమతి 'ఒక్కరోజు వుండేదానికి యింత ప్రయత్నం దేనికి? రెండు ధోవతులూ, రెండు జుబ్బాలు, రెండు బనియన్లూ, ఒక పైవస్త్రం సంచీలో పెట్టుకొని వెళ్లితే తీరిపోతుంది. కూలివాడి గొడవ తప్పిపోతుంది కూడాను' అని సలహా యిచ్చింది.

ఆ సలహా వినేసరికి నాకు కోపం వచ్చింది. 'నేను వెళ్లేది ఒక పెద్ద గ్రంథాలయ వార్షికోత్సవంలో ముఖ్యోపన్యాసకుడుగా; నేను చేతిసంచీతో రైలు దిగితే నా కోసం స్టేషనులో కాచుకున్న తగుమనుషులు ఏమనుకుంటారు! ఇంతకూ సెకెండుక్లాసు పెట్టెనుంచి సంచీ పట్టుకుని దిగమన్నావా?' అని అన్నాను.

'మీరు సెకండుక్లాసు పెట్టెలో ప్రయాణం చేస్తారా? బోలెడంత డబ్బు టిక్కట్టుకే అవుతుందే!'

'అయితే కానీ; నన్ను పిలిచినవారు ఖర్చులన్నీ భరిస్తారు. మనకేమీ నష్టం వుండదు గదా!'

'వాళ్లు మూడోతరగతి ఛార్జియే యిస్తే!'

'శకునపక్షిలా మొదట్నే కుశ్శంకలు వేస్తావేమిటి? నేను పెట్టె బెడ్డింగులతో

వెళ్ళకా తప్పదు? హోదాకు తగినట్లు సెకెండుక్లాసులో ప్రయాణం చెయ్యకా తప్పదు. వేలకొద్దీ యీ మహోత్సవానికి ఖర్చు చేస్తున్నవాళ్లు ప్రధానోపన్యాసకుడికి అధమం సెకెండుక్లాసు ఛార్జీ అయినా యివ్వకపోరు. మరి నువ్వు యేమీ అడ్డులు చెప్పకు' అని చాలా చికాకుతోనే సమాధానం చెప్పాను.

'అయితే మీ యిష్టం' అని ఆవిడ మారు మాటాడక మూతి ముడుచుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి పెందరాళే భోజనం చేసి జట్కా కట్టించుకుని స్టేషనుకు వెళ్ళాను. నాకు వీడ్కోలు యివ్వడానికి గోపు, కౌస్తుభం అక్కడికి వచ్చారు. అదృష్టవశాత్తూ సరియైన టైముకే బండీ వచ్చింది.

నేను సెకెండుక్లాసు పెట్టెయెక్కి, సామాను బండిలో పెట్టిన పోర్టరుకు నిర్లక్ష్యంగా ఒకరూపాయి కూలి యిచ్చివేశాను. వాడు వంగి వంగి నమస్కారంచేసి తృప్తిపడి వెళ్ళిపొయ్యాడు. బండి కదిలేదాకా మిత్రులు నే కూర్చున్నపెట్టె ప్రక్కనే నిలబడి మాటలాడుతూ, బండీ కదిలాక చేతిరుమాళ్లు విసురుతూ వీడ్కోలు తెలిపారు.

నాడు బండీలో రద్దీ లేదు. నేను బెడ్డింగు విప్పి పరుచుకుని నడుం వాల్చాను. రాత్రి పదిగంటలయినా నిద్ర రాలేదు. ఏవేవో ఆలోచనలు! బండీ స్టేషనులో ఆగేసరికి శివపుర మహాజనులు అక్కడ హాజరుగా వుంటారనీ, నేను బండీనుంచి దిగగానే వినయం చూపుతూ కారులో బసకు తీసుకువెళ్తారనీ ఊహిస్తూ, మొదట వారితో ఎలా సంభాషణ ప్రారంభించాలో ఆలోచించ సాగాను. ఆ ఆలోచనలోనే నిద్రపట్టింది, కొంచెం.

ఆ నిద్రలోనే ఒకకల. రైలుబండీ ఒకగంట లేటుగా శివపురం స్టేషనుకు వచ్చింది. నాకోసం చాలామంది పెద్దమనుష్యులు పూలదండలతో ప్లాట్‌ఫారం మీద కాచుకొని వున్నారు. వీరేశ్వరరావు నాకోసం వెతుకుతున్నాడు. నేను బండీ నుంచి దిగాను. పత్రికలో వ్యాసాలతో పాటు యిదివరకు నా ఫోటోపడి వుంది గదా! దాన్నిచూసే కాబోలు గుర్తుపట్టి నా దగ్గరకు వచ్చి కరచాలనంచేసి పూలమాల మెడలో వేశాడు. మరేముంది? నా మెడ రోజా మాలలతో నిండిపోయింది. ఆయన నన్ను కారులో కూర్చోపెట్టి తాను నాపక్కనే కూర్చున్నాడు. ఆ కారు ఎక్కడకు వెళ్ళిందో ?

ఇంతలో తెలివి వచ్చింది. నేను బండీలోనే ఉండడం చూసుకుని 'యిది కల' అని అనుకున్నాను. మరి కొద్ది సేపటికి మళ్ళీ కునుకు పట్టింది. మళ్ళీ ఒక కల వచ్చింది. శివపురం స్టేషను వచ్చింది. ప్లాట్‌ఫారం మీద పిట్టమనిషి కూడా లేడు. పోర్టరుకూడా కానరాలేదు. నేను నా సామాను స్వయంగానే దింపుకుని బండీ దిగాను అప్పుడు ఒకకూలీ పరుగెత్తుకుని వచ్చి నాపెట్టె బెడ్డింగూ తలమీద పెట్టుకున్నాడు. ఒక జట్కా చేయించుకుని అందులో కూర్చున్నాను. కూలీ డబ్బు అడిగినట్లులేదు. జట్కా ఎక్కడికి వెళ్ళిందీ తెలియలేదు.

తర్వాత నిద్రపోయాను చెరుపూ మరుపుగా. తెలివి వచ్చేసరికి తెల్లవారింది. మరొక అరగంటకు గమ్యస్థానం వస్తుందనగా, నేను ముఖం కడుక్కుని బెడ్డింగు కట్టుకుని దుస్తులు మార్చుకున్నాను. ఒక స్టేషనులో టీ తెప్పించుకుని తాగాను. శివపురం స్టేషను ప్లాట్‌ఫారంమీదికి బండీ వచ్చేసరికి నేను కూర్చున్న పెట్టెతలుపు తెరచుకుని ద్వారందగ్గర నుంచున్నాను బండీ ఆగింది. నా కోసం యే వ్యక్తులూ వచ్చిన జాడ కనబడలేదు. బండీనుంచి దిగేవారు దిగుతూ వుండగా ఎక్కేవారు హడావిడిగా ఎక్కుతున్నారు. ఒక నిమిషం నిరీక్షించి, బండీ దిగి పోర్టరుచేత సామాను దింపించి వెయిటింగురూముకు వెళ్ళాను.

అయిదు నిమిషాలు గడిచింది. పోర్టరు కొంచెం దూరంగా నుంచునే వున్నాడు. ఇక ఆగలేక 'బాబూ! సామాను జట్కాలో పెట్టమన్నారా ?' అని అన్నాడు.

'నేను యీ బండీలో వస్తున్నానని ఆ తగుమనిషికి రాసేను. మరియెందుకు రాలేదో ?'

'బాబూ ! బండీ గంట లేటుగదా ! వచ్చి వెళ్ళిపోయి వుండవచ్చు. మీ రెక్కడికి వెళ్ళాలో చెప్తే జట్కా కుదురుస్తాను లెండి. ఇంటిదగ్గిరే ఆయన్ను కలుసుకోవచ్చు'

బండీ గంట లేటు చేసినందుకు రైల్వే వాళ్లమీద నాకు విపరీతంగా కోపం వచ్చింది. ఈ రోజు యిచ్చే ఉపన్యాసంలో వాళ్లను ఒక దులుపు దులపాలని అనుకున్నాను.

'నేను యీ వూరికి యెప్పుడూ రాలేదు. యెవరియిల్లూ నాకు తెలియదు. యెవ్వరియింటికీ యెందుకు వెళ్ళాలి ? తిన్నగా లైబ్రరీకే వెళ్తాను. సామాను జట్కాలో వెయ్యి' అని ఆదేశించాను పోర్టరుకి.

టిక్కెట్టు కలెక్టరుకు టిక్కెట్టు యిచ్చివేసి, బయటపడి సామానువేసిన జట్కాలో కూర్చుని పోర్టరుకు ఒక రూపాయి యిచ్చి పంపివేశాను.

'బాబూ ! ఎక్కడికి వెళ్ళాలి' అని జట్కావాలా అన్నాడు.

'జనోపయోగ గ్రంథాలయం' అనే లైబ్రరీ యీ వూళ్లోవుందిగదా ! అక్కడికి తీసుకువెళ్లు.'

'బాబూ ! అదెక్కడున్నదీ నాకు తెలవదండి.'

'అది కాదోయ్. పెద్ద పెద్ద బీర్వాలలో పుస్తకాలుండి, నలుగురూచేరి పేపర్లూ అవీ చదువుకునే చోటులేదూ ? అక్కడికి వెళ్లాలి'

'అలాంటిదేదీ యీ వూళ్లో లేదండి. యిది అంత పెద్ద బస్తీ కాదు. ఈ వూళ్లో వున్నవన్నీ నాకు తెలుసునండి !'

ఒక క్షణం ఆలోచించాను.

'వీరేశ్వరరావుగారి యిల్లు తెలుసునా?'

'తెలియకేమండి. బాగా తెలుసును. చాలా మంచివారండి ! దేశంకోసం పాటుపడుతున్న మనిషి అని అందరూ అనుకుంటారు బాబూ !'

'అయితే వారి యింటికే జట్కా పోనియ్యి'

జట్కా వూళ్లో ప్రవేశించి గతుకుల రోడ్డులో ప్రయాణం సాగించింది. కుదుపుతో నా వొళ్లు హూనమైపోయింది. జట్కా వెళ్తూవుండగా అక్కడక్కడ జనం తొంగిచూడ సాగారు. ఇది నాకు కొంత ఆశ్చర్యమనిపించింది. కొంచెం సేపటికి జట్కా ఒక చిన్నయింటిదగ్గర ఆగింది.

'ఇదేనండి ఆయన వుండే యిల్లు!'

అన్నాడు జట్కావాలా.

బండీ ఆగడం చూసి యింటిలోపట్నుంచి ఒక వ్యక్తి తొందరగా బయటికి వచ్చి, బండీనుంచి దిగిన నన్ను చూసి 'దయచెయ్యండి ధనంజయంగారూ!' అని నమస్కారపూర్వకంగా ఆహ్వానించాడు.

ఆయనే వీరేశ్వర్రావని అనుకున్నాను,

ఆయన సామాన్లు ఒకగదిలో పెట్టించి, జట్కావాడికి యివ్వవలసిన అద్దెయిచ్చి పంపివేశాడు. ఆ గదిలోవున్న రెండు కుర్చీలలో యిద్దరం కూర్చున్నాం.

ఉపన్యాసం యివ్వడానికి నన్ను పిలవడం నాకే ఆశ్చర్యమైందని నేను ప్రారంభించాను ప్రసంగానికి.

ఫోటోతోకూడా పడిన నా వ్యాసాలు ఒకటి రెండు-పత్రికల్లో తాను చూచాననీ, పేరు ప్రఖ్యాతులున్నవారి వ్యాసాలే పత్రికలవాళ్లు వేసుకుంటారు కనుక నేను గొప్ప వ్యక్తినని తానుభావించాననీ ఆయనఅన్నాడు. నావంటివాడు తన ఆహ్వానాన్ని గౌరవించి రావడం అపూర్వ అదృష్టమే అని స్తుతించాడు.

తర్వాత ప్రసంగంలో సందర్భవశాన 'మీరెవ్వరినైనా స్టేషనుకు పంపిస్తారని అనుకున్నాను. ఎవ్వరూ రాకపోవడంవల్ల కొంచెం ఆందోళనపడ్డాను' అన్నాను.

'మీరు ఈ బండీలోనే వస్తారని తెలుసు. అందుకోసమే యిద్దరు వలంటీర్లను పంపాను. ట్రయిను లేటయింది కదూ! అందువల్ల మళ్లీ రావచ్చునని వాళ్లు కార్యాంతరంమీద వెళ్లిపోయినట్లున్నారు. మీకు శ్రమ కలిగించినందుకు క్షమించాలి' అని ఆయన సమాధానం చెప్పుకున్నాడు.

తర్వాత స్నానాదులు ముగించుకున్నాను. మేమిద్దరం యిష్టాగోష్టిగా మాటలాడుకుంటూ భోజనం ముగించాం. తర్వాత హడావిడిగా దుస్తులు వేసుకుని బయలుదేరుతూ 'రాత్రి ప్రయాణంనుంచి మీకు బాగా నిద్రపట్టి వుండదు. రెండు గంటలసేపు నిద్రపోతే మంచిది. నేను తొందరగా పోయి కొన్నియేర్పాట్లు చేసుకోవాలి. మళ్లీ వస్తాను.' అంటూ వీరేశ్వర్రావు ఎక్కడికో వెళ్లిపోయాడు.

నేను ఆ గది నలుమూలలా పరిశీలించాను. ఒక గోడవారగా ఒక చిన్నబీరువా కొన్ని పుస్తకాలతో కానవచ్చింది. 'జనోపయోగ గ్రంథాలయం' అని వ్రాసిన చిన్న అట్ట ఆ బీర్వాకు తగిలించబడి వుంది. ఆ గ్రంథాలయం తాలూకు పుస్తకాలు కొన్ని యీ బీరువాలో వుంచి వుండవచ్చని అనుకున్నాను. గదిలో వున్న రెండుకుర్చీలనూ, ఒక టేబిలునూ ఒకవారకు పెట్టి నేలమీదనే బెడ్డింగు పరుచుకుని పడున్నాను. రాత్రి కలతనిద్ర అయింది. అందువల్ల యిప్పుడు బాగా నిద్రపట్టింది. తెలివి వచ్చి చూసేసరికి రెండుగంటలైనది. నేను తొందరగా లేచి పడక చుట్టివేసి నూతిదగ్గరికి పోయి ముఖం కడుక్కొని వచ్చాను. నేను గదిలోకి వచ్చేసరికి వీరేశ్వర్రావు నా కోసం కాఫీ పట్టుకొని వచ్చాడు.

'సభ మూడున్నర గంటలకే కదూ!' అని అన్నాను.

'అలాగే ప్రోగ్రాంవేశాం మరి'

'అంతా సిద్ధమయినట్లేనా?'

'ఒక్కటి తప్ప అంతా సిద్ధంగానే వుంది. మనసభకు అధ్యక్షత వహించవలసిన రమేశ్ బాబుగారు రాలేదు. ఆయన నివాసం యీ పక్కనున్న వూరే! పదిగంటలకే సైకిలుతో మనిషిని పంపాను, మూడు గంటలకయినా రావాలని. కాని ఆయనకు ఆరోగ్యం సరిగా లేదట! రాలేననీ, క్షమించాలనీ వార్త పంపారు. ఆ కబురు ఒక గంట కిందటే అందింది. ఏమి చెయ్యడానికీ పాలుపోకుండా వున్నది.'

'మరెవరినైనా అధ్యక్షుడుగా నిర్ణయిస్తే.'

'ఆ విధంగాకూడా ఆలోచించాను. అదీ కుదిరేటట్లు లేదు. ఈకాలంమనుషుల సంగతి మీకూ తెలుసును! అందరికీ ఆత్మాభిమానం యెక్కువ. 'మొదటనే పిలవకుండా, ఇప్పుడు నిర్ణయించుకున్న ఆసామీ రానందున మమ్మల్ని పిలుస్తున్నారు కదూ!' అని అంటారు. అందులోనూ మావూరివాళ్లు మరీ అసాధ్యులు!'


'అయితే మరి మార్గం యేమిటి?'

'అదే, ఆలోచనగావుంది, పోనీ, ఈవాళ కాకపోతే రేపయినా మహాసభను పెట్టుకుందామనుకుంటే—రమేశ్‌బాబు రేపుకూడా వచ్చేస్థితిలో వున్నట్లు తోచదు. మిమ్మల్ని కూడా ఒకరోజు నిలిపివెయ్యవలసి వస్తుంది'


నేను వెంటనే అందుకున్నాను—

'రేపు నేనిక్కడ వుండడానికి వీలుకాదు. రేపు మావూళ్లో అర్జంటుపని వున్నది. ఈరాత్రి ఎనిమిదిగంటల బండీలో బయలుదేరి వెళ్లక తప్పదు.'

'సరే! మమ్మల్నిగురించి విూపనులు పాడుచెయ్యడం నాకునూ సమ్మతం కాదు.







శ్రేష్ఠమైన రుచియు
మంచి సువాసనతో నిండిన
పానీయము
ధరయో అతి సరసము
లిప్టన్స్ హిమాలయన్
గోల్డెన్ డస్ట్ టీ

ఎవరయినా కానీయండి, ఒక్కసారి త్రాగితే చాలు—మళ్లీ మళ్లీ అడుగుతారు. నిస్సందేహంగా, మీకు మహదానందకరమైన తృప్తినిచ్చే చిక్కని, కమ్మని పానీయం యిది. కప్పు తర్వాత మళ్లీ కప్పు. త్రాగటం సరికొత్త మధురానుభూతిని ప్రసాదిస్తుంది. పైగా, యిది ఎంతో లాభదాయకము.

LIPTON లిప్టన్స్
అంటే మంచి టీ

LHGC 6-76B

యత్నం లేని యశస్సు

ఇంకా రాత్రి బండీలో మీరు వెళ్ళడానికి యేర్పాట్లు చేస్తాను లెండి—అయినా మీకు నిష్కారణంగా శ్రమ కలిగించినందుకు చాలా బాధగావుంది మనస్సులో.'

'నాకు అంతగా శ్రమ యేమీ లేదు. మీ ఆహ్వానంమూలంగా మీ వూరికి రావడమూ, మిమ్మల్ని చూడడమూ జరిగింది. నా రాక పోకలను గురించి మీకే అనవసరంగా కొంత ఖర్చు అవుతున్నందుకు నాకే కష్టమనిపిస్తున్నది' అని అన్నాను, నా రైలు ఛార్జీలూ అవీ యివ్వడేమో అనే సందేహంతో.

'ఇలాంటి మహత్కార్యాలు తలపెట్టినప్పుడు ఖర్చులకోసం వెనకతీస్తామా, సర్! అనుకున్న ప్రోగ్రాం ప్రకారం జరగలేదే అనే నా విచారం' అన్నాడు వీరేశ్వరరావు.

'ఇక్కడికి ఉపన్యాసం యివ్వడానికి వచ్చిన సంగతి నా మిత్రులందరికీ తెలుసును ఇది జరక్కపోవడంవల్ల నాకు ఎంతో తలవంపులుగా వుంటుంది. ఇది మాత్రం కొంచెం కష్టంగా ఉన్నది.'

'క్షమించండి. ఇలా అవుతుందని అనుకోలేదు అయినా మీ కీర్తికి యేమీ భంగం కలగకుండా వుంటుందని మాత్రం చెప్పగలను. గౌరవానికి భంగం వుండదు'

ఇలాచెప్పి అతడు పనిమీదకాబోలు ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఖైదీమాదిరిగా నేనా గదిలోనే వుండిపోయాను.

రాత్రి ఏడుగంటలకి వీరేశ్వరరావు నిర్బంధంవల్ల రెండుమెతుకులు తిని పెట్టె, బెడ్డింగులతో జట్కా ఎక్కి రైలుస్టేషనుకు బయలుదేరాను. తానుకూడా స్టేషను దాకా రావడానికి రావు సిద్ధపడ్డాడు గాని, నేనే వద్దన్నాను.

బండీ రావడానికి యింకా అరగంట టైము ఉంది. నేను వెయిటింగు రూములో ఈజీచైరులో కూర్చుని జరిగిన సంఘటనను గురించే ఆలోచిస్తున్నాను. అప్పుడు ఒక అపరిచిత వ్యక్తి వచ్చి నమస్కారంచేసి ఎదురుగావున్న మరోకుర్చీలో కూర్చున్నాడు.

నేను అతనివేపు వింతగా చూడడం గమనించి 'నాపేరు మహేశమండి! నేను మీకు కొత్తవాడనే కాని మిమ్మల్ని ఉదయమే వీరేశ్వరరావుగారి యింటిదగ్గర చూశాను. వారిపోరుపడనే మాయిల్లు! తమ ఉపన్యాసాన్ని నేను వినాలని ఎంతో కుతూహలపడ్డాను కాని, ఆవేళకే అత్యవసరమైన పనిమీద పక్కవూరికి వెళ్ళవలసి వచ్చింది. మీ ఉపన్యాసం వినేభాగ్యం లేకపోయింది. నేనూ యీ బండీలోనే పక్కనున్న కృష్ణానగరుకు వెళ్ళవలసి వచ్చినందువల్ల మీతో యిప్పుడు మాటలాడే భాగ్యమయినా కలుగుతున్నది' అని అతను అన్నాడు.

'మీకు ఆవిచారం అక్కర్లేదు అసలు సమావేశమే జరగడం లేదు' అన్నాను.

'సమావేశం జరగడం సందేహమే అని నేనూ అనుకున్నాను లెండి. వాడున్నాడే—ఆ రఘుపతి — యీ సమావేశాన్ని జరగనిస్తాడా? పాపం! వీరేశ్వరరావు తలపెట్టిన ప్రతిపనికీ అడ్డు తగులుతూనే ఉంటాడు.'

'ఎవరా రఘుపతి?'

'మా పంచాయితీ బోర్డులో ఒక మెంబరు! వెనకటి ఎలక్షన్లలో తనకు రావుగారు వ్యతిరేకంగా పనిచేశారని అతని అనుమానం. అందువల్ల ఏదో నెమ్మదిగా జీవనం గడుపుకుంటున్న రావుగారిని నానా విధాలా బాధపెడుతున్నాడు. రావుగారి జీవనాధారమైన జనోపయోగ లైబ్రరీకి పయి అధికారులు శాంక్షను చేసిన సొమ్ముకూడా అందకుండా వుండేటట్లు చేశాడు.'

'ఏమిటి వీరేశ్వరరావుగారు లైబ్రరీ మీదే ఆధారపడి వున్నారా?'

'అవునండి మానవుడికి ఏదో ఒక జీవనమార్గం ఉండాలికదా! రావుగారు తమ యింట్లోనే ఒక బీరువాలో కొన్ని పుస్తకాలు ఉంచి 'జనోపయోగ గ్రంథాలయం' అని పేరుపెట్టి చందాదారులను చేర్చి కొంతసొమ్ము వసూలు చేస్తూ వుంటాడు. ఇళ్ళకు తానే స్వయంగాపోయి పుస్తకాలూ పంచికలూ అందిస్తాడు. వేర్పుగా జాబులు రాసి, లైబ్రరీపేర పత్రికలను ఉచితంగా సంపాదించి, అవి కొన్నట్లు లెక్కలు చూపిస్తాడు. పాత పుస్తకాలను చౌకగా కొని, పూర్తివెలలు చూపుతాడు. ఉత్సాహాలపేరుతో విరాళాలను పోగుచేస్తాడు. ఇలా చెయ్యకపోతే జీవనం గడవదు. రఘుపతి యీ లోపాలన్నీ పై అధికారులకు చూపి శాంక్షనయిన సొమ్ము కూడా రాకుండా చేశాడు.'

'పాపం! వీరేశ్వరరావు చాలా బాధపడి వుంటాడు'

'బాధకాదా మరి? చేతికి అందిన పైకం జారిపోతే. రఘుపతి దుర్మార్గం యింకా చూడండి. రావుగారు నేటి మహాసభను హైస్కూల్లో ఏర్పాటుచేసి, రమేశ్ బాబుగారిని అధ్యక్షుడుగా నిర్ణయించారా మరి! రమేశ్‌బాబు రఘుపతికి మామ 'గారు! అల్లుడి పట్టుదలవల్ల ఆయన సభకు రానని వర్తమానం చేశాడట!'

'రమేశ్ బాబుకు ఆరోగ్యం సరిగా లేదటగా!'

'బంగారాల్లగున్నాడు. నిన్న సాయంకాలం బజార్లో నేను చూశేను. అది కల్పించుకున్న సుస్తీయేగాని యదార్థమైనది ఎంతమాత్రమూ కాదు.'

'అదా సంగతి! ఇలా చెయ్యడం రఘుపతికి తగదు'

'ఇంతేకాదు. గ్రంథాలయోత్సవం జరిగే సమయానికే హైస్కూలు పక్కనవున్న టౌనుహాలులో ఉచితంగా సినిమా ప్రదర్శనను ఏర్పాటు చేశాడు. అతని వక్రబుద్ధి చూడండి! ప్రజ సినిమా చూడడానికి వెళ్తుందికాని, ఉపన్యాసాలు వినడానికి వస్తుందా?'

'మీ రన్నమాట నిజమే! ఇది గమనించే వీరేశ్వరరావు సమావేశాన్ని నిలిపివేశి వుంటాడు.'

'ఇందులో సందేహం లేదండి! మీవంటి తగు మనుష్యులు పైవూరునుంచి వస్తున్నారని తెలిసికూడా రఘుపతి ఇలా చెయ్యడం మావూరికే అప్రతిష్ఠ.'

మహేశం చెప్పవలసినది యింకా వున్నట్టే కానవచ్చింది. కాని, యింతలో బండీ రావడంవల్ల ఆ ప్రసంగం నిలిచిపోయింది. నేను సెకెండుక్లాసు కంపార్టుమెంటులో ఎక్కుతూ వుండడం చూసి, మహేశం మరోకవైపు వెళ్లిపోయాడు నావద్ద సెలవుతీసుకుని.

మర్నాడు యింటికి వెళ్లేసరికి కౌస్తుభం నాకోసం కాచుకుని వున్నాడు, అప్పటికి నేను తప్పకుండా శివపురంనుంచి వచ్చేస్తాననే నిశ్చయంతో నన్ను చూడగానే' ఏమోయ్! సభ బాగా జరిగిందా? నీ వుపన్యాసం విని అక్కడివాళ్లు ముగ్ధులై వుంటారనుకుంటాను. నావూహ నిజమేనా?' అన్నాడు.

నేను వెంటనే సమాధానం చెప్పలేదు. నా ముఖం బాగా వాడి వుండడం చూసి 'పాపం! రాత్రి నిద్రలేదు కాబోలు' అన్నాడు.

'అదేమీకాదు. అసలు సభే జరగలేదు. ఏవో కొన్ని అనివార్యకారణాలవల్ల వాయిదా వేశారు. ఒకటి రెండు రోజులాగమన్నారు. నాకు వీలుకాదనిచెప్పి చక్కా వచ్చివేశాను,' అని జరిగినదానిని కొంత కప్పిపుచ్చుతూ అన్నాను

'పోనీ ఛార్జీలేనా యిచ్చేరా?'

'ఇవ్వకేం? నాకు ఈ ప్రయాణంలో యెంత ఖర్చయినదీ తెలిసికొని పైసలతో కూడా యిచ్చివేశారు.

'మళ్లీ ఆహ్వానం వస్తుందన్నమాట!' అని అంటూ చిరునవ్వునవ్వి అతడు వెళ్లిపోయాడు.

మరి నాలుగురోజులు గడిచింది.

నేను ఉదయం కాఫీ తీసుకుని న్యూస్ పేపరు చదువుకుంటూవుంటే కౌస్తుభం ఒక తెలుగుపత్రికను చుట్టచుట్టి చేతిలో పట్టుకొనివచ్చి 'ధనంజయం! నువ్వు భలే వాడివోయ్! దివ్యంగా జరిగిన మహాసభలో అద్భుతంగా గంటసేపు మహోపన్యాసం యిచ్చి, దాన్ని గురించి అడిగితే లేదని బుకాయిస్తావా? అలా చెప్పడంలో నీ అభిప్రాయం యేమిటి?' అని కొంచెం కోపంగానే అన్నాడు.

నాకేమీ అర్థంకాక నిర్ఘాంత పోయాను.

అతడు చేతిలోవున్న పత్రికను నా మీదికి విసరివేశాడు. అది 'దేశవార్తలు' అనే వారపత్రిక. నేను పేజీలు తిప్పి చూడగా ఒకపుటలో పెద్ద అక్షరాలతో 'ధనంజయంగారి మహోపన్యాసం' అనే శీర్షిక కనిపించింది. 'దానికింద "కడచిన గురువారం నాలుగ్గంటలకు శివపురంలోని జనోపయోగ గ్రంథాలయం వార్షికోత్సవంలో సుప్రసిద్ధ సారస్వత సేవకులూ, రచయితలూ అయిన శ్రీ ధనంజయంగారు గంటసేపు సుదీర్ఘోపన్యాసం చేసి, సారస్వతాన్ని గురించీ గ్రంథాలయోద్యమాన్ని గురించీ అనేక విషయాలను చెప్పి సభికులను ముగ్ధులను చేశారు. చక్కని సలహాలను యిచ్చారు. ఆ సభకు ఆ గ్రంథాలయ పర్యవేక్షకులు శ్రీ వీరేశ్వరరావుగారే అధ్యక్షత వహించారు. అనివార్య కారణాలవల్ల మొదట నిర్ణయించబడినట్లు సుప్రసిద్ధ జాతీయ నాయకులూ గ్రంథాలయోద్యమ పితామహులూ అయిన శ్రీ రమేశ్‌బాబుగారు అధ్యక్షత వహించలేక పోయారు.'


ఇది దానిలోని మొదటిపేరా.

ఇంకా రెండోపేరాలో నా వుపన్యాసంలో —నేను అనుకోని విషయాలను గురించిన వివరణం ఉన్నది.

నా ఆశ్చర్యానికి అంతం లేకపోయింది. మహేశం చెప్పిన సంగతులన్నీ జ్ఞప్తికి వచ్చాయి. వీరేశ్వరరావు ప్రోగ్రాము జరక్కుండా చేద్దామనిగదా రఘుపతి పట్టుదల! అతన్ని బాగా బోల్తా కొట్టించడానికి వీరేశ్వరరావే యీ సమాచారాన్ని పత్రికకు పంపించాడని ఊహించాను.

నాకు పట్టరాని నవ్వు వచ్చింది. కౌస్తుభానికి విషయాలన్నీ పూసగుచ్చినట్లు వివరంగా చెప్పాను.

కౌస్తుభం ముక్కుమీద వేలు వేసుకున్నాడు. ●



గమనిక

ఉత్తరాల శీర్షికకి రాసేవారు ఈ కింది నియమాలు పాటించాలని మనవి: 1. ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి 2. రాసేవారి పూర్తిపేరు, చిరునామా ఇవ్వాలి 3. ఇంగ్లీషు లిపిలో అక్షరాలు రాయరాదు 4. కాగితానికి ఒకవయిపునవే రాయాలి. 5. సిరాతోనే రాయాలి. —సం॥

వారఫలం

20-6-1969 శుక్రవారం మొదలు 26-6-1969 గురువారం వరకు

మేషం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. పోటీవారితో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. పోటీవారితో వాదప్రతివాదాలు తగవు.

వృషభం: సామాన్యమైన పనులకు కూడా విశేషమైన కృషి చేయవలసి వస్తుంది. దైవకార్యాలు నెరవేరుతాయి. వారం మధ్యలో సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. ఆడంబరం కోసం వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు—బంధువులకు సహాయం చేస్తారు. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మిథునం: వ్యాపార విస్తరణప్రయత్నాలు బాగా ఉంటాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

కర్కాటకం: వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. నూతన వ్యవహారాలు లాభించగలవు. రాజకీయ వ్యవహారాలు బాగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. దైవకార్యాలు నెరవేరుతాయి.

సింహం: వృత్తి వ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. పోటీవారితో గౌరవం బాగా ఉంటుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సజ్జనసాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

కన్య: ఇంతవరకు అనుకూలంగా ఉన్న వ్యవహారాల్లోనే చికాకులు యేర్పడతాయి. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. వారంమధ్యలో వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధికవ్యయం జరుగుతుంది.

తుల: వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. వారంమధ్యలో ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో తిరిగి అనుకూల పరిస్థితి యేర్పడుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

వృశ్చికం: వ్యాపారంలో ప్రయోజనంగల సంభాషణలను జరుపగలరు. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. పోటీవారితో గౌరవం లభిస్తుంది.

ధనుస్సు: వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. మిత్రుల సహకారం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు.

మకరం: కొన్ని వ్యవహారాల్లో మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. వృత్తిలో శ్రమకు గురికాగలరు. వారం మధ్యలో అనుకూల పరిస్థితులు యేర్పడతాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం: ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది. పోటీవారితో గౌరవం బాగా ఉంటుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో జోక్యం చేసికోవడం తగదు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మీనం: వ్యాపారంలో శ్రమ మీద అనుకూలత లభిస్తుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. వారం ఆఖరులో ఆకస్మికంగా చికాకులకు గురికాగలరు. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు.

స్త్రీలకు—పుణ్యకార్యాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి.

—మహేష్

గేయ కథ

అవివేకి



కె.కె.మూర్తి

నిన్నటి మొన్నటి గుంటూరు టౌనులో
బిచ్చకు డొక్కడు బజారులందు
చూచిన సినిమా వినిన రికార్డుల
పాటల్ పద్యాల్ డ్యూయట్ గేయాలో
కాసో కూసో వచ్చిందేందో
పాడుచు భిక్షం వెత్తుచునుండె.

పాటల్ బాడను తెలియనుగాని
పాటల కర్థము తెలియనిదానివె
వేళాపాళా స్థానం సమయం
ఎరుగక మూర్ఖుడు విరివిగ తానూ
బుర్రకు తోచిన కీర్తన లెన్నో
పాడుచు యాచన చేయుచునుండె.

''చూచితినమ్మా సీతమ్మనే
చూచితి''నంటూ ముంగిట పాడగ
స్నానపుగదిలో జలకాలాడెడి
సీతమ్మనియెడు అయింటావిడ
పిచ్చివెధవనీ పోకిరివాడని
పళ్ళు కొరుకుతూ కళ్ళ నురుముతూ
కర్రను దీసుక కొట్టనురాగా
కాలికి బుద్ధిని చెప్పాడతడు.

ప్రక్కనవీథికి ప్రుక్కుచుబోయి
''శృంగారమేలనే అస్థిర దేహికి
శృంగరమేల''ని సొంపుగ పాడగ
లోపల అప్పుడు కాలేజి కెళ్లను
పౌడరుబూసి స్నోలను రాసే
అందాలమ్మాయ్ ఆతని పాటను
విన్న వెంటనే వచ్చి బయటికి
డామిట్ యేమిటి దరిద్రప్పాటని

కాలికి దొడగిన స్లిప్పర్దీయగ
పరుగులెత్తె నాభిక్షుకుడప్పుడు

మరో వీదికి పరుగునబోయి
''నిలువగబోదోయ్ జీవంబిక
నిలువగబో''దని ఆతడు పాడగ
కడపటిదశలో కొనయూపిరితో
చావు బ్రదుకుల మధ్యను జిక్కిన
రోగిచుట్టును మూగిన జనులు
ఆతని పాటల అపశకునంబుకు
అదరిపడుచు ఆగ్రహావశులై
భిక్షుకు పట్టుక పదిమందీను
పట్టినశనిని విడిపించారు.

దెబ్బలుతినినా భిక్షుకుడప్పుడు
తన దుర్గతికి బాధ్యులెవరని
ఆలోచిసూ ఆతడప్పుడు
వేరొక గడపముందర నిలబడి—

అప్పుడె లోపల పాడించుడను
వాక్యము వినినా వెంటనె లోపల
''టక్కుటిక్కు టిక్కుటక్కు''పాటను
మొదలుబెట్టిన మరుక్షణానె

ఇదేంపాట దరిద్రప్పాటన
కాబోయే ఆ పెండిలి కూతురు
''పోయెనయ్యొ నావిభుని జీవముల
గొనిపోయె''నని ప్రారంభింపగ
చీఛీయనిరా చేరినవారలు

వింటూయుండిన భిక్షుకుడప్పుడు
''తగదువె నాకున్ తగదువెనాక''ని
గట్టిగ తానూ గొంతెత్తి పాడగ
ఇంట్లోనుండిన పెండ్లి పెద్దలు
పిచ్చిగపాడిన పిచ్చిపిల్లకూ
బిచ్చంబెత్తే బికారివానికి
బంధంవేస్తే బహు బాగుండని
వచ్చిన దారినె వెడలిపోయిరి.

వచ్చిన పెద్దలు వెడలిపోవుటకు
బికారిపాటే కారణమనుచూ
కర్రను దీసుక బిర్రుగ మోదగ
గుంటూర్ప్రజలు పిచ్చోళ్ళంటూ
బిరబిరపోవగ యెదురుగవచ్చె
సన్నాలు పిల్లల బలగం కొంత.

గుంటూరు దిట్టిన కోపముచేతను
బజారునడిచే బాల బాలికలు
రాయీ రప్పా కర్రా కంపా
చేతనుబట్టి తరుముచు కొట్టగ
కర్మను దిట్టుచు విధిని దూరుచు
భిక్షుకుడప్పుడు పరుగులెత్తెను.

వెలుగు నీడలు



యలమంచిలి ఝాన్సీలక్ష్మి

సీరియల్

జరిగిన కథ

రాజశేఖరంగారి ఒకే ఒక కూతురు అనుపమ. ఆయన మిత్రుని కుమారుడైన మధుని ఆదుకుని తన యింట్లోనే ఆశ్రయం యిచ్చారు. మధుమూర్తి అనుపమ అభిమానాన్ని పొందగలాడు. రాధామాధవీయం నృత్యనాటకతో వారి అనుబంధం మరింత దృఢం అవుతుంది. విదేశాలనించి వచ్చిన అనుపమ బావ విజయకుమార్ వీరి అభిమానాన్ని సహించలేడు. మధుమూర్తి ఊరికి వెళ్ళిన అనుపమ అక్కడ మాధవిని చూసి అపార్థం చేసుకుంటుంది. జరిగింది వివరిస్తాడు మధు. విజయకుమార్ బారి నుండీ అనుపమ శీలాన్ని రక్షిస్తాడు మధుమూర్తి. అనుపమా మధుల అనుబంధం విడదీయరానిదిగా రూపొందుతుంది. ఒకరి మనసు నొకరు తెల్సుకుని మరింత గాఢంగా పెనవేసుకుపోతారు.

9

పూర్ణ సౌందర్యంతో దీప్తివంతమైన అనుపమ వదనం ఆనాడు మరింతగా వెలిగిపోతోంది ఆనందంతో.

అనురాగాంబరాన వెన్నెలలు వెదజల్లుతూన్న వెలుగురేడు ప్రకాశవంతంగా మెరిసిపోతున్నాడు.

మధుమూర్తి 'దివిటీ' అన్న వారపత్రికకు ఎడిటరుగా నియమించబడ్డాడు. అతని రచనా ప్రతిభను గుర్తించి ఆ ప్రెస్ వాళ్ళు అభిమానపూర్ణ ఆహ్వానాన్ని పంపించారు. నెలకు మూడువందల జీతం నిర్ణయించ బడింది.

అతని కథలు రెండు హిందీభాషలోకి అనువదించ బడ్డాయి.

తెలుగులో ప్రసిద్ధిగాంచిన సాహిత్యానికి సంబంధించిన పత్రికలెన్నో అతని రచనల్ని ప్రచురించడానికి ముందంజ వేస్తున్నాయి.

రచనా వ్యాసంగంతో అతనికి క్షణమైనా విశ్రాంతి లభించడంలేదు. ఆనాడు రాజశేఖరంగారితో కృతజ్ఞతలు తెల్పుతూ అన్నాడు.

'మీ ఆశీస్సుల వల్లనే నాకీ 'ఎడిటరు' వుద్యోగం వచ్చింది! ఇంతవరకూ నన్నో ఆత్మీయుడిగా ఆదరించి అభిమానించినందుకేమిచ్చినా రుణం తీరదు. మీ చల్లని సహృదయత పరచిన పందిట్లో అందుకున్న ఆత్మీయానురాగాలకు విలువ కట్టలేను.'

'నాకెంతో ఆనందంగా వుందోయ్! మధూ! ఇంతలోనే యింతవాడివైనందుకు మీ అమ్మగారి కలలన్నీ పండాలనే నా ఆశీస్సులూ అందిస్తున్నాను. కానీ నాకు ఒకందుకు కించిత్ బాధగా వుందయ్యా! మా అనుపమకు అంత ఆత్మీయుంగా మంచీ, చెడునీ విప్పిచెప్పే మధురస్నేహం లభించదోయ్ యిక! అందుకే ప్రతిరోజూ ఎలాగైనా వీలు చూసుకుని మా అనూని పలుకరించివెళ్ళు. లేకుంటే బెంగతో తల్లడిల్లిపోతుందేమో!' అంటూ మందహాసం చేశారాయన అనుపమవంక చూస్తూ.

'పొండి! నాన్నా! మీరు మరీను!' అన్నదామె సిగ్గుపడుతూ.

'నీ ప్రతిరచనా మా అనుపమకు పంపించుతూండు మధూ! మరిచిపోయావో! మనిద్దర్నీ ఖైదులో వేయించుతుంది! ఏమనుకున్నావో!' అన్నారాయన పరిహాసంగా.

ఆమాటల కందరూ నవ్వుకున్నారు మనసారా. తర్వాత అనుపమ అడిగింది రాజశేఖరంగారు లోపలికి వెళ్ళగానే —

'పని తీరలేదన్న మిషతో నాన్నగారన్నట్లు కంటికే కన్పించకుండా పోయేరు!'

'మరీ అంత రాతిబండ అనుకోకు ఈ మాష్టార్ని!' అన్నాడతడు.

'ఏమో బాబూ! నాకెందుకో దిగులుగావుంది మనస్సున! మీరు దూరంగా జరిగిపోతున్నట్లనిపించుతోంది.' వ్యాకులత ధ్వనించిందామె స్వరాన.

'మరీ అంత అనురాగమూ పెంచుకోకు అనూ! అయినా ఎక్కడికి పోతున్నాను?

దూరదేశం పోతున్నానా ? ఏక్కడున్నా నా మనస్సుమాత్రం నీదేనని చెప్పానుగదా!'

ఆ చివరిమాటతో ఆమెముఖాన ఆనంద రేఖలు విప్పారాయి.

మనస్సున అనురాగాల షహనాయిమధుర గీతాలు పలికించుతూండగా అన్నదామె.

'నాన్నగారికి చెబుదా మనుకుంటున్నాను. మన అనుబంధం గురించి'

వెంటనే అన్నాడతడు—

'అందుకిది సమయంగాదు అనుపమా ! నన్నింకా మరో మెట్టు ఎక్కనీ ! ఈ సంఘాన కొంత పేరుంటేగానీ మనల్ని నిలబడ నివ్వదు. ఇలా అంటున్నానని అపార్థం జేసికోకు. అక్కయ్య కాపురం ఓ తీరానికి చేర్చనివ్వు — అంతస్థులనే అతిగా గౌరవించే యీ సమాజాన మన బంధం యీ పరిస్థితుల్లో అంత హర్ష దాయకం గాదు— నాన్నగారుకూడా నొచ్చు కుంటారేమో ! నీ మనస్సును కాదనలేకా, సంఘాన్ని ఎదిరించలేకా !'

అయితే నేను యీ సంవత్సరం అయ్యాక ఏమ్. ఏ కు వెళ్లనా ?'

'అందుకు నానుంచి ఏ అభ్యంతరమూ లేదు అనూ ! నాకు అందని ఆశాకిరణాలు నీ కందుతున్నాయని అసూయపడేంత అజ్ఞానిని మాత్రం గాను. ఏ శిఖరానవున్నా మన స్ఫూర్తిగా ఏనాడైనా నిన్ను స్వీకరించు తానని చెప్పగలను' అన్నాడతడు.

'మరి యీ లోపల నాన్నగారు పెళ్లి గురించి ప్రశ్నిస్తే ఏం చేయమంటారు ?'

'ప్రశ్న రాలేదుగదా ! వచ్చినపుడు నేనే చెబుతాను నాన్నగారికి !' అన్నా డతడు.

ఆ సమాధానంతో తృప్తి వెల్లివిరిసిందామె కనులనిండుగా. తర్వాత ఆ రాత్రికి అక్కడే భోజనంచేసి ఆ తండ్రీ కూతుళ్లిద్దరినుంచి ఆప్యాయంగా సెలవు దీసి కొన్నాడు.

సాహితీ లోకంలో అతని ప్రతిభ బహుముఖాలుగా వెలికివచ్చిందానాటినుంచి.

'అనురాగాలూ, అంతఃకరణలూ' అన్న నవల 'దీపిక' లో సీరియల్‌గా ప్రచురింపబడుతోంది. ఆ నవలను అనుపమకు అంకితం చేశాడు.

ఆ వాక్యాలు చదువుకున్న ఆమె మన స్సెంతగానో మురిసిపోయింది.

'అనురాగానవున్న అందాలనూ స్నేహాన వున్న తీయదనాన్నీ అందించిన మధుర స్నేహమయి అనుపమకు' అంటూ వ్రాసుకున్నాడతడు.

రాజశేఖరంగారుకూడా ఎంతో అభినందించారతడిని.

'మంచి భవిష్యత్తు వున్నవాడమ్మా! నిజంగా అతని తల్లిదండ్రులెంతో అదృష్టవంతులు! కానీ పాపం అతనిభార్య పిచ్చిదటగా!' అన్నారాయన సానుభూతిని ప్రదర్శించుతూ. ఆ మాటతో ఉలిక్కి పడింది అనుపమ. ఆశ్చర్యంతో విప్పారిన నేత్రాలతో తండ్రినే చూస్తూ అడిగింది.

'అని నీకెవరు చెప్పారునాన్నా?'

'మొన్న మన విజయ్‌కుమార్ అన్నాడమ్మా! ఏమిటో? ఈ జీవితాలు పరిపూర్ణంగా వుండవు తల్లీ! సుఖంతోనే పూర్తిగా నిర్వహించబడవు మన బతుకులు.



పొకన్పిస్తుంది అపుడపుడు—

ఈ జీవితం రణరంగంఅని పోరాడుతూ విజయాన్ని సాధించడమే మానవుని కర్తవ్యమనీ, కానీ అందుకు తోడుగా ఓ చల్లని హృదయం చేయూత నివ్వాలి.' దివంగత పత్నీస్మృతులతో ఆయన గంభీర హృదయం క్షణమాత్రం ఆవేదనతో కదిలి పోయింది.

అనుపమ మౌనం వహించింది తండ్రి ఆవేదనను చూసి.

'ఉజ్జ్వలమైన భవిష్యత్తు వున్నవాడు పాపం! హృదయాన దీపం వెలిగించడాని కెవ్వరూ లేకుండా పోయారు! మన 'విజయ్' కూడా ఎంతో బాధపడుతూంటాడు 'మధు' జీవితం విషాద కావ్యమై పోయిందంటూ' అన్నారాయన.

ఆ డాక్టరు ఎంత నేర్పుగా తండ్రి హృదయాన విషబీజాలు నాటుతున్నాడో గ్రహించ గలిగింది అనుపమ

'బావకు అంత విశాల దృక్పథం ఎపుడు అలవడిందో?' వ్యంగ్యం స్ఫురించిందామె స్వరాన.

'మన ఫ్యాక్టరీలో పేదవాళ్ళందరికీ వుచితంగానే వైద్యం చేస్తున్నాడమ్మా! చాలా మార్పు వచ్చిందతనిలో! అత్తయ్యను దేవతలా చూసుకుంటున్నాడట. ఆఫీసుకు ప్రతిరోజూ వచ్చి వెళ్తున్నాడు. అందరూ కించిత్ గర్వమైనా కన్పించదంత చదువున్నా, అంటూ మెచ్చుకుంటున్నారు. ఏమోలే తల్లీ! నా శ్రమ ఫలించిందను

వెలుగునీడలు

కుంటున్నాను—బావ విషయంలో!' ఓవిధమైన సంతృప్తి తొణికిసలాడిందాయన కంఠాన.

'చదరంగపు ఎత్తులు వేస్తున్నాడు! ఎంత అసభ్యంగా మాట్లాడతాడో నాకు తెలుసు! ఎన్నిరకాల మత్తుపదార్థాలు సేవించుతాడో చెప్పలేను. నన్నుకూడా ఓ నాడు...'

'విదేశాలకు వెళ్ళివచ్చినవాళ్ళకా అలవాటు తప్పక వుంటుందమ్మా! ఏదో యౌవనోద్రేకంలో నిన్నేదో అని వుంటాడు. అంతేగానీ నీవన్నంత కపటంలేదు తల్లీ!' సమర్థించారాయన మేనల్లుడిని.

తండ్రి మనస్సునెంత గాఢంగా నమ్మించగలిగాడో గ్రహించిన అనుపమ నివ్వెర పోయింది క్షణంసేపు. గోముఖ వ్యాఘ్రంలా మారిన ఆయువకునిపట్ల ఆమె హృదయాన అనంతమైన అసహ్యతా, ఆగ్రహావేశాలు జనించాయి.

'ఏమోబాబూ! నాకుమాత్రం బావతో మాట్లాడ్డం కాదుగదా, ముఖం చూడాలన్నా పరమ అసహ్యం!' అన్నది అయిష్టతనంతా కంఠంలోనింపి.

'మరీ అంత పట్టుదల వుండగూడదమ్మా! ఒక్కసారేదో పొరపాటుగా మాట్లాడినంతమాత్రాన అంత అసహ్యాన్ని పెంచుకోగూడదు!'

'మాష్టారలాంటి పొరపాటు ఎపుడైనా చేశారా నాన్నా?'

'ఎవరు? మధుమూర్తి మాటా నువ్వంటున్నది? అతనిలో సంస్కారం, సభ్యతా ఎప్పుడూ మేల్కొనే వుంటాయి అందరూ అంత వున్నతంగా వుండలేరమ్మా! అనూ!'

అప్పటికిగానీ ఆమె హృదయం శాంతించలేదు. కానీ తండ్రిమనస్సున 'విజయ్ కుమార్' పై మమకారం పెరిగినట్లు గుర్తించింది. ఆ యువకునిపట్ల ద్వేషం నిండిపోయింది. తండ్రితో ఏవిధంగానైనా మధుమూర్తినే వివాహమాడతానని చెప్పాలని నిశ్చయించుకుంది.

ఆ విదేశ నాగరికతా వ్యామోహంతో కొట్టుకుంటూన్న డాక్టరి ఛాయాలుకూడా పడనీయనంత జాగరూకత వహించాలని దృఢంగా నిశ్చయించుకుంది మనస్సున.

అందుకే ఓనాడు సినిమాకు రమ్మంటూ వచ్చిన అతనితో నిష్కర్షగా మాట్లాడింది.

'నీలాంటివాళ్ళతో స్వర్గానిక్కూడా రాగూడదు!' తెల్లబోయాడా జవాబు విని రాజశేఖరంగారే అందుకున్నారపుడు—

'అంత కోపమెందుకు తల్లీ? రేపురా విజయ్! అందరం కలిసి వెళ్దాం!'

'నేను మాత్రం రాలేను నాన్నా! ఎవరికెంత కోపమొచ్చినా సరే!'

'పోనీలే అనూ! నీ యిష్టం వచ్చిననాడే వెళ్దాం! ఏదో కోపంగా వుందిలే మామయ్యా! విసిగించకండి అనుపమని! వస్తాను!' అంటూ వెళ్ళిపోయాడు విజయ్‌కుమార్.


'ఎదుటివాళ్ళపై ఎంత అయిష్టత వున్నా మరీ అంత మొండిగా నొప్పించగూడదమ్మా!' అన్నారాయన శాంత స్వరంతో. ఆవేశం, ద్వేషంతో పోరాడుతూన్న తండ్రి మనస్సునాపైన నొప్పించలేక మౌనం దాల్చింది.

* * *

నాలుగురోజులవరకూ మధుమూర్తి జాడే లేదు. మరునాడు అనుపమ కోపంతో ఫోను చేయబోతూండగా వచ్చాడు.

వెంట అక్కపిల్లలైన, మంజులా, కృష్ణలు వున్నారు.

అనుపమ అదివరలో వాళ్ళను చూడక పోవడంచేత ఎవరని ప్రశ్నించింది. అందుకు చిన్నవాడైనా, కృష్ణుడు వెంటనే సమా



ధాన మిచ్చాడు.

'మరి అత్తయ్య అన్నావుగా మామయ్యా? ఎవలంటుందేమిటి?' అప్పటికి గ్రహించిందామె వాళ్ళిద్దరూ శారద బిడ్డలని.

'అక్కయ్య ఆరోగ్యం మరీ క్షీణించి పోతోంది. అందుకే హాస్పిటల్లో జాయిన్ చేశాను నిన్ననే' అన్నాడు మధుమూర్తి.

ఆమెకూడా శారదను చూడ్డానికి వస్తానంది. తల దువ్వుకుంటూండగా కృష్ణుడు లోనికి వచ్చాడు.

మంజుల మాత్రం హాల్లోనే కూర్చుండి పోయింది. ఎనిమిదేళ్ళ వయస్సున్న ఆ పాపకు కొత్త, పాతా కొంచెంగా తెలిసి బుద్ధిమంతురాలిగా కూర్చుంది.

కానీ అయిదేళ్ళ కృష్ణుడుమాత్రం జంకూ గొంకూ లేకుండా ఇల్లంతా చుట్టి వచ్చాడు

అనుపమను ప్రశ్నలతో ముంచెత్తాడు.

'అల్లరిచేస్తే కొడుతుంది అత్తయ్య! అన్నాడు మామయ్య! మరి కొత్తలేదే?' అన్నాడు సందేహంగా.

నవ్వరాని ఆ మాటలామెకెంతో ముచ్చట గొల్పాయి. నవ్వుతూనే అన్నది—

'మీ మామయ్య అలాగే అంటారు బాబూ! నువ్వు నా జట్టుంటావా? బిస్కత్తులూ, బిళ్ళలూ పెడతాను.'

'అవ్! బిస్కత్తులు పెట్టావంటే నీ పీపెక్కి స్వారీ చేస్తానంటాడు మా అల్లుడు ఏరా కృష్ణా! అత్తయ్య జట్టా! నాజట్టు నుంటావా?' అని అడిగాడు మధుమూర్తి.

'నేను — నేను ... అత్తయ్య జత్తే వుంటాను!'

'అలా చెప్పరా బాబూ! మరి అయితే అత్తయ్య అత్తయ్య అంటూ కలవరించేస్తున్నావ్! ఇంతకూ పిల్లనిస్తుందేమో అడిగి చూడవోయ్!' అన్నాడు మధు చిలిపిగా అనుపమ వంక చూస్తూ.

'ఏం? అత్తయ్యా మరి... మరి... పిల్లనిత్తావా?' ఆ చిలిపి కృష్ణుడు మామకు వంత పాడనే పాడాడు వెంటనే.

అనుపమ మనస్సున తీయని భావాలెన్నో అలలై పరువు లెత్తాయి. సిగ్గుతో ఆనందంతో నిలువెల్లా పులకించి పూసిన తంగేడై పోయింది.


కృష్ణుణ్ణి దగ్గరకు తీసికొని ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంది.

'అంత అదృష్టం నాకెన్నాళ్ళకో?' మృదువుగా పరిహసించాడు మధుమూర్తి.

అనురాగం విరిసిన ఆమె విశాలనయనాలు విద్యుత్తునంటి భావనతో నిండి పైకి లేవలేక పోయాయి.

మనస్సున కోటివేల శహనాయిలు మధురాతి మధురంగా నినదించ సాగాయి.

ఎప్పటికో అతని వంక చూసిన ఆమె హృదయం ప్రణయ గీతాలతో నిండి పొంగి పోయింది పరవశాన.



'ఎంత చిలిపితనం!' అనుకున్నది మురిసిపోతూ. తర్వాత తమ్ముడికి ఫోనుచేసి బయల్దేరింది.

పళ్ళూ, రొట్టెలూ తీసికొని వెళ్ళి శారదకిచ్చింది.

'అక్కా! మనస్సున అమృతం నింపిన మధుర స్నేహమయి! అనుపమ! అని నీకు చెప్పలేదూ!' అంటూ శారదకు పరిచయం చేశాడామెను.

కనులతోనే నవ్వింది శారద, తమ్ముని పరిచయానికి. ప్రక్కనే కూర్చోబెట్టుకుంది అనుపమను.

'మా 'మధు' మాటలతో మనసుల్ని మురిపించి వేస్తాడమ్మా!'

'మురిపించడమే గాదండీ! మరిపించి వేస్తారుకూడాను'

'ముందు నన్ను వూపివేస్తున్నారే యిద్దరూ గలిసి మాటల వూయల్లోవేసి. అయినా మరీ అంత మందబుద్ధిననుకొంటున్నారేమో మీరు నన్ను! నాకు తెలుసు. మాటలతో ఆడవాళ్లను ఓడించలేరు మగవాళ్లెంతటి ధీరులైనా' అని అన్నాడు మధుమూర్తి నవ్వు నాపుకుంటూ.

మనోవ్యథతో, వ్యాధితో పాలిపోయిన శారద వదనంలో చిరునవ్వు మబ్బులచాటున మెరపులా మెరిసింది తళుక్కున ఆ పరిహాసోక్తులతో.

'భగవానుడా యిరువుర్నీ కలకాలం యిలాగే నవ్వులతో కలిసీ మెలిసి వుండేట్లు దీవించితే ఎంత బావుండును' అనుకున్నది శారద మనస్సున అనుపమా మధుమూర్తుల్ని చూసి.

'అయితే అనుపమ నిన్ను ఓడించివేసే వుంటుందన్నమాట. నిజమేనని ఒప్పుకుంటావా! మధూ!' అన్నది శారద.

'చూడక్కా! ఒక విధంగా రహస్యమే యిది! కానీ చెప్పవలసి వచ్చింది గనుక చెబుతున్నాను—' అనుపమవంక అనురాగపూర్ణదృష్టిని బరపుతూ, చిలిపితనం నిండిన స్వరంతో అన్నాడు తిరిగి—

'స్త్రీల హృదయాల్ని రంజింపజేయాలంటే మగవాళ్ళ 'పెత్తం'. అంటూ, ఓటమి నంగీకరించితే చాలు ఏవిషయంలోనైనాసరే!'

'మరీ అంత మూర్ఖులం గామండోయ్! మాష్టారూ! మాటల్లోనే ఓటమిని ఒప్పు

కున్నంత మాత్రాన అమూల్యమైన కూ హృదయాలను మీకందించం!'

'అందుకేగదా మరి! అంతటి మహాకవి వ్రాసుకున్నది మైమరిచి—పద్మావతీ చరణ చారణ చక్రవర్తి!' అని! ఏం జేయగలం? మరి?'

'అతివలే సృష్టికి అందమోయి!' అని పాడుకోక తప్పదు.

'అలా పాడుకుంటూనే వుండండి! నేను వెళ్తున్నాను!' అంటూ శారదతో చెప్పి లేచి నిల్చుంది అనుపమ.

మంజులా కృష్ణుల్ని తనతోనే వుంచుకుంటానంది కొన్నాళ్ళు. శారద అభ్యంతరం చెప్పలేకపోయింది. మధుమూర్తి కూడా 'అనుపమను ఒప్పించలేం అక్కా! అయినా వెళ్ళనివ్వు! మన కృష్ణుడితో ఎన్నాళ్ళు వేగుతుందో చూద్దాం' అన్నాడు అడ్డు చెప్పకుండా.

'నేను ... నేనేమీ అల్లరే చేయను! తెలుసా! మా అత్తయ్యదగ్గర!' అంటూ పెద్దబుద్ధిమంతుడిలా కృష్ణుడు అనుపమ దగ్గరకువెళ్ళి నిల్చున్నాడు.

అందరూ నవ్వుకున్నా రామాటలికి.

ఇంటికి వెళ్ళినతర్వాత వాళ్ళిద్దరకూ స్నానాలు చేయించి అన్నం పెట్టి నిదుర బుచ్చిందామె.

రాజశేఖరంగారు కూడా ఆ పసివాళ్ల చిలిపి ఆటల్ని చూస్తూ వచ్చీరాని మాటల్ని వింటూ నవ్వుకున్నారు మనసారా.

'కృష్ణుడు మహా చిలిపి దొంగ! మంజుల మంచితల్లి!' అంటూ ఆడుకునేవారు.

'అయితే! మీ జుత్తు వుందనే వుందను తాతగాలూ!' బెదిరించేవాడు కృష్ణుడు రోషంతో.

కానీ ఆయన చేతిలో బిస్కత్తులూ, బిళ్ళలూ కన్పించగానే అంత రోషాన్నీ మరిచిపోయి 'తాతగాలూ! మలి! మలే!'_అంటూ దగ్గరకు చేరేవాడు.

ఆ తండ్రీ కూతుళ్ళిద్దరూ నవ్వుకునే వాళ్ళు ఆ పసివాడి చేష్టలకి. నాలుగో రోజునే మధుమూర్తి వచ్చి పిల్లల్ని తీసికెళ్ళాడు. రాజశేఖరంగారెంతగా వారించుతున్నా.

'నాన్నగారుంటే మనం బంధువులమయ్యేవాళ్ళమోయ్! మధూ! అయినా యిపుడేం పోయిందని పరుగునవచ్చావ్? అనుపమ

వుందిగదా! అమ్మనీవయస్సులో కష్ట పెట్టడమెందుకయ్యా? అక్కయ్యకు కాస్త నెమ్మదించేవరకిక్కడే వుండనివ్వు!' అన్నారాయన ఆత్మీయత వెల్లి విరిసిన స్వరంతో.

'అనుపమకు కాలేజీ తెరుస్తారు గదండీ! వీళ్ళతో వుంటూ చదువూ సంధ్యల్ని మరిచిపోతుంది' అన్నాడతడు.

'నిజమే' నని అంగీకరించారాయన. పిల్లలిద్దరకూ క్రొత్త బట్టలు కుట్టించింది అనుపమ.

'అన్నపూర్ణవై పుట్టి వుండవలసింది నువ్వు!' అన్నాడు మధుమూర్తి 'అప్పుడు మీరు అవతారాన్ని మార్చవలసి వచ్చేది!'

'నేనేం మారనక్కరలేదులే! అన్నపూర్ణగా మారగలిగిన వాళ్ళే విశ్వేశ్వరుణ్ణి సృష్టించగలరు' అన్నాడతడు నవ్వుతూ.

మరో పదిరోజుల వరకూ శారద వ్యాధి తగ్గుముఖం పట్టనే లేదు. నీరసంతో మరింత శుష్కించి పోయింది. నెలరోజులు హాస్పిటల్లోనే వుంచాలన్నాడు డాక్టరు. ఈ నీరసంలో 'టి. బి' వస్తుందేమో, జాగ్రత్తగా మందులు వాడాలి! ఆమె మనస్సును ఆహ్లాదపరిచేట్లు ప్రవర్తించాలి మనం' అన్న డాక్టరి మాటలతో మధుమూర్తి చలించి పోయాడు.

నిమిషమైనా తీరికలేక పోయినా శారద కోసం ప్రతీ వుదయమూ సాయంత్రమూ హాజరయ్యేవాడు. ఉన్నంతసేపూ హాస్యోక్తులతో ఆమె మనస్సున రేగిన ఆవేదనను కొంతవరకు మరిపించాలని ప్రయత్నించేవాడు.

రెండు మూడురోజులకోసారి అనుపమ కూడా వచ్చేది. కావాలని ఆమెతో పరిహాసపూర్ణమైన వాగ్యుద్ధాలని సృష్టించి మనసారా నవ్వించుతూండేవాడు.

మబ్బు తెరల్లా ఆవరించుకున్న విషాదచ్ఛాయలు కన్పించగానే ఎంతో నచ్చజెప్పేవాడు. రెండుసార్లు పిల్లల్ని తీసికొని వచ్చి చూపించాడు.

ఓ విధంగా ఒద్దున పట్టిందామె ఆరోగ్యం. 'పాలెం' పంపించి తల్లితో జాగ్రత్తగా చూడమని చెప్పి, మాధవి పరిస్థితిలో ఏ మార్పులేదని చెప్పగా, బరువుగా నిట్టూర్చాడు లోలోన బయలుదేరుతూ.

'ఏమో! నాయినా! నీ బ్రతుకున సుఖం పండేట్లు కన్పించడం లేదురా!' అన్నది తల్లి నిరాశగా.

'ఎలా జరగవలసివుంటే అలాగే జరుగుతుందమ్మా. మనం విచారించినా ప్రయోజనం వుండదు. కొన్ని పరిస్థితుల్లో సమస్యలు పైబడినపుడు క్రుంగిపోతే జీవించలేం!' అన్నాడుతడు గంభీరంగా.

అంతలోనే మాధవి చేతిలో ఎర్రనిపర్సు వూపుకుంటూ వచ్చింది.

'ఇందులో పిచ్చికాగితాలున్నాయి! చింపి పారేస్తున్నాను బావా! ఈ పర్సుతో ఆడుకుంటాడట మా బాబు' అంటూ పర్సులో వున్న మూడు వందరూపాయల నోట్లను చింపివేయ బోయింది.

'అరే! మాధవీ! అది ఆఫీసు డబ్బు! నేను చింపేసానుగా!' బ్రతిమలాడుతూ పర్సును తీసికొని నోట్లు తీసికొన్నాడు మధుమూర్తి.

'మరి నాకాపర్సు యివ్వవూ' పసిపిల్లలా అడిగింది.

'ఎందుకివ్వను? మాధవీ! పర్సేగాదు! నన్నుకూడా అర్పించుకున్నాను మనస్ఫూర్తిగా! కానీ... ప్చ్! ఆ కల కరిగిపోయింది! ఈ నీ కనులలో ఎన్నివేల మధుర కావ్యాలు చదువుకున్నాను?! ఎన్ని వూహాల మేడల్ని నిర్మించుకున్నాను? ఇపుడక్కడ యీ మధుమూర్తికి ఎంత వెదుక్కున్నా ఏమీ లభించడం లేదు! ఏం చేయను?' ఆమె భుజాలపైన చేతులుంచి ఆ కనులలోకి చూస్తూ నిశ్శబ్దంగా రోదించిందాతని హృదయం.


కనులలో అశ్రుబిందువులు నిండుకొచ్చాయి. మాధవివైపే చూస్తూండిపోయాడెంతోసేపు.

తల్లి మౌనంగా కళ్ళు వత్తుకుంది గుమ్మంచాటున నిలబడి ఆ దృశ్యాన్ని చూడలేక.

'ఛీ! ఏడుస్తున్నావెందుకూ? మీ అమ్మ కొట్టిందా? పోనీలే! మా బాబుతో ఆడుకుందువుగానిలే! రా! అయ్యో! రా! మరి! అత్తయ్యా! చూడిటు! బావకు పిచ్చెక్కిందనుకుంటాను. బాబో! నన్ను కొడుతాడేమో!' అంటూ అతని చేతుల్లోంచి తప్పించుకుని ఆ రబ్బరు బొమ్మను తీసికొని పరుగున వెళ్ళిపోయింది.

'వెళ్ళిపో! మాధవీ! నాకే సుఖాన్ని అందనీయక! అయినా జీవితంపై ఆశ మాత్రం నశించడం లేదు!' నిరాశతో నిట్టూర్చిందతని మనస్సు మౌనంగా.

(ఇంకా ఉంది)



ధనంమీద ఎక్కువ ఆశ వున్నవారే ధనానికి దాసులవుతారు. ఆ ధనాన్ని సంపాదించడానికి నానా అవస్థలూ పడతారు అలాటివారు కేవలం ధనానికే కాదు తమకు ధనాశ చూపినవారి కందరికీ దాసులయి వారి దయా దాక్షిణ్యాల కోసం ఎదురు చూస్తూ వుంటారు. అలా ఆశపడినా అది నిరాశ అవుతుంది.

ఒకప్పుడు ఒక ధనాశాపరుడికి ఒకడు ఆశ చూపాడు—ఒక కొండ దగ్గర ధనం మూటపెట్టి, ఆ కొండచుట్టూ తిరిగి ఒకటిన్నర గంటకాలంలో ఆ స్థలానికి వచ్చినట్లయితే, ఆమూట అతనిదవుతుందని. ఆ కొండచుట్టూ తిరిగి రావడానికి—వేగంగా నడిస్తే ఒక గంటకాలం పడుతుంది. సాధారణంగా నడిస్తే మరొక పావుగంట కావాలి. ఎలాగూ గంటన్నర కాలంలో గమ్యస్థానం చేరుకోడానికి కష్టం వుండదు. ఈ సంగతి ఆలోచించే ఆ ధనదాసుడు కొండకు ప్రదక్షిణంచేసి రావడానికి సమ్మతించి బయలుదేరాడు.


తొందరగానే గిరిప్రదక్షిణం చేసి రావలెనని అనుకున్నా, నడక తొందరగా సాగలేదు. దారి సరిగా లేదు; సరికదా, నడుమ ముళ్లతుప్పలూ, ఎగుడు దిగుడుగా ఉన్న రాళ్లూ అవరోధాన్ని కలిగించాయి. దారి సమంగా ఉన్నచోట్ల పరుగెత్తినా గమ్యస్థానం చేరడానికి నియమితకాలం కంటె ఏడెనిమిది నిమిషాలు ఎక్కువ పట్టింది. చివరికి శ్రమయే మిగిలింది. ఫలితం లేకపోయింది.

ధనానికి దాసుడైన వాడికి ప్రాణాపాయం సంభవించడంలో ఆశ్చర్యం లేదు.

ధనాశాపరుడైన ఒక వ్యక్తి తాను సంపాదించిన ధనాన్ని పొడుగాటి సన్నని సంచిలోవేసి, ఆసంచీని పటకావలెనే మొలకు కట్టుకుని వుండేవాడు. పంచతంత్రం కథలో దేవశర్మ అనే లోభిసన్యాసి బొంతలో నాణెములు కుట్టుకుని ఆ బొంతను విడవకుండా వుండేవాడని విన్నాం. అతడిని మించినవాడీ ధనదాసుడు. రొక్కపు సంచీని క్షణకాలమైనా విడవడానికి వీలుండేది కాదు.

ఇలా వుండగా, ఒకప్పుడు అతడు పడవ ప్రయాణం చెయ్యవలసి వచ్చింది. పడవ నదిలో సగం మేర చేరేసరికి

ధర్మపథం



ధనానికి దాసులైతే


బులుసు వెంకటరమణయ్య

వడి ఎక్కువైనది. ప్రయాణికులు కలతపడి భయంతో అందరూ ఒక ప్రక్క చేరేసరికి పడవ మునిగిపోయింది. ఈత వచ్చినవాళ్లు ఎలాగో శ్రమపడి అవతలిఒడ్డు చేరుకున్నారు. ఈ ధనాశాపరుడికి ఈత కొంచెం వచ్చును. అది అతని ప్రాణాలను కాపాడుకోడానికి మాత్రమే ఉపయోగిస్తుంది. అతని మొలకు బరువైన రొక్కపు సంచీ కట్టివున్నందున కొంచెం దూరమైనా ఈదడానికి సాధ్యపడలేదు. ధనానికీ, ప్రాణానికీ లంకె పెట్టుకున్న అతనికి సంచీ విప్పి, విసరి పారివెయ్యాలనే ఆలోచన తోచలేదు. దానిబరువునకతడు నీటిలో మునిగిపోవలసి వచ్చింది. అతడు ధనాన్ని విడవలేనందున, ధనం కూడా అతనిని విడవలేక తనతోకూడా నీటి అడుగుభాగానికి తీసుకుని వెళ్లిపోయింది.


ధనంమీద ఆశలేనివానికి ధనమే దాస్యం చేస్తుంది. ధనాన్ని లెక్కచెయ్యనివారు మహాత్ములని గౌరవించి, అందరూ — అక్కరలేదన్నా, అట్టివారికే కానుకలూ, కట్నాలూ సమర్పిస్తారు.

ధనానికి మనం దాసులమైతే ఎన్నో అనర్థాలు కలుగుతాయి. చివరకు ప్రాణాపాయంకూడా సంభవించవచ్చును.

ధనాన్ని తృణప్రాయంగా చూస్తే, అదే మనకు దాస్యం చేస్తుంది. ఎట్టి శ్రమలూ లేకుండా జీవితం సుఖమయంగా గడిచిపోతుంది. ●



ఒడ్డుచేరని కెరటం



యర్రంశెట్టి సాయి

ఆకాశం మొఖం నల్లగా మాడ్చుకొంది. కాసేపుంటే ఫొళ్లున ఏడ్చేట్లుంది. హాస్పిటల్ వార్డంతా నిశ్శబ్దంగా వుంది. తాతయ్య ఇరవైనాలుగో నెంబరు బెడ్‌మీద పడుకొని డిటెక్టివ్ నవల చదువుతున్నాడు. అలాంటి పుస్తకాలంటే తాతయ్య కిష్టం లేదు. కానీ తన కిష్టం అన్న సంగతి తాతయ్యకి తెలుసు. అంచేత చూపు సరిగ్గా ఆనక పోయినా తను తెచ్చిచ్చిన డిక్టివ్ నవల కష్టపడి చదువుతున్నాడు. అందుకే తాతయ్యంటే తన కిష్టం. దూరంగా గేటు దగ్గర ఇద్దరు నర్సులు ఎలక్ట్రిక్ దీపం కాంతిలో ఏదో కాగితం చదువుతున్నారు, ఏమై వుంటుందా కాయితం? ఏమో? ఏదయినా అయుండొచ్చు.

'ఇవిగో స్లీపింగ్ పిల్స్...'

సిస్టర్ ఇరవైమూడు బెడ్‌మీదతనకి ఇస్తోంది. పాపం ఆయనకి నిద్రపట్టదు గాబోలు. అదో జబ్బు. ఈ జబ్బు చాలా మందికుంది. తనకీ వుంది. క్రొత్తగా రిలీజయిన పిక్చరుకి ఏ కారణం చేతయినా వెళ్లకపోతే (నూరు పాళ్లు వెళ్తాడు) ఆ రాత్రంతా నిద్రపట్టదు. క్రిందటి సోమవారం కెమిస్ట్రీ లాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తూండగా టెస్ట్ ట్యూబ్ పగిలితే తన ఎదురుగ్గా వున్న బి. జెడ్‌సీ పిల్ల సువర్చల ఘూమ్మని నవ్వేసింది. అందుకు వళ్లు మండిపోయి ఆ రోజు సాయంత్రం సువర్చల కాలేజి నుంచి ఇంటికి వెడుతోంటే, కాలేజిగేటు దగ్గర మొదలెట్టి, ఆమె ఇంటివరకూ తను సువర్చలని ప్రేమించేడు. ఆరోజు రాత్రి కూడా తనకి నిద్రపట్టలేదు. అంతకు ముందు నాలుగయిదుసార్లు సీనియర్ క్లాసమ్మాయిలని ప్రేమించినప్పుడు కూడా తనకలాగే నిద్ర పట్టలేదు. ఇది ఒక్క తనకనే కాదు. సీతాపతిగాడిక్కూడా ఎప్పుడేనా ప్రేమించినప్పుడు అలాగే నిద్రపట్టదట. ఇంకోటి గూడా చెప్పాడు వాడు. ప్రేమించినమ్మాయి దగ్గరయినా కూడా నిద్ర పట్టదట.

'ఒరేయ్! ఆ వరండాలో ఎందుకూ? చలిగాలి వేస్తోంది! లోపలికి రా!...'

తాతయ్య పిలుస్తున్నాడు. టైము ఎనిమిదయింది. సెకండ్‌షో తొమ్మిదీ నలభైయ్యిదుకి. చాలా టైముంది. కాసేపు తాతయ్యతో 'హస్కు' కొడితే ఇట్టే గడిచిపోతుంది. ఈ లోపల వర్షం తగలడకుండా ఉంటే చాలు.

'వరేయ్! ఈ డిటెక్టివ్ అడ్డమయిన ఎంగిలి సిగరెట్లూ జేబులో వేసుకొంటాడు. వీడికేం రోగం రా?...'

పిచ్చి తాతయ్య! ఆ సిగిరెట్టు ముక్కలే హంతకుల్ని పట్టిస్తాయని తెలీదు పాపం! ఆ సంగతే చెప్తే నవ్వాడు తాతయ్య. నవ్వి అడిగాడు.

'నాకు తెలీకడుగుతాను. తాపీగా సిగరెట్లు త్రాగుతూ చంపుతారన్నమాట హంతకులు' వళ్లు మండుతోంది తాతయ్య ప్రశ్నకి.

'చదవడం ఇష్టంలేదని చెప్పరాదూ! ఇలాంటి చచ్చు ప్రశ్నలేసి తనని విసిగించకపోతే.

చలిగాలి రివ్వున వీచింది. చినుకులు మొదలవుతాయేమో!

'డియర్ గాడ్! తొమ్మిదిన్నరవరకూ వాన దేవుడి పీక నొక్కెయ్! నేను సినిమాకెళ్లాక

కురిసినా ఫర్వాలేదు.

తాతయ్య తిరిగి డిటెక్టివ్ కథలో మునిగిపోయాడు. మూల ఇద్దరు పేషెంట్లు కబుర్లు చెప్పుకొంటున్నారు. అందులో ఒకతను క్రొత్తగా ఎడ్మిట్ అయాడు. రెండోవాడు చాలా పాతవాడు. తాతయ్య కంటె పాత పేషెంట్! తాతయ్య చేరి మూడు నెలలవుతోంది. అప్పట్నుంచీ తను రాత్రిళ్లు తాతయ్యదగ్గరే పడుకొంటున్నాడు. అంచేత ఈ వార్డులో వాళ్లందరూ బాగా తెలుసు. నర్సులందరూ బాగా పరిచయం. అందరిలోకి దేవకినర్స్ చాలా బావుంటుంది. సెక్సీగాకూడా వుంటుంది. ఆమధ్య చూసిన ఇంగ్లీష్ సినిమాలో హీరోయిన్‌లా వుంటుంది. ఆ అమ్మాయిని ప్రేమించేద్దామనుకొన్నాడుగానీ తాతయ్య దగ్గరుండి పోయాడు. ఈ వెధవ్వేషాలన్నీ ఇట్టే పసిగట్టేస్తాడు. చాలా కేర్ఫుల్‌గా వుండాలీ ముసలాయనతో! ఎక్కడా దొరగ్గూడదు.

అదో! దేవకి నర్స్ వచ్చేస్తోంది. తాతయ్యకి టాబ్లెట్స్ ఇవ్వడానిగ్గాబోలు. తన క్రాఫ్ చెదిరిపోయినట్లుంది వెధవ క్రాఫ్! సరిగ్గా దేవకి వచ్చేప్పుడే చెదరిపోవాలా?

ఏమండోయ్! ఇంకా నిద్రపోలేదేం? ఏదేనా సినిమాకి ప్రోగ్రాం వేశారేమిటి?' నవ్వుతూ అడిగింది. అబ్బ! నవ్వుతూంటే ఎంత అందంగా వుంటుందని.

'మీదిష్టే తగిలింది! చూడండి వర్షం కురిసేట్లుంది...'

'బావుందండోయ్! మీరు సినిమాకెళ్తే మధ్యన మాకెందుకు...' చిరుకోపంతో అంది. ఈ ఫోజులోకూడా అద్భుతంగా వుంది దేముడో! అందాన్ని అందరికీ సమంగా పంచక ఎందుకుసార్! ఇలా ఒక్కొక్కచోటే పడేస్తూంటారు?

'యమధర్మరాజు కూతురొచ్చిందా?' డిటెక్టివ్ నవల ప్రక్కనపెట్టి అడిగాడు తాతయ్య.

హాస్పిటల్లో అందరికీ పేర్లెట్టాడు తాతయ్య.

హాస్పిటల్ నరకం. ఆపరేషన్లు చేసే పెద్దడాక్టరు యమధర్మరాజు. చిన్న డాక్టర్లు యమధర్మరాజు కజిన్స్. నర్సులు యమధర్మరాజు కూతుళ్లు. వార్డ్‌బాయ్‌లందరూ యమకింకరులు. పేషెంట్లందరూ పాపాలు చేసి శిక్ష అనుభవించటానికి వచ్చినవాళ్లు. పాపంకొద్దీ శిక్ష; వాళ్లగాయాల్ని హౌస్ సర్జన్లు ఇష్టం వచ్చినట్లు కెలికెయ్యడం చిత్రవధ.

'అవునండీ! రెండోకూతుర్ని!' అంది దేవకి నవ్వుతూ.

'ఇంకా ఆలస్యం ఎందుకూ? ఆ విషం మాత్రలిటివ్వు!... ఇవాళ నా వంట్లో సూదులు గుచ్చే శిక్ష అన్నారుగా! గుచ్చలేదేం?'

'మందు అయిపోయింది రేపు గుచ్చుతాం వదలం లెండి!'

మాత్రలు తీసుకొని మింగి మంచి నీళ్లు త్రాగాడు తాతయ్య.

'నిన్న మీరిచ్చిన నవల చదివానండీ! చాలా అద్భుతంగా వుంది...ఇంకోటేదయినా ఇవ్వండి...'

'ఇది బావుంది. చాలా బావుంది. చదివిన నవల తిరిగి ఇవ్వరేం?' ఈ అమ్మాయితో మాటలు ఎంత పెంచుకొంటే అంత బావుంటుంది.

'అబ్బ కొరుక్కు తినేయంలెండి మీ నవలని...తెచ్చి ఆ గదిలో వుంచాను...'

'ఏమో! మీ హాస్పిటల్ వాళ్లని నమ్మొందెవరు. 'తినేయడం' బాగా అలవాటు...'

'ఊహు! ఈ మాటలే నేర్పుతారు కాబోలు కాలేజీలో!'

'పోనీ సరదాగావుంటే మీరూ రండి! నేర్చుకొందురుగాని...'

'ఏం అక్కర్లేదు...'

'పోనీ నేను నేర్పేదా?'

'అబ్బ! అలాగేం?' అంటూ నవ్వుకొని వెళ్లిపోయింది. అక్కడ్నుంచి.

'ఒరేయ్! మొన్నేగా సినిమాకెళ్లావ్! మళ్లీ ఇప్పుడు వెళ్లకపోతేనేం?'

'అవును తాతయ్యా! మొన్ననగా వెళ్లాను. ఇప్పుడు వెళ్తేఏం?'

'మరి కాలేజి పుస్తకాలెందుకురా ఇక్కడికి తేవటం! చదివేవాడిలా!'

'డాడీ వూరుకోరు తాతయ్యా! చదువుతున్నట్లు యాక్టెయ్యాలి మనం. అంతే!'

'మీ నాన్నకి పిల్లల్ని సరిగ్గా పెంచడం తెలీదురా! చూడు నువ్వెలా చెడిపోతున్నావో!'

'తెలిసి నువ్వు నాన్నని, బాబాయిలని బాగా పెంచావ్ తాతయ్యా! నిన్ను హాస్పిటల్లో చేర్పించి మళ్లీ అంతులేకుండా తిరుగుతున్నాడు నాన్న! అసలు నువ్వున్నావనే సంగతే మర్చిపోయారు బాబాయిలు. అమ్మమ్మ ఒక్కసారి వచ్చి ఓ పదినిమషాలుండి 'పొలం పనులున్నాయంటూ' వెంటనే వెళ్లిపోయింది. ఎందుకు తాతయ్యా! వీళ్లందరినీ ఎందుకిలా తయారు చేశావ్?' ఇవన్నీ తను తాతయ్యని అడగ్గలడు. కానీ అడగడు. దీనికి జవాబు తాతయ్యకీ తెలుసు. తనకీ తెలుసు.

ఈ హాస్పిటల్లో కథలు కూడా బోలెడు విన్నాడు తను.

పేషెంట్‌కి ఆపరేషన్ చేయాల్సివస్తే ఎంతో కొంత ముట్టజెప్పాలి. లేపోతే నెల్రోజుల్లో జరగాల్సిన ఆపరేషన్ ఆర్నెల్లకి చేస్తారు. తరువాత ఆర్నెల్లకి డిశ్చార్జి చేస్తారు. నరకంలో పద్నాలుగు నెలలంటే మాటలు కాదు. సజీవంగా ఎవ్వరూ బయటకి వెళ్లరు. డామ్‌హెల్! లెటిట్ బి! తొమ్మిదయిపోయింది. ఇక ఇక సినిమాకెళ్లిపోడం బెస్టు.

'తాతయ్యా! తొమ్మిదయిపోయింది ఇక పడుకో! నేను పోతున్నాను...'

'ఆ లైటు తీసేసిపో!'

మెట్లు దిగుతోంటే దేవకి ఎదురొచ్చింది.

'ఏ సినిమాకేవిటి?'

సంభాషణలో ఈసారి కొంచెం చొరవ చెయ్యాలి. లేకపోతే ఎప్పట్లాగే ఈ ఉట్టుట్టి డైలాగులు.

'ఏం మీరూ వస్తున్నారా?'

'ఛీ! నేను రావడమేమిటి?'

'ఏం పెద్ద ఖూనీ చేసినట్లు మాట్లాడుతున్నారు? ఎప్పుడూ సినిమా కెళ్లలేదా?'

ఎప్పుడూ మొగాళ్లతో వెళ్లం తెలుసా?'

'అలా అని నేనన్లేదుగా ఇప్పుడు?'

'అమ్మో! ఎంత గడుసు వారో! అనలేదుట!' కళ్లు త్రిప్పుతూ వెక్కిరించింది.

'ఏమని?'

'ఊహూ! మీతో ఇలా మాట్లాడుతూ కూర్చుంటే ఈ మెట్లమీదే తెల్లారిపోతుంది. నేను వెళ్తాను బాబూ!...'

చకచక మెట్లెక్కేసింది. గేటుదగ్గర ఘూర్ఖావాడు సెల్యూట్ కొట్టాడు.

'కిత్‌నే బజే వాపస్ హోతే సాబ్!'

'ఒంటిగంటన్నరవుతుందోయ్!'

వీడికి అప్పుడప్పుడు పావలో అర్ధో ఇస్తూండాలి. లేపోతే బయటకీ లోపలికీ ఇష్టమొచ్చినట్లు తిరగనీడు.

సినిమాహాలు దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఈ సినిమాకిది మొదటిరోజు! చదలు పట్టినట్లున్నారు జనం. ముందే రిజర్వేషన్ చేసుకోడం మంచిదయింది. ఈ జనంలోదూరి హాల్లోకెళ్ళడానికే పావుగంట పట్టేట్లుంది.

'హీరోయిను నాలుగుపార్లు స్నానం చేసే సీన్లుండయ్యంట్రా!' ఎవరో ప్రక్కవాడితో అంటున్నాడు.

టికెట్లు గేటుదగ్గర ఇవ్వగానే ఒహ టార్చిలైటు వాడొచ్చి సీటుదగ్గరకు లాక్కుబోయి అందులో కూలేశాడు. ఇటు ప్రక్క ఒహ మీసాలవాడు. అటుప్రక్క తన జూనియర్ స్టూడెంట్స్. ఎదురుగ్గా సీట్లలో క్రొత్తగా పెళ్ళయిన జంటగాబోలు. ఆపిల్ల తెగ బోలెడు సిగ్గుపడిపోతోంది. మొగుడేశ్వర్రావు ఆ పిల్లని ఊరికే 'వరాలు' కోరుకోమని వేధించుకు తింటున్నాడు

'సుశీ! గోల్డ్‌స్పాటు త్రాగుతావా? వద్దా! పోనీ చాక్లెట్ టీ? అదీ వద్దా మరి చిప్స్ తీసుకోరాదూ!... అబ్బ! ఏదో


ఒడ్డుచేరని కెరటం

హాటి అడుగు సుశీ!...

సుశి అడగలేదు. ఇంకొంచెం సిగ్గుపడింది. పడి ముసిముసిగా నవ్వింది. నవ్వి మళ్ళీ సిగ్గుపడింది. అప్పుడు 'హేం వద్దండీ!' అంది మెల్లగా వాడికొక్కడికే వినబడేట్లు. స్లైడ్సు వేస్తున్నారు. నర్సమ్మ చుట్టలే కాల్చుడు. మీ క్రాఫ్‌కి సింగినాథం కటింగ్ సెలూన్‌నే వాడుడు. మీ పిల్లలకి ఫామిలీ ప్లానింగ్‌నే వాడుడు. అయిపోయినయి. ఇండియన్ న్యూస్‌రీలు బిగినయింది. మనదేశం వాడెవడో అదేదో దేశం వెళ్ళాట్ట! ఇంకోదేశంవాడు మందేశానికి వచ్చాట్ట! బొంబాయిలో ఓ పెన్‌కార్లో కాసేపు తిరిగాడు. జనంలో ఒహడు కారు మీద పూలు విసిరాడు. తరువాత కెమెరా వేపు తిరిగి నవ్వాడు. తరువాత వరదల్లో కొట్టుకుపోయిన కొంచెం ఇండియా చూపించాడు. నిరాశ్రయులయిన వారందరినీ వరుసగా నుంచోబెట్టి గ్రూప్‌ఫోటో తీశాడు. అందులో ఓ పదేళ్ళపిల్ల ఎందుకో నవ్వుతోంది. ఎందుకో? దృశ్యం మారిపోయింది.

ఇందిరాగాంధి చుట్టూ అడవిజాతి వాళ్ళెవరో మూగి డాన్సు చేస్తున్నారు. వాళ్ళనృత్యం కొంచెం రాకెన్‌రోల్ మోడల్‌లో వుంది. వాళ్ళు మందేశంలోనే అదేదో పేరు చెప్పాడు, ఆ ప్రాంతంలో ఉన్నార్ట. అక్కడి ఆడాళ్ళు అర్ధనగ్నంగా వున్నారు. సామిరంగా! బ్రహ్మాండంగా వుంది సీను. ఈ దృశ్యం సెన్సార్ వాళ్ళకళ్ళ పడలేదుగా వాళ్ళు. రేపు తన బాచివాళ్ళందరినీ కొట్టుకొచ్చి చూపించాలి. ఇంకోదృశ్యం. బోలెడుమంది సర్దార్ జీలు, కొంచెంమంది మామూలువాళ్ళు కలసి చచ్చేంతస్పీడుగా పుట్‌బాల్ ఆడారు. చివరకి రెండిట్లో ఓ టీమ్ గెల్చింది. సీన్‌ఛేంజ్! బోలెడుమంది పిల్లలు రోడ్డుకడ్డంగా పరిగెడుతున్నారు. వాళ్ళమీద 'రెడ్‌ట్రయాంగిల్' పడింది. ది ఎండ్!

సుశీల మొగుడేశ్వర్రావు చెవిలో ఏదో గుసగుసలాడింది. ఇద్దరూ చిటుక్కున నవ్వుకొన్నారు. ఏం చెప్పిందో? ఏదో జోక్ వేసి వుంటుంది కుటుంబ నియంత్రణం గురించి. గుండెలు పగిలేంతశబ్దం విన్పించింది. అసలుసినిమా మొదలయిపోయింది. పందొమ్మిది రీళ్ళు. అంటే తెల్లారి ఏడవుతుందన్నమాట. చెట్లమీద టైటిల్స్ వేస్తున్నారు. వెనుక నేపథ్యగానం 'ఇంతేరా మన బ్రతుకులూ, అతుకుల, గతుకుల బాటలూ...' రోడ్డు మీద రెండుపేర్లూ, ఏదో బస్ పోతూంటే దానివెనుక రెండుపేర్లూ పడినయి తాడిచెట్టుమీద ఓ పేరూ, మిగతా పేర్లన్నీ పొలాలమీదా పంట కాలవమీదా పంచారు. సినిమా బిగిన్ అయింది. చిన్నపాట! అందులో ఓ ముసలాడు కుక్కిమంచంలో పడుకొని ఊరికే దగ్గుతున్నాడు. తాతయ్య గుర్తుకొస్తున్నాడు ఆ ముసలాడిని చూస్తుంటే! పాపం తాతయ్య! మూణ్ణెల్లయింది హాస్పిటల్లో చేరి. ఎలా వున్నావని అడిగినవాళ్ళులేరు అమ్మమ్మని చూస్తే వళ్ళుమండిపోతోంది తనకు. తాతయ్యకూ అమ్మమ్మకూ ఎప్పుడూ పడేది కాదుట. అయితే అంతమాత్రాన మంచాన పడివున్న తాతయ్యని ఏమాత్రం 'కేర్' తీసుకోకుండా 'పొలంపనులున్నా'యని వదిలేసి వెళ్ళిపోయిన అమ్మమ్మని తనెప్పుడూ క్షమించలేదు. అది అమ్మమ్మ కాదు. ఓ డెవిల్! అందాకా ఎందుకు తన ఫాదర్‌మాత్రం. పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. బోలెడు జీతం. లంచాలు తీసుకొంటూంటాడు. వారం వారం పెద్ద పెద్దాళ్ళకి పేద్దడిన్నర్‌లు ఇస్తూంటాడు.



అమ్మ క్లబ్బులకీ, అక్కడికీ తిరిగి బోలెడుడబ్బు ఖర్చుచేస్తుంది. కానీ ఇద్దరూ తాతయ్యని ఛస్తే దగ్గరకి రానివ్వరు.

'తమ్ముడు దగ్గరకెళ్ళక పోయావా నాన్నా!' అని వెళ్ళిపోతాడు ఆఫీసుకి. బాబాయిలు సరే సరి! ఒకడు హెన్‌పెక్‌డ్ బగ్గర్! వాణ్ణి చూస్తేనే తనకి వళ్ళు మండిపోతుంది. పిన్నికి చాకిరీ చేసిచ్చి ఓ గీత గియ్యమన్జెప్పి ఆ గీత మీద నడుస్తాడు. రెండో బాబాయి, అసలెక్కడున్నాడో కూడా తెలీదు ఎవ్వరికీ! తండ్రికి డబ్బు పంపాల్సొస్తుందని ఉత్తరాలు వ్రాయడం గూడా మానేశాడు. అత్తింటి నిండా భార్య తాలూకు పుట్టింటి జనం పుట్టలు పుట్టలుగా పడి మేస్తుంటారు. వీళ్ళెవ్వరికీ తాతయ్య అక్కర్లేదు. వీళ్ళకి మనుష్యత్వం లేదు. అమ్మమ్మ ఓ గయ్యాళి గంప. కొడుకులందరితోనూ తెగతెంపులు చేసుకొని ఊరుకొంది. తాతయ్య ఒక్కడే ఓ మూల పాపం! తన కందుకే తాతయ్యని చూస్తే జాలి, తాతయ్య వీళ్ళందరినీ తలుచుకొని లోలోపల కుమిలి పోతున్నాడు. తనకి తెలుసు. కాలేజి ఫీజు కని ఎక్కువ డబ్బు నాన్న దగ్గర కొట్టేసి తాతయ్యకి ఓరోజూ పళ్ళు, టానిక్కులూ తీసుకొచ్చేడు తను. అప్పుడు తాతయ్య తనని చూసి ఎంత ఏడ్చాడని.

'ఒరేయ్! నువ్వు పులివిరా! కాని తోడేలు కడుపున ఎలా పుట్టేవు!...' తాతయ్య ఏడుస్తుంటే తనకీ కన్నీళ్ళాగ లేదు. పాట మొదలయ్యింది సినిమాలో. వెధవది సినిమా మీద మనసు నిలవడం లేదు.

'ఫర్లేదు! ఏం ఫర్లేదు తాతయ్యా! నేనున్నాను. ఇంకొక్క సంవత్సరం ఓర్చుకో! డిగ్రీ చేతికి రాగానే ఓ మంచి ఉద్యోగం సంపాధించి నిన్ను తీసుకెళ్ళిపోతాను. నువ్వు నా దగ్గరే వుండూగాని. మా యిల్లంటే అసహ్యం నాకు. ఛస్తే అక్కడికి పోనిహా! వీళ్ళెవ్వరి మొఖం మనం చూడొద్దు...ప్లీజ్! నన్ను నమ్మ తాతయ్యా!'

బోలెడు సినిమా అయిపోయినట్లుంది.

'ఫొటోల సీను వచ్చింద్రోయ్!' ఓ కుర్రాడు అరచాడు.

ఒడ్డు చేరని కెరటం

మొదటి తరం హీరోయిను, చనిపోయిన భర్త ఫొటో దగ్గర కెళ్ళి ఫామిలీ కొచ్చిన సమస్యల గురించి బరువుగా మాట్లాడుతోంది ఫొటోతో! మొ॥ త॥ హీరోయిను తండ్రి. 'చనిపోయిన పెళ్ళాం ఫొటో దగ్గరకెళ్ళి 'శాంతా! అమ్మాయి నాతో మాట్లాడ్డం లేదు శాంతా! ఎలా! చెప్పవూ! చెప్పకపోతే నీ ఫొటోకే నా తల కొట్టుకొని ఛస్తా!' అంటూ భోరుమని ఏడ్చాడు. ఈ లోపల రెండోతరం హీరో ఆ గదిలోకి వచ్చాడు.

'వాడు మొఖానో ఫొటో పడెయ్యండ్రా! వాడూ ఏడుస్తాడు!' అరచారు కుర్రాళ్ళు. కొంచెం మంది గట్టిగా నవ్వారు. వెంటనే ఫొటోలు మనుషులయి మాట్లాడి మళ్ళి ఎప్పుడు మాట్లాడాలో చెప్పేసి వెంటనే ఫొటోలయిపోయిన్యి. సీను మారిపోయింది. రెం॥ త॥ హీరో, హీరోయినూ నీళ్ళలో నడుం లోతుకి దిగి వణుకుడు పాట పాడుతూ ప్రేమించుకొంటున్నారు.

ముందు సీట్లో భుజం చుట్టూ చెయ్యి వేశాడు మొగుడు.

ఇంటర్వల్! లైట్లు వెలిగినయి! సుశీ మొగుడూ దూరంగా జరిగి కూచున్నారు.

మళ్ళి బ్రతిమాలాడు మొగుడు 'సుశీ! ఏమయినా అడగవూ? ప్లీజ్!'

'ఊహూ!' అంది సుశీ గారాంగా

'ప్లీజ్! సుశీ ఇంకెప్పుడూ ఇలా అడగమని అడగనుగా! ఈ ఒక్కసారికి అడగవూ!' అని ఏడ్చాడు వాడు.

వాడి ఏడుపు చూళ్ళేక్కాబోలు 'సరే గోల్డ్‌స్పాట్ తేపో!' అంది సుశీ. వాడు సంతోషంతో అందరికాళ్ళు త్రొక్కుకొంటూ, తిట్లు వినిపించుకోకుండా బయటకి పరిగెత్తి ఓ కుర్రాణ్ణి వెంటబెట్టుకొచ్చేడు. ఇద్దరికీ చెంద్రించూ ఇచ్చేడు కుర్రాడు. మళ్ళి సినిమా మొదలయింది.

హీరో హీరోయినూ ఇద్దరూ ఒకరి నొకరు అపార్థం చేసుకు తగలడ్డారు. హీరోయిను తనగదిలో వరస బావదగ్గర నుంచొని రెండర్ధాల డైలాగులు మాట్లాడుతోంటె హీరో మామూలుగానే గోడచాటునుంచుని విని, మొదటర్థం గాలి కొదిలేసి, రెండో అర్ధం తీసేసుకొని కొండలమీదికి పరిగెత్తాడు. అక్కడ 'అసలన్నెందుకు పుట్టించావ్?' అని భగవంతుడికోసం వెదుకుతూ పాట మొదలెట్టాడు. హాల్లో జనం అందరూ చాలా ఇదయ్యారు! 'పూర్ ఫెలో! మొదట్నుంచీ చూస్తున్నాను సార్! పాపం అన్నికష్టాలే వాడికి!' అని కొంచెంమంది ఫీలయ్యారు. అందరికీ డైలాగులు రాసిన వాడిమీద కోపంవచ్చింది. 'ఇలాంటి అపార్థం డైలాగు లెందుకు వ్రాయాలి వాడు? దీనంతటికీ కారణం వాడేకదా!' అని కోప్పడ్డారు. ఇంకొంచెంమంది హీరో హీరోయిన్ల ఎడబాటు చూళ్ళేక లేచి ఇంటికెళ్ళిపోయారు.

సుశీ వెక్కివెక్కి ఏడుస్తోంది. మొగుడు సముదాయిస్తున్నాడు.

'ఇది నిజంకాదు సుశీ! సినిమా! నిజం! కావాలంటేచూడు మనచుట్టూ జనం వున్నారు. అందరూ ఏడుస్తున్నారా? ఏం ఏడవటం లేదు! పైగా మనవెనక కుర్రాళ్ళుచూడు నవ్వేస్తున్నారు. అదీగాక హీరో హీరోయినూ ఇంకో అరగంటలో మళ్ళి ఇట్టే అర్ధంచేసుకొని ఒకటయిపోతారు చూస్తూండు! వాళ్ళమాటల వినకడేముందని?...

సుశీ ఊరుకొంది. మొగుడు భుజంమీద తలవాల్చింది.

రేడియం ముళ్ళు ఒకటిన్నర మీదున్నాయి. నిద్ర వస్తోంది వెధవ సినిమా! ఇక వెళ్ళిపోడం ఆరోగ్యం.

హాస్పిటల్ చేరుకొనేసరికి రెండవుతోంది. దేవిక టేబుల్‌మీద తలపెట్టుకొని కుర్చీలో కూర్చుని నిద్రపోతోంది ఆమె మొఖంమీద వెంట్రుకలు ఫాన్‌గాలికి అటూ ఇటూ ఊగుతున్నాయి. అబ్బ ఎంత అందం.

గంటలకొలది అలా చూస్తూండిపోవచ్చు. తనకాలేజి మొత్తంమీద ఇంత అందమయిన అమ్మాయి ఎవ్వరూ లేరు.

ఉలిక్కిపడి లేచింది దేవిక.

'మీరా?' అంది కళ్ళు సగం తెరచి.

'ఔనండీ! ఇప్పుడే వస్తున్నాను...'

ఏదో తప్పుచేసినట్లు తడబడినయి మాటలు.

'ఎలావుంది సినిమా?'

'మామూలుగనే!'

'అంటే?' వెనక్కి కూర్చుని, కళ్ళు మరిమి నిద్రని వెళిపేసింది'.

'పిడ్చినేట్లుంది దస్సుమాట!'

'ఏవుంది! కొంచెం 'టీ' తాగుతారా?'

'మీదయ!'

'ఛీ! 'టీ' ఇవ్వడంకూడా దయేనేమిటి?... అది సరే అలా చూస్తున్నారెందుకు! ఆ రెండో కుర్చీ మీలాంటి వాళ్ళకోసమే వుంది!...'

'ఆల్ రైట్! కూచుంటాను!'

ఇద్దరికీ చెరోగ్లాసులోకి వంచింది 'టీ'! గ్లాసు అందుకొని తాగుతూంటే అంది.

'ఇన్ని సినిమాలు చూస్తారు గదా! ఏదో హాటి మాట్లాడడం నేర్చుకోలేదూ! అలా నిశ్శబ్దంగా చూడకండి!'

'ఎన్ని నేర్చుకొన్నా మీ ఆడాళ్ళముందు మాట్లాడలేము.'

'అబ్బ! పాపం! కాలేజిలో ఆడపిల్లల్ని ఏడిపించటానికి ఎలా మాటలొస్తయో?'

'మేం ఊరికే అల్లరి చేయటం లేదు. వాళ్ళు కావాలంటేనే గొడవచేస్తాం!'

'ఊహు! కావాలని అడుగుతారుట! ...ఓ రెణ్ణాళ్ళ పాపాయికి చెప్పండి ఈ మాటలు!'

ప్రక్కవార్డ్ నర్స్ భవానీ వచ్చింది.

'దేవకి! రావే! పంపల సిలుస్తోంది!'

దేవకి లేచి నుంచుంది. 'గుడ్ నైట్'

'గుడ్ నైట్...చూడండి! నేను వరండాలో పడుకొంటాను. ఓవేళ తాతయ్య లేచి అడిగితే చెప్పండి!'

'ఓ. కే. యువరానర్!'

నిద్ర ముంచుకొస్తోంది. తాతయ్య గాఢ నిద్రలో వున్నాడు. అబ్బ! చల్లనిగాలి వరండాలో! 'అబ్బ! పూర్ తాతయ్యా! ఎంతహాయిగా నిద్రపోతున్నావ్! నువ్వేదయినా మనశ్శాంతి అనుభవిస్తే, అది నిద్రలోనే కాదూ! నాకు తెలుసు తాతయ్యా! నువ్వు పైకి ఏదీ చెప్పవు. లోలోపల దాచుకొని పైక్కనబడకుండా ఏడుస్తున్నావ్! భయపడకు తాతయ్యా! నేను కొడుకుల్లాంటి వాణ్ణి కాదు. కొంచెం మంచాణ్ణి. నన్ను నేను పోషించుకొనే స్తోమతు కల్గితే చాలు. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజించుకొంటాను. డోంట్ వర్రీ మై డియర్ ఓల్డ్ మేన్!...నిద్రొస్తోంటే... ఈలోగా నీతో కొంచెం మాట్లాడుకొం

దేవకీ! ఓ యంగ్ బ్యూటీ! నిన్నే అదృష్టవంతుడు పొందుతాడో! ఏమయినా ఇంకొన్ని రోజులిక్కడ వున్నానంటే నా లవ్ 'ట్రై' చేసి చూస్తాను ఈలోగా కొంచెం పరిచయం పెంచుకోనీ! ప్లీజ్! అందుకు అవకాశమియ్యవూ...'

* * *

దేవకి బాగా కుదిపి లేపుతోంది 'మిస్టర్ క్లే! లెండి!' కళ్ళు బలవంతంగా తెరచుకొన్నాయి. బాగా తెల్లారి పోయింది.

'గుడ్ మార్నింగ్. మేడమ్!'

'గుడ్ మార్నింగ్ టైము ఆరయింది... లేవండి!'

'ఊ! ఏమిటి లేచి చేసేది?'

'ఇటు రండి! కొంచెం పనుంది...'

'చెప్పండి!'

'వెరీ సారీ! మీ తాతయ్య పదినిమిషాల క్రితం చని పోయారు. చాలా ప్రయత్నించారు డాక్టరుగారు. లాభం లేక పోయింది...'


తెలీకుండానే తాతయ్య మంచం వేపు అడుగులు పడినయి. తాతయ్య నిశ్చలంగా పడుకొని ఉన్నాడు. షెల్ఫ్ మీద డిటెక్టివ్ పుస్తకం పేజీలు గాలికి రెపరెప కొట్టుకొంటున్నాయి.

'ఇంటికి ఫోన్ చేయండి...' దేవకి అంటోంది.

అంతా అయోమయంగావుంది. మనసంతా ఖాళీ అయిపోయింది. ఏమీ ఆలోచనల్లేవు. జరిగిందాన్ని నమ్మలేకపోతోంది మనసు.

'ప్లీజ్! నామాట విని మీ ఇంటికి ఫోన్ చెయ్యండి...'

'ఆల్ రైట్! నువ్వు తెలివిగలవాడివి తాతయ్యా! డ్రామా సగంలో నీ 'కారెక్టర్' అనవసరం అన్నారందరూ. వెంటనే స్టేజి దిగిపోయావ్! నీకు నేనెందుకూ ఉపయోగ పడలేకపోయాను తాతయ్యా! ఏం చెయ్యను! డ్రామాలో నాకు పోర్షనివ్వలేదు. ఓవేళ మధ్యలో స్టేజి ఎక్కినా నాకు యాక్షన్ రాదు. అంతే! వెళ్ళిపో తాతయ్యా! వెళ్ళిపో! ఇప్పుడు మా నాన్నతోసహా నీ కొడుకులసబ్బీ సన్యాసులందరూ వస్తారు. అందరూ చందాలేసుకొని గ్రాండ్‌గా నిన్ను దహనం చేస్తారు...జరిగేదింతే! గుడ్ బై తాతయ్యా. మే యువర్ సోల్ రెస్ట్ ఇన్ పీస్!



మే లో కాశ్మీర్

తిరుమల్ల వెంకటనారాయణ.



మంచులో గొఱ్ఱెలు, గొఱ్ఱెకాపరులు

న్యూఢిల్లీ, శుక్రవారం మే 9:—ఎండ గుర్భరంగా ఉంది. రయిల్వే స్టేషన్‌లో గుంపు ఇంతా అంతా కాదు. చాలా చికాకుగా ఉంది. నేను వెళ్లబోయే చల్లటి దేశాన్ని తలుచుకుంటూ శ్రీనగర్ ఎక్స్‌ప్రెస్‌లోకి చొరబడ్డాను.

ఈ బండి పఠాన్‌కోట్ దాకానే వెడుతుంది. పేరుమాత్రం 'శ్రీనగర్ ఎక్స్‌ప్రెస్'! ఇక పఠాన్‌కోట్‌లో గంటసేపు క్యూలో నుంచుని, టూరిస్ట్‌గా రిజిస్టర్ చేసుకుని, బస్‌టిక్కెట్టు కొనుక్కుని (33 1/3% కన్సెషన్‌తో రు. 30.40 రిటర్న్) బయలుదేరాను ...

మంచులో 'కాప్రి'

ఉధాన్‌పూర్‌లో 'కాప్రి' హోటల్‌లో టీ. (కాప్రి వేసవిలో ఎండతగిలే ద్వీపం!) అక్కడ 'చల్లటి బీర్ తాగి' విశ్రాంతి తీసుకోమని ఒక పెద్ద బోర్డు. కండక్టరు విశ్రాంతి తీసుకుందామనుకుంటూ ఉంటే ఇద్దరు ఆడపిల్లలని కాశ్మీరుకి తీసుకుపోతున్న ఒక సర్దార్జీ ఆటంకం!

మా బస్సు ఘాట్‌రోడ్డుమీద మెల్లిగా కదులుతూ బనిహాల్ చేరుకుంది. హిమాలయ శిఖర దర్శనం. 'ఆ! మంచు!' అని అరిచింది నాతో ప్రయాణం చేస్తున్న బెంగాలీ ఆవిడ. గొప్పసంగతి కనుక్కుంది. రాత్రిమకాం అక్కడే.

తెల్లవారి లేచాను. బెంగాలీ ఆవిడ పసపిట్టలాగ కబుర్లు చెప్తోంది. 'గుడ్ మార్నింగ్!' అన్నాను. ఆవిడా అదేమాట అంది. 'ఒంటరిగా కాశ్మీరుకా?' అని అడిగింది, అవునన్నాను. ఆవిడ అందమయిన కళ్లలో మరుసమయిన ప్రశ్న— 'ఒంటరిగా అంత అందమయిన చోటుకా?' నేను సమాధానం ఇవ్వకుండా నవ్వి ఊరుకున్నాను

ఆదివారం: కొండ ఎక్కుతున్న బస్సు గర్భిణీ స్త్రీలాగ బాధపడ్తోంది. ఝీలమ్ నదిమూలం అయిన వీర్‌నాగ్‌ని చూద్దామన్నారు. ఎవరో ... చేతులు జోడించి కొలనుచుట్టూ ప్రదక్షిణం చేసేవారు; కొలనులోకి పువ్వులు చల్లి ఏదో వల్లించే ఒక పఠాన్. అవి మంత్రాలా?

కాజీగండ్— మొగలాయీ ఉపాహారం. పరోటా ఆమ్లెట్ మొగలాయీ వంటా? రోడ్లమీద బలిసిన కుక్కలు కునుకు తీస్తున్నాయి టూరిస్టుల మొహాలలో స్వప్నావస్థని సూచించే చిహ్నాలు.

హౌస్‌బోట్

శ్రీనగర్! 'వెల్‌కమ్ టు హౌస్‌బోట్' అనే పెద్ద నియాన్ అక్షరాలు టోంగావాలాలు, టాక్సీవాళ్లు మమ్మల్ని చుట్టుముట్టారు. నేను టోంగా తీసుకుని నా హోటల్‌గది చేరుకున్నాను. నాతో బస్సులో వచ్చిన ఢిల్లీ టీచర్, 'నేను తాగను!' అన్నవాడు నా బీర్‌సీసా రాగానే తయారవచ్చి కూర్చున్నాడు; ఆహ్వానం లేకుండానే...

భోజనం అయిపోయింది. లాల్‌చవుక్— అదే పెద్ద బజారు—చూడటానికి వెళ్లాము. ఝీలమ్ నదిమీది వంతెన దాటుతూ ఉంటే టోంగావాలా తన భాషలో ఏదో గొణుగుతున్నాడు. కింద నదీజలం మట్టిగా ఉంది. ఒకమూల గుమిగూడి ఉన్న 'పడవ ఇళ్లు'.

'వాన వరదలువచ్చి నీరు ఇలా అయ్యాయి' అన్నాడు టోంగావాలా.

డాల్

వళ్లు! ఎంతబాగున్నాయి. చూస్తేనే నోరూరుతోంది! కొన్ని కొనుక్కుని డాల్ సరస్సు గట్టుకి వెళ్లాను. పడవలవాళ్ల వ్యాపారం చురుగ్గా సాగటంలేదు గావును, నన్ను చుట్టుముట్టేశారు. ఒకతని వలలో పడ్డాను. సంజవేళ. నా పడవ నీటిమీద కన్యలాగ గంభీరంగా సాగిపోతోంది...

సన్నటి తుంపర. నీటిమీద నీటిచుక్కలు వజ్రాలలాగ మెరిసి మాయమయిపోతున్నాయి. సరస్సుకి అవతల మంచుకొండల శిఖరాలు. అస్తమించే సూర్యుడి కిరణాలు వాటిని మెరిపింప చెయ్యలేకపోతున్నాయి...

నా పడవ ఒక తెప్ప — తోటని చేరుకుంది. 'జమీందారుది. తోటలో పుచ్చకాయలు, టొమేటోలు, కాబేజీలు, గులాబీలు ఉన్నాయి,' అన్నాడు నా పడవవాడు, నూర్ మహమ్మద్. తోటలో పాగా చుట్టుకున్న యువతి కాలీఫ్లవర్లు కోస్తోంది. భర్తగావును పక్కనే చేవలకి గాలంవేసి

కూచున్నాడు. చిన్న బిడ్డ ఆడమనిషిని దీక్షగా చూస్తోంది...

హుక్కా

పొద్దు కుంకింది. తిరిగి వచ్చేశాను. దారిలో ఒక హుక్కా కాల్చి చూశాను. దాన్ని పీల్చడం తేలిక కాదు. నా తిప్పలు చూసి పడవవాడు నవ్వుకున్నాడు...

తుంపర వానగా మారింది. లాల్ చవుక్‌లో హోటల్లో తొమ్మిది రకాల దోశలు. నల్ల మలబారు సర్వరు దోశలు అయిపోయాయన్నాడు...

గుల్మార్గ్

సోమవారం:—గుల్మార్గ్ శ్రీనగర్‌కి సుమారు 30 మయిళ్లు. దారిపొడుగునా సన్నటి పోప్లార్‌చెట్లు. రోడ్డు వెంబడే చిన్నవాగు. ఒక చెట్టుకింద చింపిగుడ్డల్లో ఉన్న ఇద్దరు పిల్లలు ఏదో చర్చించేస్తున్నారు. వారి చేతుల్లో కర్రలు. వారి మందలు పచ్చికలో మేస్తున్నాయి.

టాంగ్‌మార్గ్ గుల్మార్గ్‌కి ఇంకా మూడున్నర మయిళ్లు. అందరిలాగే ఇక్కడ నేనూ నా మామూలు బూట్లు విప్పి, వర్‌కోటూ, పొడుగుబూట్లూ వేసుకుని గుర్రం ఎక్కాను. గుల్మార్గ్‌లో ఉన్న పూలలోయ 8500 అడుగుల ఎత్తున ఉంది. దారి సన్నటిది. భయంకరంగా ఉంది. గుర్రం మాత్రం బెదురు లేకుండా వెళ్లిపోతోంది. నా 'గుర్రం—అబ్బాయి' పేరు ఫిర్దవుస్. సరదా కుర్రాడు. నేనొకచోట ఊపిరి బిగబట్టాను. ఫిర్దవుస్ చిరునవ్వు నవ్వాడు. 'భయపడకండి మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. సన్నిబాయ్ (గుర్రం పేరు) మంచివాడు! అవునా!'

'అవును!' అన్నాను నవ్వుతూ.

'సిగరెట్లు కాలుస్తాను!' అని చెయ్యి గోక్కున్నాడు.

పెద్ద సయిజు సిగరెట్టు ఒకటి ఇచ్చాను.

'తాంక్ యూ సర్!' అని నవ్వాడు. పళ్లు కడుక్కోడు గావును అసహ్యంగా ఉన్నాయి.

పువ్వులు...?

గుల్మార్గ్‌లో పువ్వులు లేవు, పూసే కాలం కాదు. ఖిలాన్‌మార్గ్‌కి వెళ్ళాము. అంటే ఆటస్థలం అన్నమాట. పిల్లలూ పెద్దలూ చక్రాలు లేని స్లెడ్జిలలో కూర్చుని ఉంటే కాశ్మీరీలు వాటిని లాగుతున్నారు. నేను నడవటానికే నిశ్చయించుకున్నాను. కాలికింద మంచు గడ్డలు పెళుసుగా విరుగుతున్నాయి. ఎన్నో కొండ వాగులు. అన్నీ ఎక్కడికి పారుతున్నట్లు? దూరంగా ఒక రాతిమీదకి వెళ్లి కూర్చున్నాను. సూర్యుడు అప్పుడప్పుడు మబ్బు వెనుక నుంచి తొంగి చూసి మాయమవుతున్నాడు. ఇంతలో వాన. మళ్లీ నీరెండ...

సర్దార్జీల గుడారం

ముగ్గురు సర్దార్జీలు గుడారం ఒకటి వేశారు. అరగంటకొకసారి వెళ్లి టీ తాగి చిన్న చిన్న షికార్లు ఎన్నో చేశాను...

శ్రీనగర్‌లో హోటలు గదికి తిరిగి వచ్చేసరికి బాగా రాత్రి అయింది. దారిలో అంబర్ రెస్టారెంట్‌లో ఇడ్లీ తిన్నాను. చెత్త! ఇవా ఇడ్డెనలు! మన దక్షిణాది వారంతా ఇడ్లీ, దోసెల పేరున జరుగుతున్న అన్యాయాలని ఖండిస్తూ ఉద్యమం లేవదియ్యాలి.'

మంగళవారం: రాత్రంతా వాన. నా హోటలు ముందు చిన్న కోనేరు. ఎక్కడికి వెళ్లటం? వళ్లంతా నెప్పులు. రోజంతా చదువుతూ కూర్చున్నాను.



కాశ్మీరు అందకత్తె.

వాన

బుధవారం:— మధ్యాహ్నం దాక వాన ఆగలేదు. తర్వాత నేను టూరిస్టు సెంటర్‌కి వెళ్ళాను. శ్రీనగర్ దాటి వెళ్లలేముట; అన్ని రోడ్లూ చెడిపోయాయుట— అని అక్కడి పెద్దమనిషి ఒకాయన ముఖావంగా చెప్పాడు. ఊళ్లో మాత్రం ఏం తిరుగుతాము? అంతా బురద రోడ్లో నడిస్తే బట్టలన్నీ ఖరాబు అవుతాయి...

'రేపురండి. రోడ్లు బాగా ఉన్నాయో లేదో చెప్తాను.' అన్నాడు ఇందాకటి పెద్దమనిషి. ఎందరో ప్రయాణీకులు గుమిగూడారు. అది దూరదేశం. ఖర్చులకి కావలసిన డబ్బు ఎందరి దగ్గర ఉంది?

ఇండియన్ ఎయిర్‌లయిన్స్ ఆఫీసునిండా జనం. ఢిల్లీ సర్వీస్‌లన్నీ కాన్సెల్ చేశారు. శ్రీనగర్‌నుంచి గంటకింద బయలుదేరిన కారవెల్ విమానం తిరిగి వచ్చేసింది. వాతావరణం అలా ఉంది.

భీమా

'ప్రాణాలని ఇన్సూరు చేసుకున్నాము.' అని ఒక ప్రయాణీకుడు తోటి ప్రయాణీకుడితో చెప్తున్నాడు. అతని భార్య ఇంగ్లీషు అమ్మాయి. కడుపుతున్నట్లుంది. ఏ మాత్రం ఆదుర్దాగా కనిపించలేదు. గలగలమని నవ్వుతోంది—ఒక ముసలి ఇంగ్లీషు మనిషి వేసే ప్రతి జోకుకీ...

వాన కురుస్తూనే ఉంది. శ్రీనగర్‌లో దిగబడిపోతే ఇంకేముంది! కాశ్మీరు చాలు, ఢిల్లీకి తిరిగి వెళ్లిపోవాలి.

గురువారం:— టూరిస్టు సెంటర్‌కి వెళ్లి, ఎంతో కష్టంమీద శుక్రవారం 6-30 బస్సులో సీటు సంపాదించాను (పఠాన్ కోట్‌కి.)


అక్కడ ఒక పెద్దావిడ తెలుగు మాట్లాడుతోంది! ఆవిడది బెంగుళూరు, ఆదివారం కొడుకు, కూతుళ్లతో కాశ్మీరుకి వచ్చింది. వితంతువు. చేతికి బంగారు గాజులు వేసుకుని ఉంది...

కన్నడం తెలుగు

వానలమూలంగా ఏమీ చూడలేక పోయాము, అన్నది అమ్మాయి. హోటలు

(64వ పేజీ చూడండి)

సీరియల్



బ్రతుకుబాట

పి. సత్యవతి

జరిగిన కథ

మాధవరావు, రఘుపతి, సుమిత్ర అన్నపూర్ణమ్మగారి సంతానం. తండ్రి చనిపోవడంతో కుటుంబభారమంతా మాధవరావుమీద పడుతుంది. మాధవరావు భార్య ఇందుమతి కొడుకు విశ్వనాదం సంసారాన్ని ఈదుకుంటూనే తమ్ముడు రఘుపతి, చెల్లెలు సుమిత్ర పెళ్ళిళ్ళు చెయ్యాలని సంబంధాలు చూస్తాడు. కాని, దూరంగా వుండి చదువుకుంటున్న రఘుపతి కులాంతర వివాహం చేసుకుంటున్నట్టు రాస్తాడు దాంతో మాధవరావు కృంగిపోతాడు మాధవరావు లంగికారంతో సుమిత్ర కాలేజీలో చేరుతుంది అక్కడే ఆమెకు కుముదినితో పరిచయమవుతుంది—

3

'బామ్మ కెలా వుందిరా విస్సూ!' అన్నాడు రఘుపతి టాక్సీలోనుంచి దిగి గేటులో అడుగుపెడుతూ, ఆందోళనగా!

'చాలా సీరియస్‌గావుంది బాబాయ్! మొన్నటిదాకా బాగానేవుంది. నిన్నటినుంచీ అసలు స్పృహలేదు వుండీ వుండీ కళ్ళు తెరచి ఇల్లంతా చూస్తుంది అంతే!' అన్నాడు విశ్వనాథం, అతనిచేతిలో సూట్‌కేసు అందుకుని

బాగా తెల్లవారింది. వెచ్చగా ఇంట్లో పడుతోంది ఎండ. ఆత్మీయులమధ్య ఎడబాటు తరవాత కలిగిన అనురాగంవలె

'నిన్న వైర్‌లో సీరియస్‌గా వుందని వ్రాయలేదేం? నేను ఆఫీసుపని వుంటే చూసుకుని తాపీగా బయల్దేరాను—లేకపోతే వెంటనే వచ్చేవాణ్ణి' అన్నాడు రఘుపతి నిష్ఠురంగా—

'అదేమో నాకు తెలీదు బాబాయ్—అన్నట్లు పిన్నేది?' అని కారువైపు తిరిగాడు విశ్వనాథం.

'ఆవిడను స్నేహితురాలింట్లో దింపి వచ్చాను — తరువాత తీసుకొస్తానులే— పద — లోపలికి—'వరండా మెట్లుఎక్కి ఆగిపోయాడు రఘుపతి

'రావోయ్ మరిదీ—ఆగిపోయావేం—లోపలికిరా! మా చెల్లెలేదీ!' అన్నది ఇందుమతి లతని కెదురుగావచ్చి. ఆమెవెనకే మాధవరావూ, సుమిత్రాకూడా వచ్చారు పడక కుర్చీ దులిపి, అందులో ఒక దిండు వేసి, 'కూర్చో అన్నయ్యా!' అన్నది సుమిత్ర.

'అమ్మ ఎక్కడ పడుకుంది!' అన్నాడు రఘుపతి కూర్చోకుండా లోపలికి దారి తీస్తూ—

'దక్షిణంవైపు గదిలో! పద వెడదాం! చిన్నవదిన్ని తీసుకు రాలేదేం!' అన్నది సుమిత్ర, అతని వెనకే నడుస్తూ—

'ఇక్కడ ఆవిడకెలాంటి స్వాగతం లభిస్తుందో ననే సంశయంతో, స్నేహితురాలి యింట దిగబెట్టి వచ్చాను — మీరంతా తీసుకురమ్మంటే తీసుకుని వస్తాను—' అన్నాడు రఘుపతి, మాధవరావు మొహంలోకి చూస్తూ!

'నీ అంత అభ్యుదయవాదులం కాలేకపోయినా, మాకూ కొంత పూర్వజన్మ సంస్కారం వుంది రఘూ! ఇంట కాలు పెట్టిన నవవధువును అవమానించేటంత వాళ్ళంకాదు —' అన్నాడు మాధవరావు తలఎత్తి తమ్ముణ్ణిచూసి.

'సంస్కారాలూ, అభ్యుదయాల మాట అలావుంచు అన్నయ్యా! అమ్మ ఏమంటుందో! ఆవిడ ఉద్దేశ్యం అడగాలికదా!' అన్నాడు రఘుపతి తల్లి మంచందగ్గరగా కుర్చీ వేసుకుని కూర్చుని

ఆవిడ కళ్ళు మూసుకుని పడుకుని స్పృహ వున్నదా, లేదా అన్నట్లు వుంది.

'అమ్మ నీకోసం, వదినెకోసం కలవరించింది అన్నయ్యా! మొన్న రాత్రి నీకు టెలిగ్రాం యిప్పించమని చెప్పింది. అంతే. నిన్న అసలు స్పృహ పోయింది అప్పటిదాకా మాట్లాడుతూనే వుంది. మొన్నటివరకూ నిన్ను చూడాలనే కోరిక మనస్సులోనే దాచుకుని కృంగిపోయింది. మొన్న మాత్రం ధైర్యంగా చెప్పింది, నిన్ను చూడాలని-ఆవిడ తన పొరపాటు గ్రహించుకున్నది—' అన్నది సుమిత్ర, తల్లిని తట్టిలేపుతూ—

'మాడమ్మా! చిన్నన్నయ్య!' అన్నది మళ్ళీ

ఆవిడకళ్ళు తెరిచిచూసి మళ్ళీ మూసుకున్నది తరువాత ఎంత పిలిచినా పలుకనే లేదు

'వెళ్ళి వదిన్ని తీసుకురా అన్నయ్యా! అమ్మఇంకా ఎంతసేపు వుంటుందో చెప్పలేం కోడల్ని చూసిన తృప్తి ఆవిడకి దక్కనీ! కాఫీత్రాగి వెంటనే వెళ్ళు—' అని హెచ్చరించింది సుమిత్ర

'పరిస్థితి ఇంత తీవ్రంగా వుంటుందని అనుకోలేకపోయాను సుమిత్రా! మీరంతా నన్ను యింతమాత్రం ఆదరిస్తారనే ఆలోచనవుంటే ఎప్పుడో వచ్చివుండేవాణ్ణి. ఆవిడని నావెంట తీసుకెళ్ళేవాణ్ణి—'

'జరిగిపోయినవాన్ని గురించి తర్కించే టైం యిప్పుడు లేదు—వెంటనే వెళ్ళి వదిన్ని తీసుకురా! లేకపోతే ఆవిడ స్నేహితురాలి యిల్లెక్కడో చెప్పు నేను వెళ్ళి తీసుకొస్తాను—ఈ లోపల నువ్వు కొంచెం

బడలిక తీర్చుకో!' అన్నది సుమిత్ర, దువ్వెన తెచ్చుకుని జడ అల్లుకుంటూ!

'అదే మంచిది! ఇప్పుడు డాక్టర్‌గారు వస్తారు—ఏమంటారో, ఏమో! నువ్వు వుండు రఘూ, సుమిత్రవెళ్ళి మరదల్ని తీసుకొస్తుంది' అన్నాడు మాధవరావు—

'వాళ్ళ ఇల్లు గాంధీనగరంలో, ఈ ఎడ్రెస్ కార్డు తీసుకునివెడితే తేలిగ్గా కనుక్కోవచ్చు. వెళ్ళిరా, సుమీ! నేను అమ్మదగ్గర కూర్చుంటాను—'అన్నాడు రఘుపతి.

విశ్వాన్ని తీసుకుని వెళ్ళింది సుమిత్ర. ఇంటినీ, వ్యక్తినీ గుర్తుపట్టడం కష్టం కాలేదు. తనకన్న కొంచెం పొడగరి, ఛాయా కొంచెం ఎక్కువే. సంస్కారం వుట్టిపడే ముఖం,ఆభరణాలు చాలావున్నా, వాటన్నిటి కన్నా చిరునవ్వే ఎక్కువగా ప్రకాశిస్తోంది.

'మీరంతా రఘుపోలికే — చూడగానే ఆయన చెల్లెలను కున్నాను—' అన్నది రాధ రిక్షా ఎక్కుతూ—

'అమ్మకేమీ బాగాలేదు— మూడురోజుల నుంచీ మృత్యువుకోసం ఎదురు చూస్తూ అలసిపోయింది. మీరు కనపడితే ప్రశాంతంగా కన్ను మూస్తుంది —' అన్నది సుమిత్ర, ఎటో చూస్తూ—

'ఆమెకింత జబ్బు చేసిందని నేను అనుకోలేదు — పాపం! వృద్ధాప్యంలో దిగుళ్ళు మనిషిని కృంగదీస్తాయి —' అన్నది రాధ. ఆ సానుభూతిలోగల నిజాయితీని శంకించలేక పోయింది సుమిత్ర.

'చిన్నన్నయ్యకి తగిన అమ్మాయి' అని మనస్సులోనే సర్టిఫికెట్ యిచ్చేసింది.

ఇహలోక సంబంధాలన్నీ తెగిపోతూ వుండగా కట్ట కడవటిసారిగా, బంధుజనాన్ని చూడాలన్నట్లు కళ్ళు తెరచి, చిన్నకోడల్ని చూసిన అన్నపూర్ణమ్మగారు మరి ఆ కళ్ళు తెరవనేలేదు — ఆవిడ కోర్కె తీరింది.

'ఈ దురదృష్టమంతా మనిద్దరిదే చిన్నన్నయ్యా!' అంటూ బావురుమంది సుమిత్ర.


మనస్సులో మెదిలే ఆలోచనలు, సంతోషాలూ, దుఃఖాలూ అన్నీ చెప్పుకుని వుపశాంతి పొందడానికి ప్రతివ్యక్తికీ నమ్మదగ్గ స్నేహితురాలు ఒకరుండాలి. అలాంటి స్నేహితురాలుగా అమ్మ యిన్నాళ్ళూ తనని చూసింది. ఈ ఒక్క ఏడాదిలో తామిద్దరి మధ్యా దూరం పెరిగినా, ఆమెతో తానేనాడూ కలహం పెట్టుకోలేదు. చెప్పదలచుకున్న దేదో సూటిగా, నెమ్మదిగా చెప్పేది తను. ఆ గదిలో మంచంమీద పడుకునివున్నా ఎంతో తోడుగా, నీడగావుండేది ఆవిడ.

వృద్ధులు మరణించడం సహజమేనని సరిపెట్టుకోలేక పోతోంది. దానికి కారణం ఆవిడ అమ్మ కనుక!

'ఎన్ని శుభాలు జరిగినా కలుసుకోలేని వ్యక్తులు, ఒక్క విషాద సంఘటన జరిగితే ఏకమౌతారని విన్నాను — మనపట్ల అదే ఋజువైంది' అన్నాడు రఘుపతి.

మాధవరావుకి ఏమీ వినడానికీ, అనడానికీ తీరలేదు. తల్లి అంతిమయాత్రకి ఏర్పాట్లు చేయడంలో మునిగిపోయాడతను —

'మరేం అనుకోకు అన్నయ్యా! ఈ డబ్బు నీదగ్గర వుంచు —' అంటూ పర్సు అన్నగారిచేతి కిచ్చాడు రఘుపతి.



అన్నపూర్ణమ్మగారి మరణవార్త తెలిసి ఊళ్లోగల చుట్టాలూ, స్నేహితులూ, పరిచయస్థులూ వచ్చారు. సాయంత్రం రాత్రి చాటుకు తప్పుకోబోతూన్నా విమల రాలేదు. అప్పుడే రెండుసార్లు ట్రంక్‌కాల్ చేశాడు మాధవరావు.

'ఆవిడ మనయింటికివచ్చి పదేళ్లు కావచ్చింది. ఇప్పుడు తల్లిని చూసుకోలేక పోతే చాలా కష్టపడుతుంది— కాబట్టి తెల్లవారేవరకూ వుంచడమే మంచిది— ఒక్కరోజుకి మనం అన్నాలు తినకపోతే ఫరవాలేదు'—అన్నది ఇందుమతి...

'పోనీ ఎవర్నైనా పంపకూడదూ? విమలక్కకోసం!' అన్నది సుమిత్ర. కొంచెం సేపు ఆలోచించి దూరపు బంధువు ఒకాయన్ని పంపించాడు మాధవరావు.

అన్నపూర్ణమ్మగారి అంతిమయాత్ర ఆ రాత్రికి ఆగిపోయింది. వరండాలో గడ్డి మీద పడుకోబెట్టారు ఆవిడను. తలదగ్గర దీపం పెట్టి అక్కడే చాప వేసుకుని కూర్చుంది ఇందుమతి. అవతలి గదిలో భయంగా నిద్రపోయారు పిల్లలు.

మిగిలిన బంధువులు తాపీగా వ్యాఖ్యానాలు మొదలుపెట్టారు.

కులభ్రష్టులకు కర్మచేసే హక్కు లేదని తీర్మానించారు కొందరు.

'పేరుకు కులంలో ఒకమ్మాయిని భార్యగా తెచ్చుకుని, అనేకమందితో, అనేక కులాల యువతులతో అక్రమ సంబంధాలు

బ్రతుకు బాట

నెరపిన పెద్దలందరికీ కర్మలూ, నోములూ చేసే అర్హతలు వుంటాయి. కానీ నమ్మిన ఆడదాన్ని పెళ్ళిచేసుకున్న వాడికి ఆ అర్హతపోతుంది కాబోలు! ఇదే న్యాయమైతే కర్మచెయ్యాలనే కోర్కె నాకేంలేదు లెండి. నాకు వాటిలో నమ్మకమూ లేదు— నేను పరాయివాడిలాగే వుండిపోతాను—' అన్నాడు రఘుపతి.

తెల్లవారుతూనే ఇందుమతి తల్లి వూడిపడింది తుఫానులాగ. వస్తూనే వియ్యపురాలిదగ్గర కూర్చుని పెద్దగా కాసేపు ఏడ్చేసి, ఆపైన రఘుపతిని తిట్టడం సాగించింది. వాళ్ళని ఇంట్లో తిరగనిస్తూన్న ఇందుమతి అనాచారాన్ని అసహ్యించుకున్నది.

దహనక్రియలు కాగానే మధ్యాహ్నం భోజనాలదగ్గర ఆవిడ లేవదీసిన తుఫానుకు రాధ కంటతడి పెట్టడం చూసింది ఇందుమతి.

'మీ అమ్మకి మరీ అంత తొందరేమిటి!' అని విసుక్కున్నాడు మాధవరావు.

'పెట్టె సర్దుకో రాధా! మనం వచ్చిన పని ఐపోయింది. వెడదాం' అన్నాడు రఘుపతి.

'మాడన్నయ్యా! మనం చదువుకున్నవాళ్లం— ఆవిడ అజ్ఞానంతో ఏదో అంటున్నదని రోషం తెచ్చుకోకూడదు— ఈ పది రోజులూ మీరు ఇక్కడ వుండాలి— మనం ముగ్గురం ఈ గదిలో వుందాం— మీ ఇద్దరికీ నేను భోజనం తెచ్చి ఇక్కడ పెడతాను— ఆవిడ వెళ్ళేదాకా ఎలాగో సర్దుకుపోదాం— లేకపోతే వదిన బాధపడుతుంది—' అని బతిమిలాడింది సుమిత్ర.

ఆ సాయంత్రం భర్త పిల్లలతో బండి దిగిన విమల మరో తుఫాను లేవదీసింది, తల్లిని యింకా అప్పటివరకూ కూడా వుంచినందుకు... 'మనం మనం సాధించుకోడానికీ, తిట్టిపోసుకోడానికి అవతలం చాలా టైంవుంది అక్కయ్యా— ఇలాంటి సమయంలో దుఃఖాన్ని అందరం పంచుకోవాలి కాని— మనస్సులు విరగ్గొట్టుకో కూడదు— పద! స్నానంచేసి పిల్లలకి అన్నంపెట్టు— తీరిగ్గా మాట్లాడుకుందాం—' అని అక్క భుజంమీద చెయ్యివేసి లోపలికి పంపించింది సుమిత్ర.

'ఏమో అనుకున్నాను— నువ్వు చాలా పెద్దదానివయ్యావు—' అని గొణిగింది విమల.

'మీ ఇంట్లో నన్ను దింపావుగా! ఇక పోతున్నాను—' అంటూ ఎంత చెప్పినా వినకుండా రిక్షా ఎక్కిపోయాడు విమల భర్త సత్యానందం.

'మనలోమనకే లేని సఖ్యత పరాయివాడి కెందుకుంటుంది — వెళ్ళనీ!' అన్నాడు రఘుపతి విసుగ్గా!

'వెళ్ళమనక వుండమని మీరు అంటారనుకున్నానా ఏమిటీ! ఆడపిల్లల బెడద వదిలించుకోడమే మీ సంప్రదాయం!' అంటూ తమ్ముడి వేదుటికివచ్చింది విమల!


'మా సంప్రదాయం ఏదైతే నీదీ అదే అవుతుంది!! నువ్వేం పరాయిదానివా ఏమిటి!' అన్నాడు రఘుపతి.


'రా! అక్కయ్యా! లోపలికి— 'అంటూ చెయ్యి పుచ్చుకుని లోపలికి తీసుకుపోయింది సుమిత్ర విమలను.

*　　　*　　　*

బంధువులందరూ వెళ్ళిపోయాక, ఆ సాయంత్రం అన్నపూర్ణమ్మగారి ఫోటో గోడకి తగిలిస్తూ 'ఇంకా అమ్మయిక్కడ పడుకున్నట్లేవుంది,' అన్నాడు మాధవరావు—

'అమ్మఎక్కడ పడుకునేదో ఏమో! నాకేం తెలను! అమ్మకి నాకూ పదేళ్ల నాడే ఋణం తీరిపోయింది' అన్నది విమల





సర్వ తోముఖ సౌందర్యపోషణి-

ఏవేళనైనా...

ఎచ్చటనైనా...

...క్రూక్స్ లేక్టో కేలమీన్ వల్ల, విచ్ హేజెల్ మరియు కేలమీన్, లేక్టో కేలమీన్‌లో కూడియున్నవి. అవి మురికి నిర్మూలనంగాను చర్మ పోషణకారిగాను చర్మ జరుపునట్లు చేస్తాయి. లేక్టో కేలమీన్ అమితంగానున్న నూనెలను నిర్మూలించి నల్ల పొక్కులు, మొటిమెలు మచ్చలు కలుగకుండా నిరోధించుతుంది.

అయితే క్రూక్స్ లేక్టో-కేలమీన్ ఇంకా చాలా ఎక్కువ గుణకారి మీ చర్మానికి సౌమ్య పోషణకారి శుభ్రపరుస్తుంది, చెమ్మగిల చేస్తుంది, నునుపుగాను, మృదువుగాను వుంచుటుంది ఇంకా విశేషమేమనగా, అది పగటివేళ రాత్రివేళ, మరి యేవేళనైనా శృంగారకారిగా ఉపయుక్తం .. పౌడరు చల్లుకొనుటకు దివ్యమైన ఆధారంగా వుంటుందికూడా

మీరు క్రూక్స్ లేక్టో కేలమీన్ వాడు నప్పుడు మరే ఇతర శృంగార సాధన అక్కర్లేదు.

క్రూక్స్ లాక్టో-కేలమైన్

కళంక రహితమైన సౌందర్యముకొరకు



క్రూక్స్ ఇంటర్‌ఫ్రాన్ లిమిటెడ్,
బొంబాయి-25.

CIL 10 TEL

ఇప్పుడు చిన్న సైజులో కూడా లభిస్తున్నది

బ్రతుకు బాట

వెంటనే.

'కొంతమందికి సూటిగా మాట్లాడే అలవాటు వుండదు. ప్రతిదానికీ సాధిస్తూ వుంటారు—' అన్నది సుమిత్ర.

'నేనేం నీలాగా చదువుకున్నానా సూటిగా, షోకుగా మాట్లాడడానికి! నాకు చదువులేకుండా చేసి పెళ్ళిచేసి అవతలకి పంపించి చేతులు దులుపుకున్నారు — పదేళ్ళయింది- ఓ పురుడూ లేదు— పుణ్యమూ లేదు – చీరేలేదు సారేలేదు—' అక్కసుగా అన్నది విమల.

'దీనికంతకీ కారణం నువ్వేనేమో !' అన్నది సుమిత్ర.

'మేం రేపు వెళ్ళాలనుకుంటున్నాం అన్నయ్యా!' అన్నాడు రఘుపతి ప్రక్క గదిలోనుంచీ వస్తూ. అప్పుడే—

'అదేమిటి మరిదీ! పరాయివాళ్ళల్లాగా నువ్వుకూడా అప్పుడే వెళ్ళడం ఏమిటి! పదిరోజాలుండకూడదా ! అమ్మ వెళ్ళిపోయింది కదా ! ఇక మనలో మనకి పట్టింపులేమిటి !' అన్నది ఇందుమతి నిష్ఠురంగా—

'ఆఫీసులో పనులున్నాయి వదినా! పిల్లల పరీక్షలవగానే మీరు రండి అక్కడికి !' అన్నాడు రఘుపతి సౌమ్యంగా.

'అవును— తగుదునమ్మా అని మీరు వెళ్ళండి అక్కడికి!' అన్నది విమల.

రఘుపతి తెల్లబోతూ, 'ఏం, ఎందుకు రాకూడదక్కయ్యా! నేను నిన్ను కూడా పిలవాలనుకున్నాను!' అన్నాడు.


'మేము రావాలనుకున్నవాడివైతే ఈ పెళ్ళెందుకు చేసుకుంటావ్ ! ఏవో మాట పట్టింపులొచ్చి అన్నయ్య పిలవడం చాలించుకున్నాడు. నువ్వయినా యింత పసుపు కుంకుమ పెడతావనుకుంటే ఇలా చేశావు— ఇంక నాకెవరున్నారు! తిట్టినా, కొట్టినా ఆయనే కదా ! ఈ పదేళ్ళుగా నేను పడ్డపాట్లు పరమాత్ముడికెరుక!' కళ్ళనీళ్ళు తుడుచుకుంది విమల.

'మన తప్పులు కూడా ఎదుటివాడి నెత్తిన రుద్దడం మంచిది కాదమ్మడూ ! మాటపట్టింపు లెందుకొచ్చాయో ఇక్కడ అందరికీ తెలుసు., మీ ఆయనకే తొందర అనుకుంటే ఆయన్ని మించిపోయావు నువ్వు ! ఉన్నంతలో నీకు జరిగినంత గారాబం సుమిత్రకేం జరిగింది పాపం ! తృప్తిలేనివాళ్ళు సుఖపడలేరు !' అన్నాడు మాధవరావు.

'అల్లుడన్న తరవాత అత్తవారింట మర్యాదలు జరగాలనీ, కట్నాలూ కానుకలూ పొందాలనీ ప్రతివాడికీ వుంటుంది— ఎన్నేళ్ళొచ్చినా అల్లుడు, అల్లుడే !' అన్నది విమల.

'అల్లుడు అల్లుడు కాదని ఎలా అంటాం! కానీ ప్రతిదానికీ ఓ హద్దంటూ వుంటుంది. అది ఎవరికి వారు గ్రహించుకోవాలి! నా పెళ్ళైన కొత్తలో నా భార్యకి నేను ఏ ముచ్చటా తీర్చలేక పోయాను. కానీ నిన్ను ప్రతి పండక్కీ తీసుకొచ్చాను. బట్టలు పెట్టాను. నాలుగు పురుళ్ళు నీకు అమ్మ పోసింది. నువ్వు వచ్చి వెళ్ళినప్పుడల్లా నేను చేసిన అప్పులు తీర్చడానికి ఎంత అవస్థ పడేవాడినో ఎవరూ గ్రహించలేరు. ఐదో పురుడుకి ఆహ్వానించలేదని అలగడం ఎంత సమంజసమో, రోజులెంత గడ్డుగా వున్నాయో, మా పరిస్థితులెలా వున్నాయో ఆలోచించలేని నీ మూర్ఖత్వాన్ని ఏమనాలి! పుట్టింటి వాళ్ళంటే పెట్టే వాళ్ళేననే మనస్తత్వం వుండకూడదు అమ్మడూ! నువ్వూ పెద్దదానివయ్యావ్! ఏడుగురు పిల్లల తల్లివి — రేపు నీకూ అల్లుళ్ళు వస్తారు! హృదయం కాస్త విశాలం చేసుకో!' అన్నాడు మాధవరావు సిగరెట్టుబూడిద దులుపుకుంటూ గంభీరంగా—

'అందుకేగా పదేళ్ళ నుంచీ రావడమే మానుకున్నాను—చెల్లెళ్ళి చదివించడానికి వందలకి వందలు వుంటాయి గానీ, నన్ను



....మీకోసమని...రెండు కోళ్ళ గుడ్లు.. బయట..
..ఎండలో పెట్టాను.. అలా వెళ్ళి చూస్తే.....
...ఇంకేముంది... చక్కగా రెండు కోడి పిల్లలు..
... అయి వున్నాయి......

పిడాదికో సారి పిలిచి చీరె పెట్టడానికుండవు కాబోలు!' ముక్కు చీదుతూ లేచింది విమల.

విమల పెద్దకొడుకు కృష్ణమూర్తి విశ్వం ఈడువాడు, విశ్వంతో మాట్లాడుతూ వరండాలో కూర్చున్నవాడు లేచి వచ్చి, 'ఏమిటమ్మా గొడవ! అందుకే నీ వెంట నేను రానన్నాను—' అన్నాడు.

'నాదంతా గొడవే నాయనా!' అన్నది విమల.

'అక్కయ్యా! నేను చిన్నన్నయ్య సాయంతో చదువుకుంటున్నాను. అదీ పెళ్ళి కుదరక చదువుకుంటున్నాను. చీరెలు కావాలంటే నీకు అన్నయ్యలు పెట్టనన్నారా! వాళ్ళు పెట్టేవి నీకు చాలవుగాని!' అన్నది సుమిత్ర.

'అందరూ నన్నే అనండి ! చదువూ సంధ్యా లేనిదాన్ని ఎవరైనా అంటారు!'

'ఊరుకో వదినా! అవతల రాధ వింటే బావుండదు— పద కాఫీ త్రాగుదువుగాని!' అన్నది ఇందుమతి.

'ఏం ఆవిడ అంత గొప్పమనిషా!' అంటూ లేచిపోయింది విమల.

'ప్చ్! దీనికి చెప్పగలవాళ్ళు ఈ భూమి మీదే లేరు !' అని నిట్టూర్చాడు రఘుపతి.

కొంచెంసేపు అయ్యాక,' 'సుమిత్రా ! పరీక్షలు కాగానే నువ్వు అక్కడికి రాకూడదూ!' అన్నాడు చెల్లెల్ని చూసి.

'అలాగే వస్తాంలే అన్నయ్యా!పిల్లలూ, నేనూ !'

'అది కాదమ్మాయ్ ! అక్కడ కాలేజీలో చేరకూడదా అని!'

'అత్తగారు వెళ్ళనే వెళ్ళారు ! మాకు తోడుగా ఆ అమ్మాయినైనా వుండనియ్యవయ్యా! ఆ అమ్మాయి పిల్లలకి బాగా అలవాటు—బెంగపెట్టుకుంటారు!' అన్నది ఇందుమతి.

సుమిత్ర వెనక నిలబడి పమిటకొంగు మెలిపెడుతున్న చిట్టి, 'అవును చిన్నత్త మాకు కావాలి' అన్నది.

'మీరే వుంచుకోండి!' అని నవ్వింది సుమిత్ర.

'నువ్వు చాలా మంచిదానివి సుమిత్రా ! నీలాంటి వ్యక్తిని నేనెక్కడా చూడలేదు—నువ్వు తప్పకుండా మాదగ్గరకు రావాలి!' అన్నది రాధ సుమిత్ర చెయ్యిపట్టుకుని.

నిర్వహించలేని అశక్తతయుత యిద్దరి హృదయాలలోనూ వెల్లివిరిసింది.

'తప్పకుండా వస్తానువదినా! నీ కిక్కడ జరిగిన అవమానాలన్నింటినీ మరిచిపో! ఇందు వదినె చాలా మంచిది నీలాగా! ఆమె కూడా వాళ్ళమ్మ ప్రవర్తనకి నొచ్చుకున్నది' అన్నది సుమిత్ర.

'అవును—నాకు తెలుసు! ఇలాంటివన్నీ జరుగుతాయని ముందే ఊహించాను—మన జీవితాన్ని మనకి మనంగా తీర్చి దిద్దుకోవాలన్నప్పుడు యిలాంటివన్నీ ఎదుర్కోనక తప్పదు—' అన్నది రాధ.

'అవును వదినా!' అన్నది సుమిత్ర. ఏదో చెప్పాలనే ఉద్వేగం వున్నది. కానీ మాటలు పెగలడం లేదు.

కళ్ళ నిండా నీళ్ళు తిరిగాయి.

'వెడతాం సుమీ! ఉత్తరాలు వ్రాస్తుండు! అంటూ రిక్షా ఎక్కాడు రఘుపతి. తను చాలా మనసు పడి కొనుక్కున్న దంతపు బొమ్మ ఒకటి రాధ కిచ్చి 'నా జ్ఞాపకంగా యిది వుంచుకో వదినా! ఇంతకన్న నీకు నేనేం యివ్వలేను!' అన్నది సుమిత్ర.

రిక్షా కదిలి కనుమరుగైపోయింది.

బారెడు ఎండ ఇంట్లోకే వచ్చేసింది అప్పుడే. ఇందుమతి ఇంటిపనుల్లో లీనమైపోయింది. వాలు కుర్చీకి చేరబడి ఆలోచనల్లో మునిగిపోయాడు మాధవరావు—

ప్రక్కనే వున్న స్టూల్‌మీద కూలబడింది సుమిత్ర.

'నీ ప్రియమైన అన్నా, వదినే వెళ్ళారా?' అంటూ చేతిలో దువ్వెనతో ప్రవేశించింది విమల.

'వయస్సుతో పాటు మనస్సు ఎదగక పోతే లాభం లేదక్కా! ఈ సారి నీతో చాలా మాట్లాడాలని వుంది నాకు!' అన్నది సుమిత్ర కటువుగా.

'దానికేం! మాట్లాడూ! మాటలకేం డబ్బా! ఏమన్నానా?' అన్నది విమల, కూతురికి జడ అల్లుతూ.

మాధవరావు లేచి పోయాడు.

'నువ్వూ, నీ పిల్లలూ, డబ్బు చాలక యిబ్బంది పడుతున్న మాట నిజమే! కాదని ఎవరంటారు! నీలాగే అన్నయ్యా చాలా ఇబ్బంది పడుతున్నాడు: వదినె తెలివి గలది కనుక సంసారం ఎలాగో నెట్టుకొస్తోంది. అలాగే నువ్వూ నీ యింటిని పొదుపుగా దిద్దుకో కూడదూ? ఎవరో పెట్టలేదనే కంటే!'

'గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందట. పొదుపు పాఠాలు నాకు నువ్వు నేర్పుతావుటే!' అని కళ్ళెర్ర చేసింది విమల.

'అత్తయ్యా నాకీ పాఠం చెప్పావూ!' అని వచ్చిన సావిత్రిని తీసుకుని డాబా మీదకు వెళ్ళిపోయింది సుమిత్ర విసుగ్గా.

ఆ మర్నాడు విమల వెళ్ళిపోయింది. సుమిత్ర పెట్టెంతా తనిఖీ చేసి రెండు, మూడు మంచి చీరెలు తీసిపెట్టుకుని, 'ఇలాంటి చీరెలంటే నాకు చాలా యిష్టం—మీ బావ తేరు సుమిత్రా, నువ్వు ఎల్లాగా కొనుక్కుంటావు—' అన్నది.

'తీసుకు పో! అక్కయ్యా! చీరెలకేం! అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాయి. నీ పుట్టింటి పరిస్థితులు మీ ఆయనతో చెప్పి ఆయనకు మనమీద కోపం తగ్గేలాగు చెయ్యాలిగానీ, ఆయనతో కలిసి నువ్వూ అలిగి కూర్చోడం బావుండదు! బాగా ఆలోచించు—' అని సలహా చెప్పి పంపింది సుమిత్ర.

పరీక్షలు బాగా దగ్గర కొచ్చేశాయి. ఈ పదిహేను రోజులుగా పుస్తకం ముట్టడానికే పడలేదు. తన భవిష్యత్తంతా చదువుమీదనే ఆధారపడివున్నదని తనకు తెలిసీ, అశ్రద్ధ చెయ్యకూడదు.

అలమారంతా ఒక్కమాటు సర్దుకుని చదువుకోడానికి టైంటేబిల్ తయారు చేసుకుంది సుమిత్ర.

ఇంట్లో అమ్మ లేకపోవడం పెద్ద లోటుగా వున్నా అది అలవాటైపోయింది క్రమంగా. సావిత్రీ, విశ్వంకూడా శ్రద్ధగా చదువుకుంటున్నారు, తనతోపాటే.

(ఇంకా ఉంది)



బాలపక్షవాత నివారణకి
కూనూరులో పోలియో వాక్సిన్ ఉత్పత్తి

ఇండియాలో పసిబిడ్డలకు ఇక బాలపక్షవాతం భయం ఉండక పోవచ్చు. కూనూరులోని పాశ్చర్ ఇన్‌స్టిట్యూటులో ఇందుకు సఫల పరిశోధనలు జరుగుతున్నాయి.

తూర్పుదేశాలలో క్రిమి పరిశోధన కృషి చేస్తున్న అత్యద్భుత సంస్థలలో ఈ కూనూరు ఇన్‌స్టిట్యూటు ఒకటి. ఆసియాలో సజీవ పోలియో వైరస్ టీకా మందు తయారు చేస్తున్న తొలి సంస్థ ఇది. ఈ టీకా మందును శబిన్‌వాక్సిన్ అంటారు. ఈ మందు కనిపెట్టిన డాక్టర్ ఆల్బర్ట్ బి. శబిన్ ఈ మందు తయారీకి కూనూరులో గల సదుపాయాల దృష్ట్యా ఈ చోటును ఎంచుకొన్నారు.

భారతప్రభుత్వ ధన సహాయంతో నిర్వహింపబడుతున్న ఈ పథకానికి అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సహాయసంస్థ (యు. ఎస్. ఏ.ఐ. డి.) ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు. హెచ్. ఒ.)ల నుంచి కూడా సహాయం లభించింది.

ప్రత్యేక పరికరాల కొనుగోలుకుగాను అమెరికా సహాయసంస్థ విదేశ మారక ద్రవ్య రూపంలో 75,000 డాలర్లు, స్థానిక సాధన సామగ్రి సేకరణకుగాను పి. ఎల్. 480 నిధుల నుంచి 3 కోట్ల 57 లక్షల రూపాయలు గ్రాంటు ఇచ్చింది.

బాలపక్షవాతానికి వైద్యశాస్త్రంలో 'పోలియో మైలిటిస్' అంటారు. పోలియో మైలిటిస్ జాతి సూక్ష్మ క్రిముల కారణంగా ఈ వ్యాధి వస్తుంది. ఈ సూక్ష్మక్రిములు పసిబిడ్డలకు సులభంగా సోకుతాయి. అయితే ఈ క్రిములు సోకిన వారందరికీ ఈ వ్యాధి రాదు. వందమంది నుంచి వెయ్యి మంది దాకా పసి బిడ్డలకు ఈ క్రిములు సోకినట్లయితే వారిలో ఏ ఒక్కరికో మాత్రమే వ్యాధి వస్తుందని అంచనా వేశారు. ఈ వ్యాధి పిల్లల్ని చంపటం కంటె అవిటి వాళ్లను చేస్తుంది. ఇండియాలో పోలియో వ్యాధికి లోను కాగల పసి పిల్లలు అయిదు కోట్ల మంది దాకా ఉన్నట్లు అంచనా.

ఉష్ణదేశాలలో ఈ వ్యాధి చెదురుమదురుగా వస్తుంటుంది. సాధారణంగా అయిదేళ్ల లోపు పిల్లలకే వస్తుంది. పోలియో వ్యాధి సోకిన పిల్లలలో సగం మంది మూడేళ్లలోపు వయసు గలవారు. తొంభై శాతం మంది అయిదేళ్లలోపు వయసు గలవారు.

బాల పక్షవాతానికి తొలిసారిగా ఫలప్రదంగా ఉపయోగించిన మందును 1954లో సాల్క్ తయారు చేశారు. ఆ వాక్సిన్‌లో చలన రహితమైన పోలియో మైలిటిస్ క్రిములుంటాయి. ఇంజక్షన్‌తో ఈ మందు ఎక్కిస్తారు. ఎనిమిది, పది మాసాల పాటు కొన్ని మోతాదుల మందు ఎక్కించాలి. మందు శరీరం అంతా బాగా వ్యాపించాలంటే బూస్టర్ ఇంజక్షన్ ఇవ్వాలి.

తగినంతగా వైద్య సదుపాయాలు గల కొన్ని దేశాలలో ఈ టీకా మందు ఉపయోగం ఆశించినంతగా లేకపోయింది. ఎక్కువ మోతాదులు ఇంజక్షన్ల ద్వారా తీసుకోటానికి ప్రజలు అంగీకరించటం లేదు. కనుక వాక్సిన్ ఇండియాకు తగినది కాదని భావించటం జరిగింది.

నోటి ద్వారా సేవించే సజీవ పోలియో వాక్సిన్ మందును 1958 నుంచి రోగులకు వాడి పరీక్షించారు. మంచి ఫలితాల నిస్తున్నట్లు కనిపెట్టారు. డాక్టర్ శబిన్ తయారు చేసిన పోలియో మైలిటిస్ సజీవ క్రిమి జాతులు ఈ వాక్సిన్‌లో ఉంటాయి. ఈ మందును నాల్గు లేక ఆరు వారాల కొకసారి రెండు మూడు మోతాదులు మింగిస్తారు. ఎనిమిది నుంచి పన్నెండు వారాలలో ఈ మందు వంటెని బాగా పడుతుంది. ఈ మందు ఒకసారి వంట పట్టినట్లయితే ఇక పోలియో వ్యాధి రాదు. అంత్ర మార్గంలో ఈ మందు బాగా వ్యాపించి వ్యాధి నిరోధ శక్తిగా పని చేస్తున్నందువల్ల వ్యాధి మళ్లీ రాదు. ఈ మందులో నోటితో సేవించే సదుపాయం మాత్రమే గాక దీన్ని కావలసినంత ప్రమాణాలలో చౌకగా ఉత్పత్తి చేయటానికి అవకాశమున్నది. ఇండియాలో ఈ మందు బాగా ఉపయోగపడుతుంది.


ఇలాంటి ఉపయోగాల దృష్ట్యా కూనూరు పాశ్చర్ ఇన్‌స్టిట్యూటు సజీవ పోలియో మైలిటిస్ వాక్సిన్ ఉత్పత్తిని చేయటానికి భారతప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది.

ప్రభుత్వం ఈ పథకాన్ని అమోదించి లేబరేటరీల నిర్మాణానికి పరికరాలు సమకూర్చుకోటానికి నిధులు సమకూర్చింది. ఢిల్లీలోని యు. ఎస్. ఏ. ఐ. డి. కార్యాలయం ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ పథకానికి మంచి సహాయం అందజేశాయి.

ఈ వాక్సిన్ తయారీకి అవసరమైన పోలియో క్రిమి జాతులను డాక్టర్ శబిన్ సరఫరా చేశారు. 1963 లో వాక్సిన్ ఉత్పత్తి ప్రారంభమైంది.

ఈ మందు తయారీకి ఉపయోగించే మూడు రకాల పోలియో క్రిమి గ్రుడ్లను ఇన్‌స్టిట్యూటులో పరీక్షించటం 1966 నాటికి పూర్తయింది. వీటిని ప్రపంచ ఆరోగ్య సంస్థ సహా

నీకు రోజు రోజుకీ మతిమరుపు ఎక్కువవుతోందిరా!



యంతో లండన్‌లోని మెడికల్ రీసెర్చి కౌన్సిల్ లేబరేటరీలలో తిరిగి పరీక్షించటం జరిగింది. ఈ పరీక్షలలో ఇవి వాక్సిన్ తయారీకి పనికి వస్తాయని తేలింది.

వాక్సిన్ అసలు ఉత్పత్తి 1967లో ప్రారంభమైంది. అప్పటినుంచి 30 లక్షల మోతాదుల మందు ఉత్పత్తి అయింది.

గత సెప్టెంబరులో పాస్చర్ ఇన్‌స్టిట్యూట్ వజ్రోత్సవాలు జరిగిన సందర్భంలో ఈ ఉత్సవాలను ప్రారంభించటానికి వచ్చిన స్వర్గీయ రాష్ట్రపతి జాకిర్ హుస్సేన్‌కి మొదటి బ్యాచి పోలియో మందు ఇచ్చారు.


ఈ వాక్సిన్ తయారు చేయటానికి దీక్షతో పని చేయవలసి ఉన్నది, అని ఈ పథకం చీఫ్ ఇన్వెస్టిగేటరు డాక్టర్ ఏ. బాల సుబ్రహ్మణ్యం ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఈయన ఇన్‌స్టిట్యూటు అదనపు డిప్యూటీ డైరెక్టరు. ఈవాక్సిన్‌ని ఉపయోగించటానికి నిర్ణయం తీసుకోవటమనేది వ్యాధి వ్యాప్తి, ప్రజారోగ్య సమస్యగా ఈ వ్యాధిని పరిగణించటం, ఈ వ్యాధి విషయంలో స్థానిక ఆరోగ్యాధికారులు ఇస్తున్న ప్రాముఖ్యత మీద ఆధారపడి ఉంటుందని చెప్పారాయన.

ఈ వాక్సిన్‌లో సజీవ క్రిములు ఉంటున్న దృష్ట్యా, దీని ఉత్పత్తికి సంబంధించిన వివిధ దశలలో కఠిన పరీక్షలు జరిపారు. ఈ వాక్సిన్‌లో ఉపయోగించిన క్రిమి లక్షణాలు అసలు క్రిముల లక్షణాలకు వ్యత్యాసం లేదని నిర్ధారణ చేసుకోవటానికి, అవసరమైనంత మోతాదులో మందు తయారు చేయటానికి కూడా ఎన్నోరకాల పరీక్షలు జరిగాయి.

ఈ ఇన్‌స్టిట్యూటులో జరిగిన పరిశీలనలను ఆధారంగా చేసుకొని, ఆరేళ్ళు అంతకు లోపు వయస్సు గల బాలలకు మాత్రమే ఈ మందు వాడాలని నిర్ణయించారు. ముఖ్యంగా ఈ వయస్సులోని పిల్లలకే ఈ వ్యాధి సంక్రమించే అవకాశమున్నది. భారతదేశ పరిస్థితులలో ఈ మందు ఉపయోగపడుతుందో లేదో పరిశీలనలు జరిపి మంచి ఫలితాలు వచ్చేవిధంగా ఈ వాక్సిన్ వాడకంలో అవసరమైన మార్పులు చేస్తారు. ఇదొక అంటువ్యాధిగా ప్రబలిన సందర్భాలలో అందరికీ ఈ మందువాడతారు.

ఈ మందువల్ల గరిష్ఠ ఫలితాలు పొందటానికి అవసరమైన పంపిణీ, వాడకం పద్ధతులు రూపొందించటంలో ఇంకా ఎంతో కృషి చేయవలసి ఉన్నదని డాక్టర్ బాలసుబ్రమణ్యం అన్నారు. ఈ భయంకరమైన వ్యాధిని జయించటానికి సంబంధించిన కృషికి అంకురార్పణ జరిగింది.

—(యు. ఎస్. ఐ. ఎస్) ●



పేరు గంభీరంగా ఉంటే 'లంగ్' చేప అంటే సరిపోతుంది. ఈజాతి చేపలకి ఊపిరితిత్తులు ఉంటాయి. నిజానికి చేపలలో ఇది ప్రత్యేకతే కదా. చేపలు నీటిలోనే మొప్పలతో శ్వాసించడం విన్నాము కాని నేలమీద జంతువులలాగ ఊపిరితిత్తులతో శ్వాసించడం విడ్డూరం అనిపిస్తుంది. ఇవి ప్రస్తుతం ఐదు జాతులున్నాయి. ఆస్ట్రేలియా క్వీన్సులాండు రాష్ట్రంలోని నదుల్లో ఎపిసెరటోడను అనే ఒకజాతి, దక్షిణాఅమెరికా అమెజాను నదుల్లో లెపిడొసిరన్ అనే మరో జాతి ఉన్నాయి. దక్షిణాఫ్రికాలో మూడు జాతులున్నాయి. అయితే పూర్వకాలాల్లో కోట్లాది సంవత్సరాల క్రిందట చాలా జాతులు ప్రపంచ అంతా ఉండేవి.

లంగ్ చేపలకి మొప్పలుకూడా ఉన్నాయి. అంటే జలశ్వాసక్రియ జరుపుకొంటాయి. అయితే అప్పుడప్పుడు నీటిపైకివచ్చి గాలి పీల్చుకొని మనలాగే పవనశ్వాసక్రియకూడా జరుపుకొంటాయి.

ఈ జాతుల చేపల ప్రాముఖ్యం చాలమందికి తక్కువ ఉంటుంది. పురాతన కాలాల్లో చేపజాతులనుండి ఉభయ చరాలుగా ఉండే 'ఏంఫిబియా' తరగతిజీవులు అవతరించాయని పరిణామవాదం బోధిస్తుంది. అది ఈవిధమైన జాతుల చేపలద్వారా సాగిందని తెలుస్తుంది. స్తన్యజీవులు, సరీసృపాలనుంచి ఉద్భవించాయని సరీసృపాలు ఏంఫీబియానుంచి పరిణామం చెందాయని అంటే శ్వాసకోశమీనాలకు మనకుగల బంధుత్వం సూటిగా తడుతుంది!

అలా ఏంఫిబియా పరిణామం చెందినవిషయం 60 కోట్ల సంవత్సరాల నాటిగాథ. అప్పుడు మంచినీటి చెరువులు చేపల జనాభాతో క్రిక్కిరిసి ఆక్సిజను చాలక బాధపడేవి. భూమి మాత్రం ఖాళీగా ఉండేది చాల మట్టుకు ఆ పరిస్థితుల్లో క్రమంగా పైకివచ్చి గాలిపీల్చడం అలవాటు చేసుకొని, భూమిమీదకు 'అడుగు' పెట్టిన ధీరజాతి జంతువులు ఇవి!

—జమ్మి కోనేటిరావు.



మేఘాలు

కుమారి బోశెట్టి కమలా కౌసల్య

అందమైన సాయంకాలం. అందులోనూ ఆదివారం. సీతాకోక చిలకల్లాంటి అమ్మాయిలతో పూలతోటలా కళకళలాడి పోతోంది రామకృష్ణా బీచ్.

క్వాలిటీ రెస్టారెంట్‌కి కనుచూపు దూరంలో, పుఫ్వెత్తున లేచి పడుతోన్న కెరటాల్ని చూస్తూ ఒంటరిగా, పరాకుగా కూర్చుంది జ్యోతి. సముద్రంమీదుగా వస్తూన్న చల్లనిగాలికి ఆమె ఫాలభాగంపై తేలియాడుతూన్న ముంగురులు కెరటాల్ని అనుకరిస్తూన్నట్లున్నాయి. అలా వంటరిగా కూర్చోవడంలో ఏదో దిగులు. ఆ దిగులుతీరే సైనం గుర్తుకువస్తే పుట్టేదు సిగ్గు. ఆ సిగ్గు తెరలలో ఏదో తెలియని వెచ్చటి అనుభూతి.

'నమస్తే!'

హఠాత్తుగా వినిపించడంతో వులిక్కిపడి తల పైకెత్తి చూసింది. నవ్వుల పువ్వులు రువ్వుతూ, ఠీవిగా నిల్చొనివున్న ఆకర్షణీయమైన విగ్రహం కన్పించింది. చిలిపిగా చూస్తోన్న కళ్లు, కొంటెగా నవ్వుతూన్న పెదాలు, తెల్లని టెర్లిన్ స్లాక్, నల్లని పేంట్, దాంతో పోటీ పడుతూన్నట్లుగా నిగనిగలాడుతోన్న నల్లటి బూట్లు.

'ఎవరో అపరిచితుడు' అనుకోబోయింది జ్యోతి. కానీ ఆమె మనస్సుమాత్రం ఏదో సంఘటనను గుర్తు చేయడానికి ప్రయత్నించ సాగింది. అంతలో అతనే అన్నాడు.

'గుర్తులేనాండీ!' అని.

తన మతిమరపుతనానికి సిగ్గుపడుతూ, ఎదురుగా నిల్చొనివున్న 'గుమ్నామ్'ని గుర్తు తెచ్చుకోవడానికి గట్టిగా ప్రయత్నించింది. ఆమెదృష్టి ఒక వస్తువుమీద పడింది. ఆమె కళ్లు మెరిసాయి. 'అవును! అదే! అదే హేంకీ! బ్లూ హేంకీ! రెండంగుళాల పొడవున అతని జేబులోనుండి తొంగిచూస్తూవుంది'

అప్పటివరకూ అస్పష్టంగావున్న పాత సంఘటన కళ్లముందు కదలాడింది.

* * *

మూడునెల్ల క్రితం పిన్నిని చూడాలని హైద్రాబాదు వెళ్లింది తాను.

ఓరోజు సాయంత్రం......

ఉరుముల నాదాలతోడుగా అప్పటివరకూ నృత్యంచేసి అలసిపోయిన వర్షం వెలిసిపోయి, భూవిమీద ఏళ్లరూపంలోనూ సెలయేళ్ల రూపంలోనూ సముద్రుడిలో కలవడానికి పరుగులుతీయ నారంభించింది. అంతవరకూ నల్లగా, విషాదానికి మారురూపంలా వికృతంగా వున్న మేఘాలు, తెల్లగా, దూదిపింజల్లా మనోహరాకృతుల్ని సంతరించుకొంటున్నాయి. ప్రియురాలి హృదయంలా తూర్పుదిక్కున హరివిల్లు విరిసింది.

పిన్నికూతురు రాధను తోడు దీసుకొని షాపింగ్‌కని బయల్దేరింది జ్యోతి. కోఠి దగ్గర బస్‌దిగి నడుస్తూవుండగా హఠా

త్తుగా ఏవరోమనిషి ఆమెకు డాష్ యివ్వడం, ఆమె తూలి పడబోయి, నిలద్రొక్కుకోవడం రెప్పపాటులో జరిగాయి. పశ్చిమ దిక్కున ప్రకాశిస్తున్న అరుణకాంతి ఆమె కళ్లల్లో చోటు చేసుకొంది. తడబాటు నుండి తేరుకొని చూసేసరికి చెట్టంత మనిషిని పట్టుకొని చెడామడా దులిపేస్తోన్న రాధా, బిక్కమొహం వేసుకొని, అపరాధిలా చూస్తోన్న అందమైన అబ్బాయిూ కన్పించారు. అతను పాపం! చాలా దీనంగా 'సారీ' చెప్పుకొంటున్నాడు. ఐనా రాధలో ఏమాత్రం కనికరం కనిపించడంలేదు.

'పాపం! చూసుకొని వుండడు!' నిజం చెప్పాలంటే తనుకూడా చూసుకోకుండా నడిచింది. తప్పంతా అతనిదే అయినట్లు రాధ మాట్లాట్టం జ్యోతికి నచ్చలేదు. పైగా అతనిమీద ఆక్షణంలో బోలెడు జాలివేసింది కూడాను.

'ఊరుకొవే! ఏదో జరిగిపోయింది' అంది జ్యోతి రాధ చేయిపట్టుకొని లాగుతూ. అతనిముఖంలో కోటిదీపాలు వెలిగాయి. ఆగిపోయినరాధ వాగ్ధాటిని తలచుకొంటూ—'చాలా థ్యాంక్సండీ!' అన్నాడు జ్యోతో.

రాధ చేయిపట్టుకొని ముందుకు పోబోయిన జ్యోతి 'మిస్! ప్లీజ్' అని వినిపించడంతో 'మళ్లీ ఏం జరిగిందిరా బాబూ!' అనుకుంటూ వెనక్కుతిరిగి చూసింది. అతను బిక్కముఖం వేసుకొని ఆమె కుడిచేతివైపు చూస్తున్నాడు. అతనికి మొహం అలాపెట్టడం అలవాటేమో అనుకుంటూ, అతని చూపుల ననుసరించి చూసిన జ్యోతి సిగ్గుపడింది. ఆమె చేతికున్న పొళ్లగాజుకు దారప్పోగు చిక్కుకొని వ్రేలాడుతూ కన్పించిందో చక్కని బ్లూహేండ్ కర్చీఫ్.

'సారీ!' అంటూ పొళ్లనుండి తప్పించి ఆ రుమాల్ని అతని చేతికిచ్చింది.

'ఫరవాలేదండీ, మరోమారు థ్యాంక్స్' అంటూ అతను ముందుకు కదిలాడు.

'ఫర్వాలేదు, ఏమో అనుకున్నాను! గట్టిదానివే!'—ఎగతాళి పట్టించబోయింది రాధ.

'చాల్లే! నోర్మూసుకో!' అంది జ్యోతి వస్తూన్న నవ్వును ఆపుకోలేక నవ్వేస్తూ.

* * *

'గుర్తు వచ్చారండీ! నమస్తే!' అంది చేతులు జోడిస్తూ. ఆమె చూపులు తన హేండ్కర్చీఫ్పై వుంటం గమనించి, అతనుకూడా ఓసారి దానివంకచూసి నవ్వుకున్నాడు.

'మీ ఏకాంతానికి భంగం కలిగించాననుకొంటాను. క్షమార్హుడి నేనా?'—ఆమెకు నాలుగడుగుల దూరంలో కూర్చుంటూ అడిగాడు.

'అర్హులే' అంది జ్యోతి తలదించుకుని.

'థేంక్స్!' అన్నా డతను.

కాస్సేపు విశ్శబ్దం నిశ్శబ్దంగా నృత్యం చేసింది.

'మీ పేరు తెలుసుకోవచ్చా!' నిశ్శబ్దం చీలిపోయింది.

'తెలుసుకోవచ్చు' సముద్రపు టంచుల్ని చూస్తూ జవాబిచ్చింది.

కెరటాలమీది నురగలా అతని ముఖం తెల్లబడింది. ఆ తర్వాత చుట్టూ వ్యాపిస్తోన్న చీకటిలా నల్లబడింది. అతని ముఖంలోని మార్పుల్ని గమనించిన జ్యోతి నొచ్చుకొంటూ,—'జ్యోతిర్మయి' అని చెప్పింది.

'వెరీ బ్యూటిఫుల్ నేమ్! నాపేరు ప్రసాద్' ఆమె అడక్కపోయినా ఆత్మపరిచయం చేసుకున్నాడు.

'అందంగా మాట్లాడుతాడు'—మనస్సులోనే అనుకొంది జ్యోతి.

ఏదో అడగాలని — ఆమెను మాట్లాడించాలని ప్రసాద్ మనస్సు పరవళ్లు త్రొక్కుతూంది. కాని ఆమె ఏదో తపస్సులో వున్నట్లుగా కనిపించడంతో, చేసేదేమీలేక, యిసుకలో ఆమె బొమ్మ గీయసాగాడు.

పావుగంట గడిచింది. ఆమె తల త్రిప్పింది.

'వెళ్లిపోతుంది కాబోసు' అనుకున్నాడు ప్రసాద్.

'గుడ్ నైట్!' అందామె పైకిలేస్తూ.

'వీణ మీటినట్లుంది'— అనుకున్నాడు.

మల్లెతీగలావున్న జ్యోతిని చూస్తూ, 'మీకు అభ్యంతరం లేకపోతే రేపుకూడా-'

'బావుందండోయ్ మీ అభ్యర్ధన! మీరు రమ్మన్నా, అనకపోయినా రోజూ వచ్చి యిక్కడ యిలా కూర్చోవడం నా కలవాటు అసలు ఇక్కడకెవ్వరూరారు. మీరెలా వచ్చారో గానీ.'

'మిమ్మల్నిచూసి మీకోసం వచ్చానులే, నా ఐపే గుడ్నైట్'—ఎన్నో యుగాలనాటి అన్వేషణ ఫలించిన తృప్తిని నింపుకున్నాయి అతని కళ్లూ, మనస్సూ.

'అతి చనువు' అనుకోబోయి, తటపటాయించి, మానివేసింది జ్యోతి.

* * *

మర్నాడు ఆమెకన్నా ముందుగా వచ్చి కూర్చున్నాడు ప్రసాద్. అతనువచ్చిన అరగంట తర్వాత ఆమె వచ్చింది. అతను నవ్వాడు, ఆమెకూడా నవ్వింది.

మామూలుగా మాటలు కరువయ్యాయి కాసేపు.

'మీరేం చేస్తున్నారు?' కోకిలారావం వినిపించిం దతనికి. అప్పటివరకూ ఆమెనే చూస్తూన్న ప్రసాద్, దారికిపోయిన వాళ్లా చూపులు త్రిప్పుకొని, 'మిమ్మల్ని చూస్తున్నాను' అన్నాడు నెమ్మదిగా.

వచ్చేనవ్వుని ఆపుకొంటూ 'కనబడుతూనే వుంది. ఇప్పుడేం చేస్తున్నారని కాదు నేనడిగింది. అసలేం జేస్తుంటారూ అని' అంది జ్యోతి.

'అన్వేషిస్తూ వుంటాను'

'ఎవర్ని?'

'ఎవర్నికాదు దేన్ని అనాలి' కొంటెగా చూస్తూ అన్నాడు ప్రసాద్. జ్యోతిముఖం ఎఱ్ఱబడింది కోపంతో. అది గమనించిన ప్రసాద్ లోలోన నవ్వుకొంటూ, 'ఉద్యోగాన్వేషణ చేస్తున్నాను' అని చెప్పాడు.

'ఏం చదివారో తెలుసుకోవచ్చా!'

'నిరభ్యంతరంగా! ఏం వుద్యోగమేదైనా యిస్తారా?'

జ్యోతిముఖం మళ్లీ సంధ్యారుణిమ పులుముకొంది. కానీ యీసారి కోపంతో కాదు. నిన్నటి తన ప్రవర్తన గుర్తుకు రావడంవల్ల కలిగినసిగ్గులో, ఆమె సన్నగా నవ్వింది. అందం విరగబడి నవ్వింది.

'ఎమ్మెస్సీ! మరి మీరేం చదువుతున్నారు?'—ఆమె బుగ్గలపై పూచిన రోజా మొగ్గలను చూపులతో ఏరుకొంటూ అడిగాడు.

'సెకండ్బియ్యే. మీదీ వూరేనా!'

'కాదు మొదటిసారిగా మీకు ఎక్కడ కన్పించానో అదే మావూరు' జ్యోతి కనుబొమ్మలు ఆశ్చర్యార్ధకంగా కొంచెం పైకి లేచాయి.

'మీరంతగా ఆశ్చర్యపడకండి. ఉద్యోగం కోసం తిరుగుతున్నానని చెప్పాను కదూ! లా తిరుగుతూ యిలా ఏూ వూరు

వచ్చాను. ఉద్యోగం దొరుకుతుందో లేదో తెలీదు కానీ అంతకన్నా విలువైనదే దొరికింది.

మాటలు ఆగిపోయాయి. ఇసుకలో పిచ్చి గీతలు గీయటం మొదలుపెట్టింది జ్యోతి. నీలిమబ్బులు తేలియాడుతూన్న ఆమె కళ్లనూ, పొడుగ్గావుండి పైకి వంపు తిరిగివున్న ఆమె కనురెప్పల్నీ, తేనెలూరుతూన్న పెదాల్నీ చూస్తూ 'బాపూ బొమ్మ కన్నా బావుంది' అనుకున్నాడు ప్రసాద్. మధ్యలో తల పైకెత్తిచూసిన జ్యోతి అతని చూపుల తాకిడికి తట్టుకోలేక సముద్రంవైపు చూసింది.

సందెవెన్నెలలో సముద్రం పువ్వుల రూపం ధరించింది. తెలిమబ్బు పొత్తిళ్లలో వున్న బాలరాజు కంటికి కనిపించక పోయినా, చుట్టూవున్న కలికి వెన్నెలలు మాత్రం కళ్లకు కొటుక బెడ్తున్నాయి.

'ఇక వెళ్దామా!' అంటూ పైకి లేచింది.

'అప్పుడే!' అంటూ తనుకూడా లేచాడు ప్రసాద్.

'ఆలస్యమైతే యింటిదగ్గర ఎదురు చూస్తుంటారు'

'ఎవరు?' ఆతృత ధ్వనించింది.

'మా పేరెంట్స్'

'అదృష్టవంతుణ్ని' చిన్నగా గొణుక్కున్నాడు ప్రసాద్.

నీలికువలాలు

జ్యోతి నవ్వుకొంది.

ఇసుకలో ఆమెప్రక్కనేనడుస్తూ ప్రసాద్ 'మీతో ఒకటి చెప్పాలి! అహఁ! మిమ్మల్ని ఓమాట అడగాలి' అన్నాడు తడబడుతూన్న గొంతుకతో. ఏదో అర్థింపు ధ్వనించింది.

'ఏమిటది?' జ్యోతిగొంతు కొంచెం వణికింది. వాచి చూసుకున్నాడు ప్రసాద్. ఏడున్నరైంది. ఇసుకను వదిలి తారురోడ్డు మీదకు వచ్చారు. తల పైకెత్తి చుట్టూ చూసిన అతనికి చాలామంది నడుస్తూ కన్పించారు.

'ప్లీజ్! రేపు చెబ్తాను. ఏమీ అనుకోకండి. గుడ్‌నైట్' అనేసి గబగబా వెళ్తూన్న అతన్నిచూస్తూ 'చాలా వింత మనిషి' అనుకొంది జ్యోతి.

ఇల్లుచేరిన జ్యోతి సరాసరి డాబాపైకి పోయి కూర్చుంది. ఆమె మనస్సు గగన కుసుమాలతో మాలలల్లుకొంటూ గాలి కల్పనలతో కాలయాపన చేయసాగింది. కల్పనా వసంత పవనాలామె దేహాన్ని మృదువుగా స్పృశించసాగాయి.

'రేపు ఏం చెబ్తాడో! అతను చెప్పే విషయమేమిటి? ఎందుకలాతడబడ్డాడు! అతనికి యిలాంటి అనుభవం యిదేమొదటిసారి కాబోలు! ఆ చిన్నకళ్లలో ఎంత ఆకర్షణ. కొంచెం లావుగావున్న పెదవుల్లో ఎంత పట్టుదల. ఆ అందమైన ముఖంలో ఎంత గాంభీర్యం. అతను నిండుగా పకపకా నవ్వితే ఎలా వుంటాడు—వూహించుకొంది జ్యోతి. 'అబ్బే! బావోలేదు. విలన్లావున్నాడు. ఇలా ఎప్పటిలానే చిర్నవ్వు నవ్వితేనే బావుంటాడు.'

ఆలోచనలతో మనసంతా గజిబిజిగా తయారైంది. నెల్రకితం రాధ్రవాసిన వుత్తరంలోని ఓ విషయం గుర్తుకు వచ్చింది. 'హేండ్కర్చీఫ్ ఎత్తుకుపోయే నీ వైనం గుర్తొచ్చి నప్పుడల్లా నవ్వొస్తూంటుంది' అని వ్రాసింది రాధ. 'ఏమిటా సంఘటన! ఏమిటీ సంగమం! ఇది దేనికి నాంది ప్రస్తావన!' హృదయం బరువెక్కింది.

'రేపు! రేపునస్తుంది. అతను వస్తాడు. ఏదో చెబ్తాడు. తను వినాలి! తనూ ఏదో చెప్పాలి! ఆ తర్వాత...'

మనస్సు అనె ప్రమేయం లేకుండానే పిచ్చిగా ఆలోచిస్తూంది. ఆ ఆలోచనల నుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ గట్టిగా నిట్టూర్చి, చుట్టూ చూసింది.

డాబామీదా, చుట్టూ, మసకవెన్నెల. ఇందాక బీచ్‌లో తమ యిద్దరిముందూ నవ్వుతూ నిల్చిన చందమామ యిప్పుడు కొబ్బరిమట్టల మధ్యనుండి తనను దొంగ చూపులు చూస్తున్నాడు. పట్టుబడిన చందమామ విధిలేక కొబ్బరాకుల చాటు నుండి పైకివచ్చాడు. నేలమీద నిద్రబోతూన్న వెన్నెలకు మెలకువ వచ్చి వొళ్ళు విరుచుకొంది.

చల్లని చందమామతో అంతకన్నా చల్లగా నవ్వుతూ కన్పించాడు ప్రసాద్. గిలిగింతలు పెట్టినట్లైంది.


'జ్యోతి! జ్యోతి!'—క్రిందనుండి వాళ్లమ్మగారి పిలుపు వినిపించటంతో అందాల బొమ్మ కాస్తా అదృశ్యమైపోయింది.

'ఏమిటమ్మా'—అంటూ క్రిందకు వెళ్లింది జ్యోతి.

'అన్నం తినవా!'

'ఆకలిగా లేదమ్మా!' తన గదిలోకి వెళ్తూన్న జ్యోతివంక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు వాళ్లమ్మగారు.

'అమ్మడూ!'—మంచంమ్మీద పడుకొని




మఫత్‌లాల్ గ్రూప్
వాయిల్‌లను ధరించి
సంతృప్తిని పొందండి.
అందాల రాణిలా
విరాజిల్లండి...
ఈ బట్టలు, నాణ్యమైన నేత గలిగి,
ఆకర్షణీయమైన రంగులతో
వుంటాయి. మనోహరమైన
డిజైనుగల-ఈబట్టలలో
మీకు నచ్చిన దానిని
ఎంచుకోండి.
అందాల రాణివలె వుండండి!
MAFATLAL GROUP
మఫత్‌లాల్ గ్రూప్ వాయిల్‌లు
'టెరీన్'/కాటన్, టెరిలైజ్‌డ్ మరియు మఫినైజ్‌డ్ రకములు
స్టాండర్డ్, బొంబాయి • స్టాండర్డ్ (న్యూ చైనా), బొంబాయి • స్టాండర్డ్, దేవాస్ • మఫత్‌లాల్ ఫైన్, నవసారి యూనిట్ నెం. 1 • మఫత్‌లాల్ ఫైన్, (సాసూన్), బొంబాయి: యూనిట్ నెం. 2 • మఫత్‌లాల్ ఫైన్ (న్యూ యూనియన్), బొంబాయి: యూనిట్ నెం. 3 • న్యూ షొర్రాక్, అహమదాబాద్ • న్యూ షొర్రాక్, నడియాడ్ • సూరత్ కాటన్, సూరత్ • మిహిర్ టెక్స్‌టైల్స్, అహమదాబాద్.

నీలిరంగు వరాలు

ఆలోచిస్తున్న జ్యోతి నిసుగ్గా గుమ్మం వైపు చూసి, తండ్రి కనిపించడంతో ఖంగారుగా మంచందిగి నిల్చొంది.

'ఏమ్మా! ఆకలిగా లేదన్నావుట! ఒంట్లో బావోలేదా'—అడిగారాయన.

'బాగానేవుంది నాన్నారూ! కానీ ... మరేమో...సాయంత్రం నేను వద్దని ఎంత చెప్పినా వినకుండా ఆ యిందిరా వాళ్ళమ్మగారు యింత టిఫిన్ పెట్టి అది తినేంత వరకూ వదలనని బలవంతం చేశారు... అందుకని యిప్పుడు ఆకలి వేయడంలేదు'

'పోనీలే! కొంచెం పాలైనా తాగిపడుకో' అంటూ గదిలోకు వెళ్ళిపోయారాయన.

పనిమనిషి పాలగ్లాసు తీసుకొచ్చి టేబిల్ పైన పెట్టి వెళ్ళగానే, గది తలుపువేసి పాలగ్లాసు చేతిలోకి తీసుకొంది జ్యోతి. ఆమెకళ్ళు ఆశ్చర్యంతో మరింత పెద్దవయ్యాయి. మళ్ళీ కనిపించాడు ప్రసాద్, ఎప్పటిలా నవ్వుతూనే వున్నాడు—'అంత తియ్యగా ఎలా నవ్వగలడు'—

'ప్లీజ్! వెళ్ళిపొండి!' బతిమలాడుతూన్నట్లుగా అంది.

'ఊహూ!' తల అడ్డంగా త్రిప్పాడు పాలగ్లాసులోని ప్రసాద్.

'వెళ్లరా!' తర్జని చూపిస్తూ బెదిరించింది

చేతులు కట్టుకొని నిలబడి నవ్వాడు. ఆమె కోపం అలోచించింది.

'సరే! ఏమైనా గుడ్‌నైట్'—విన్నటి అతని మాట అతనికే అప్పగించి, కళ్ళు గట్టిగా మూసుకొని గ్లాసులోని పాలు గబగబా త్రాగి ఖాళీ గ్లాసులోకి చూసింది — కొంటెగా, అనుమానంగా. అతను కన్పించలేదు నవ్వుకొంటూ లైటార్పి పడుకొంది జ్యోతి.

* * *

బీచ్‌లో ఒంటరిగా కూర్చునివుంది జ్యోతి. మనస్సు వుల్లాసంగా వుంది ఆమె కళ్ళు మెరుస్తున్నాయ్ ఆనందంలో.

'ఇంకా రాలేదేం ప్రసాద్! ఏదో చెబుతానన్నాడు...ఎప్పుడు వస్తాడు' — ప్రశ్నలతో వేదిస్తూన్న మనసుని వూరడించ ప్రయత్నించింది.

అప్పటి వరకూ పాటిపోయున్నట్లున్న చందమామ మీ టితలు పరమసోడంతో ప్రకాశించసాగాయి. బీచ్‌లో అక్కడక్కడా ఒంటరిగా మిగిలిపోయి జంటనుగురించి ఆలోచిస్తూన్న వాళ్ళను టెలివిజన్‌లానూ, టెలిగ్రాం మెసెంజర్లానూ, తనకు చేతనైనంతవరకూ సహాయపడుతోన్న చందమామను చూస్తూ,

'ఏచాంద్ జరా ఛుప్‌జా!' కూనిరాగం తీసింది జ్యోతి.

'ఏ వక్త్ జరా రుక్‌జా!'—వెనగ్గా వినిపించింది. తల ప్రక్కకు త్రిప్పి చూసిన జ్యోతికి ప్రసాద్ కన్పించాడు.

'ప్రసాద్! ఎంతసేపైంది మీరువచ్చి?' ప్రక్కనే కూర్చుంటోన్న అతన్నడిగింది జ్యోతి.

'ఎంతచక్కగా పాడావ్ జ్యోతీ!—' ఆమెచేతిని తన చేతిలోకి తీసుకొంటూ అన్నాడు ప్రసాద్. అతనిచనువు ఆమెకు కోపం కలిగించకపోగా ఆనందం కలిగించింది.

'ఊహూఁ; మీరే నాకన్నా చక్కగాపాడారు'

'చందమామ ఎందుకంత చిన్నబోయి వుంది?'

'ఎందుకింత ఆలస్యముయింది?'

తమమాటలు ఒకదానికొకటి సంబంధం లేకుండా వున్నాయని గ్రహించిన యిద్దరూ ఒక్కసారిగా నవ్వుకున్నారు.

'జ్యోతీ! అలా చూడు! నీలాకాశం నీలి సముద్రాన్ని చుంబించేచోట చూడు! అక్కడకు పోదాంపద. ఎవ్వరూ వుండరు. ఇంచక్కా నువ్వూ నేనే...' అంటూ ఆమె నడుంచుట్టూ చేయివేశాడు. ఆమె అతని మీద వాలిపోయి, అతని హృదయంలో తలదాచుకొంది. అతను ఏదో చెబుతున్నాడు. ఆమె మరేదో మధురానుభూతిలో సోలిపోయి వింటూంది. ఇద్దరూ సముద్రపు నీటిమీద నెమ్మదిగా నడువసాగారు. వాళ్ళంతఎత్తుగ లేచిన కెరటం ఇద్దర్నీ నీటితెరతో కప్పివేసి, అంతవరకూ వాళ్ళు కూర్చునివచ్చిన ప్రదేశాన్ని పరీక్షించబోయింది.

* * *

ఒళ్ళంతా చల్లబడి క్రింద పడుకున్నట్లు మెలకువ వచ్చింది జ్యోతికి. ఏమిటి? ఏమైంది? ఏమిటీకల? తల వేడెక్కినట్లనిపించింది ఆలోచనలతో. మళ్లీ నిద్రపోవాలనే ప్రయత్నించి ఓడిపోయిన జ్యోతి లైటువేసి కూర్చుంది.

'ఎందుకు తన మనస్సింత బేలగా తయారైంది! తన మనస్సెందుకిలా ప్రసాద్ వేపు మొగ్గుతుంది! ఇన్నాళ్ళూ స్పందన లేకుండా పడివున్న ఒహా శిలలో యింతటి ఆర్ద్రత ఎలా కలిగింది? ఎంతటి ఆకర్షణ

శక్తి ఆతనిలో! ఆకళ్ళూ, ఆ పెదిమలూ, ఆ నవ్వూ, ఆ విగ్రహమూ తన నిగ్రహాన్ని చెదరగొడుతున్నాయి. ఇన్నాళ్ళూ సముద్ర తీరాన తను చేసిన మూగతపస్సు ఈ మూర్తి కోసమేనా! ఆతను తనకు కావాలి. తను ఆతనిలో కలవాలి'—మనస్సు వేయి గొంతులతో అంటోంది 'ప్రసాద్! నువ్వు కావాలి! నువ్వుకావాలి! లేకపోతే నాకు పిచ్చెక్కిపోతుంది ప్రసాద్!' వెచ్చని కన్నీరు ఆమె చెంపలపైకి జారింది.

* * *

ఆరాట పడుతోన్న హృదయాన్ని ఆశా దీపాల్తో వెలిగించుకొని, ఎదురుచూసిన సాయంత్రం రానేవచ్చింది. జ్యోతికి నిరాశను ప్రపంచానికి చీకటిని పంచియిచ్చి వెళ్ళనూ వెళ్ళింది. ఆ మరునటి రోజుకూడా అంతే జరిగింది.

'ఏమైంది అతనికి? వస్తానవిచెప్పి ఎందుకు రాలేదు? తనను ఏడిపించటానికా!'

పూజ చేయాలనివచ్చిన పుష్పం వాడి పోయింది. మధుర రాగాలాలపించాలనుకొన్న మహావిపంచి మూగబోయింది. కన్నీరు చెంపల్ని తడిపింది.

* * *

మరునటిరోజు వాడిన ముఖంతో అలసిన కళ్ళతో కాలేజీకి వెళ్ళింది జ్యోతి. సెకండవర్ క్లాస్ కాన్సిలవడంతో వెయిటింగ్ రూంకి వెళ్ళూన్న ఆమెకు గుమ్మంలోనే ఎదురైన కృష్ణవేణి 'ఏమిటే? అలా వున్నావ్! విరహంలోపడ్డ శకుంతలా! ఎవరైనా దుష్యంతుడు ఎదురుపడ్డాడా!' లని కుశలప్రశ్న వేసింది. **అట్నుంచి** జవాబు రాలేదు.

'మరేం భయపడకు! నీ ప్రియుడ్ని నేనేం షేర్ చేసుకోన్లే' అని జోక్ చేసింది. అప్పటికీ రియాక్షన్ లేకపోవడంతో మూతి ముడుచుకొని.

'పోనీలేమ్మా! ఆ రహస్యం నీలోనే దాచుకోగానీ నీకో లెటరువచ్చింది. ఇదిగో!' —చేతిలోని కవరు వంకా, వెళ్ళూన్న కృష్ణవేణివంకా, అర్థంకాని చూపులతో అయోమయంగా మార్చి మార్చి చూసింది జ్యోతి.

లోపలకువెళ్ళి కవరుమీద అడ్రసు చూసింది

'మిస్ జ్యోతి బియ్యే, సెకండియర్, ఉమెన్స్ కాలేజీ' అనివుంది కవరుమీద.

క్లాసుకీ, కాలేజీకీకూడా తనొక్కర్తే జ్యోతి. ఏదో ఆలోచనరాగా అక్కడవున్న బల్లమీద కూర్చుని వొణుకుతూన్న చేతుల్తో కవరుచించింది.

'కుమారి జ్యోతిగార్కి!'

ఆనందంతో గుండె ఆగిపోయినంత పనైంది. మూలనున్న కూజాలోని నీళ్లు గ్లాసులోకి వంచుకొని ఒక్కగుక్కలో త్రాగింది ముఖంమీద పట్టిన చెమట తుడుచుకొంటూ లెటరుపైకి దృష్టి పోనిచ్చింది.

'వస్తానని చెప్పి రానందుకు — మీకు నామీద కోపం వచ్చిందనుకొంటాను. రావడానికి వీలులేక పోవడంతో ప్రయత్నించి కూడా మిమ్మల్ని కలవలేకపోయాను దురదృష్టవంతుణ్ణి. చిన్నప్పటినుండి నాజీవితంలో జరిగిన ప్రతి ముఖ్యమైన సంఘటనా నా ప్రమేయం లేకుండానే జరుగుతూ వచ్చింది. అన్నిటా అపజయమే ఎదురవుతోంది—మీ విషయంలో కూడా నన్ను అపజయం పొందనివ్వకండి. అలా జరిగితే... నేనేమౌతానో నాకే తెలీదు. చెప్పాలనుకొన్నదీ, చెప్తానన్నదీ మీతో చెప్పనేలేదు. మీకు ఆ విషయం చెప్పాలి—మీ నుండి జవాబు వినాలి—రేపు మధ్యాహ్నం మెయిల్‌కి వెళ్తున్నాను. తప్పక స్టేషనుకు వస్తారు కదూ! నన్ను నిరాశపరచరనే నమ్మకం నాకుంది. ఏమిటంత నమ్మకం అనడిగితే నేనేమీ చెప్పలేక పోవచ్చు. కానీ మిమ్మల్ని చూసిన మొదటి క్షణంలో అదివరకు ఎక్కడో చూసినట్లు అనుభూతి పొందాను

నీలిరుమాలు

ఎంత ఆలోచించినా గుర్తు రాలేదు. మళ్లీ అదృష్టవశాత్తూ మిమ్మల్ని రెండోసారి కలుసుకొనే యోగం పట్టింది. అప్పుడూ అలానే ఫీలయ్యాను, కానీ మొదటిసారి మిమ్మల్ని ఎక్కడ కలుసుకున్నానో కొద్దిగా వూహించాను. వయస్సు వచ్చిందగ్గర్నించీ నేను కన్న ప్రతికలలోనూ మీరే వున్నారు. అతిశయోక్తిగా కన్పించినా అసంభవమేమీకాదు. పూర్వజన్మలమీదా పునర్జన్మలమీదా నాకు యింతవరకూ నమ్మకం లేదు. కానీ మిమ్మల్ని చూసింతర్వాత నాలోకలిగిన అనుభూతుల్ని, ఆవేదననూ బట్టి ఆలోచిస్తే జన్మజన్మల సంబంధాల సంగతి బొత్తిగా కొట్టి పారేయవలసిన విషయంలా తోచడం లేదు.

మీకై వేయికళ్లతో ఎదురుచూస్తూ

మీ

ప్రసాద్.

తలనిండా ఆలోచనలు నిండగా తొందరగా యింటికి వెళ్లింది జ్యోతి. స్టేషనుకు వెళ్లడమా మానడమా! మనస్సు సందిగ్ధావస్థలో పడింది. ఎంత ఆలోచించినా ఓ నిర్ణయానికి రాలేకపోయింది. 'అతను తనతో ఆడుకోవడంలేదుకదా!' వుత్తరంలోని ప్రతిఅక్షరమూ తన అనుమానాలు అబద్ధమని నొక్కిచెబుతున్నాయి. నిజం! అతను ఒకరిచేత మోసగించబడేవాడిలానే వున్నాడు కానీ మోసగించేవాడిలా లేడు. ఆ ఒకరు తనుమాత్రం కాకూడదు. అతను తన వారు. తను వెళ్ళాలి. వెళ్ళి తీరాలి—అతను తనకోసం ఫ్లాట్‌ఫారమంతా వేయికళ్లతో వెదుకుతూ వుంటాడు. తను కనిపించకపోతే అతని అందమైన మోము చిన్నబోతుంది. అతనికళ్లలో నిస్పృహ నీడలు పరుచుకొంటుంది. అతనిని నిరాశపరచి తను నిరాశపడకూడదు.'

టైము చూసుకొంది. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ట్రైనుకి ఆట్టే వ్యవధిలేదు ఆలోచించడానికి ఇది సమయమూ కాదు. దృఢనిశ్చయానికి వచ్చిన జ్యోతి చీరె మార్చుకొని తొందరగా ముస్తాబై రిక్షా ఎక్కింది.

'బండి కూసనాదిలేపే టయిమయిందం డమ్మాయిగోరూ!' రిక్షావాడి మాటలతో మనస్సు మరీ అలిసిపోయింది. రిక్షానుండి దిగి పరిగెట్టాలనిపించింది జ్యోతికి.

స్టేషను సమీపించిన రిక్షా పూర్తిగా ఆగకముందే రిక్షాదిగిన జ్యోతి కాళ్లు ట్రైనువైపు పరుగుదీశాయి. మెల్లగా కదులుతోన్న రైలునిచూసి 'ప్రసాద్!' అని పిచ్చిగా అరవబోయింది. జనాన్ని త్రోసుకుంటూ తడబడుతున్న అడుగులతో ముందుకు నడిచింది.

వేగం అందుకొంటూన్న రైల్లో ఫర్స్టుక్లాస్ కంపార్ట్‌మెంట్‌లో కిటికీ ప్రక్కనే కూర్చునివున్న ప్రసాద్ చూపులు ఫ్లాట్‌ఫారం మీదపరిగెడుతూ దూరానకన్పించిన జ్యోతిని చూసి ఆగిపోయాయి. నుదుటిమీద రెండు ముడుతలు పడ్డాయి. వాడిన పెదాలపై అర్థంలేని చిర్నవ్వు మెరిసింది. కర్చీఫ్ పైకెత్తి వూపాడు.

నిరాశ బరువుతో క్రిందకు వాలుతోన్న జ్యోతి కళ్లకు, దూరంగా, గాలిలో రెపరెపలాడుతోన్న బ్లూహేంకీ కన్పించింది. అప్రయత్నంగా తనుకూడా చేయి పైకెత్తి వూపుతూ, ఆ రుమాల్ని పట్టుకున్న చేతి యజమాన్ని చూడాలని ప్రయత్నించింది. ఎవరో అడ్డువచ్చారు. నిస్పృహతో జ్యోతి శిలైపోయింది.

దూరంగా రెప రెప లాడుతోన్న బ్లూ హేంకీ కన్నీటి తెరలమాటున గాలిలో దీపంలా అదృశ్యమౌతూ కన్పించింది.

ఒక వారం విపరీతం!



ప్రాజ్ఞుడు

'మీవారు రైలు ప్రమాదంలో చనిపోయారు. ఆనవాలు తెలియనంత రూపురేఖలు మారిపోయాయి. ఇవిగో ఆయన రైలుపాసు, ఫొటో.. ఇతర సామానులు దొరికినవి' అని ఒక పోలీసు కాన్‌స్టేబులు 35 ఏళ్ళ వాసుదేవ్ సవంత్ ఇంటికి వెళ్ళి అతని భార్యతో చెప్పి ఆ వస్తువులిచ్చి చక్కా పోయాడట. ఏడుపు వంటివయ్యాక సవంత్ దహన సంస్కారాలకు తగు ఏర్పాట్లు చేసుకుని, శవాన్ని తెచ్చుకోడానికి ఆసుపత్రికి వెళ్ళే సరికి, ఇటు తిరిగి సవంత్ ఇంటికి వచ్చి బ్రతికున్న తన కొరకు ఘన సన్మానం చూసి కొయ్యబారిపోయి, తేరుకుని, విషయం గ్రహించి, నవ్వుకున్నాడట. ఆయన రైలులో ప్రయాణం చేస్తుండగా జేబుదొంగ ఆయన సామానులు కాజేసి, రైల్లోంచి దూకుతుండగా పక్కనొస్తున్న మరో రైలు క్రింద పడ్డాడట. అదీకథ. సవంత్ కుటుంబం వారు,



ఆయన భార్యా పొందిన ఆనందాన్ని వర్ణించగలమా! ఇది బొంబాయిలో జరిగింది.

ధనవంతుల్ని దోచుకోడానికి అవతరించిన దొంగలు

కోయంబత్తూరుకు 30 మైళ్ళ దూరంలో వున్న నెల్లిదురైలో ఒక వ్యవసాయదారుని ఇంట్లో అర్ధరాత్రి ఓ పదిహేనుమంది ముఖానికి ఎర్ర గుడ్డలు ధరించిన గూండాలవంటివారు ప్రవేశించి ఆయింటివారిని తాళ్ళతో కట్టివేసి, ఇంటి యజమానితో, 'మేం ఇలా గొప్పవాళ్ళని దోచుకోడానికి అవతరించాం. పోయి నీ దిక్కున్న చోట చెప్పుకో' అవటా అని అన్నారట. ఇంటాయన భార్య, కూతురు నగలు, 2500 కిమ్మత్తు చేసేవి ఎత్తుకు పోయారట. వీరు ఒహవేళ నక్సలైటులేమో అని అనుమానం అంటే నారెవరు! ఏరూపంతో వుంటారు! ఏం చేస్తుంటారు? హానోస్:

వన్యమృగ విజృంభణ

బిక్‌నూర్‌కి సమీపంలో వున్న జాలాపూర్ టోయ అనే గ్రామానికి చెందిన ఒక కుర్రాడు పశువులు కాస్తుండగా అతన్ని రెండు తోడేళ్ళు ఎత్తుకు పారి పోయాయట. బస్తరు అడవులకు చెందిన అబుజమార్ జిల్లా ప్రాంతంలో వున్న వూళ్ళోకి పెద్ద పులులు చాలా తరుచుగా గుంపులు గుంపులుగా వూళ్ళల్లోకి వచ్చేస్తుండడం వల్ల అక్కడి వారంతా ఇళ్ళు, వాకిళ్ళు పాడుపెట్టి, పారి పోతున్నారట.

* * *

అహ్మదాబాద్‌కి చెందిన అస్లావి దగ్గర శాంతిపుర అనే గ్రామంలో 27 ఏళ్ళ ఎలిజా జోసఫ్ అనే ఆవిడ తన ఇంటిపని చూసుకుంటూ వెనక్కు తిరిగి చూసేసరికి ఒక పాము నిద్రపోతున్న తన కూతురువైపు వెళుతోందట దాంతో ఆవిడ కెవ్వున కేక వేసిందట. వరండాలో విశ్రాంతి తీసుకుంటున్న ఆమె భర్త కేకవిని చటుక్కున వచ్చి, అది చూసి, తుపాకి తెచ్చాడట తుపాకి పేలిస్తే పిల్లకూ తగులుతుందని భార్య చెప్పే సరికి గమ్మునా తుపాకిని మంచంమీద పడేసి పిల్లని రక్షించడానికి వెళ్ళాడట. ఆ ఏడేయడంలో తుపాకి ప్రేలి అతని భార్యపొట్టలో తగిలిందట. దాంతో ఆమె విల విల విల్లాడి ఆసుపత్రిలో చనిపోయిందట—విధిని తప్పించడం ఎవరితరం?

* * *

ఈ ఏడు పశ్చిమబెంగాలులో గాంధీ శతజయంతి ఉత్సవాలు రాష్ట్రస్థాయిలో జరపటం అవసరం లేదని ప.బెం. ప్రభుత్వం నిర్ణయించుకుందిట— 17—5—69 'ఆర్గనయిజర్' వార్త.

చీమల ఎగుమతి!

జినోవానుంచి సార్డీనియాకు నాలుగుటన్నుల చీమలను ఎగుమతి చేశారట. అడవుల్లోని కొన్ని రకాల దుష్టక్రిములను, కీటకాలను నాశనం చేయడానికి చీమలే సాటి అని ఇటలీ వ్యవసాయ సంబంధ శాఖ కనిపెట్టిందట.

800 పౌన్లకి 16 మంది

800 పౌనులు బరువున్న బిమన్‌లాల్ సుకర్‌చంద్ షా అనే 71 ఏళ్ళ ఆయన అహమ్మదాబాదులో చనిపోతే ఆయనని మోయడానికి 16 మంది కావలసి వచ్చారట.

* * *

సినిమా హాలువద్ద టిక్కట్లు కొనడంతో గొడవ వచ్చి మంగాలె శివా అనే హరిజన యువకుడు భగ్వాన్ వల్లభ్ అనే అతన్ని కత్తితో పొడిచాడట. ఇది రాజకోట్‌కి 30 మైళ్ళ దూరంలో జరిగింది.

* * *

లక్నోలో రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో స్విమ్మింగ్ పూల్‌లో మెంబర్లుగా చేరిన ఇద్దరన్నదమ్ములు చేరిన మర్నాడు ఎవరూ లేని సమయంలో ఈత కొట్టినందువల్ల ఈత చేతగాక, మునిగి చనిపోయారట. వీరిద్దరి వయస్సు 12—14 నట.

కలియుగ వైష్ణవ మాయా!

వెయ్యిరూపాయల నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్లు మార్చుకుందామని పోస్టాఫీసుకు వెళ్ళిన ఓ వృద్ధ వితంతువు పోస్టు శాఖవారిచ్చిన సమాధానానికి అట్టే వుండి పోయిందట. 'మీరు ఇంతకు పూర్వమే డబ్బు పట్టుకు వెళ్ళారు. మీరు



గాపోతే మరొకరు. మొత్తానికి డబ్బు తీసుకు వెళ్ళడం మాత్రం నిజం' అన్నారట. సర్టిఫికేట్లు పోస్టలు వారికి ఇస్తేగాని డబ్బు ఎలా ఇచ్చారో అనుకేగాక వారికీ అర్థం కాలేదట. ఇది బహరిచ్ అనే చోట జరిగింది.



'ఆదర్శ కుటుంబం'లో జయలలిత, నాగేశ్వరరావు.

చిత్రసమీక్ష

ఆదర్శ కుటుంబం

కాలంతోపాటు మనస్తత్వాలుకూడా మార్పుచెందుతున్న ఈ ఆధునిక సమాజంలో కలసిఉంటేకలదుసుఖం అన్న నానుడికి నానాటికీ ప్రచారం తగ్గిపోతున్నది. కొన్ని సందర్భాలలో అన్నదమ్ములమధ్య అవగాహన ఉన్నా తోడికోడళ్లమధ్య అనుమానాలు, అసంతృప్తి తలయెత్తడంవల్ల సుఖంగా సాగిపోయే సంసారాల్లో కలతలకి అవకాశం ఏర్పడుతుంది. పెద్దకొడుకు నెత్తిన కుటుంబ భారాన్నిమోపి ముందు వెనుకలు ఆలోచించకుండా గొప్పలకిపోయి ఉన్నఆస్తిని అప్పులపాలు చేయడం, బాధ్యత లేని మిగతావారు పైలాపచ్చీసుగా ఖర్చు చేసి యిల్లుగుల్ల అయ్యేపరిస్థితిని తీసుకు రావటం సాధారణంగా ఉమ్మడి కుటుంబాలలో కనిపిస్తుంది. అలాంటి కుటుంబాన్ని అందులోని వ్యక్తులను, వారిని దారిన పెట్టడానికి ఎదుర్కోవాల్సిన సమస్యలని, వాటి పరిష్కారాన్ని ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారు 'ఆదర్శ కుటుంబం'లో చక్కగా చిత్రీకరించారు.

కాలేజి విద్యార్థిగా ప్రేమికుడిగా, బాధ్యతగల ఒక కుటుంబ సభ్యునిగా అక్కినేని నాగేశ్వరరావు ఉదాత్తమైన నటనని ప్రదర్శించారు. ఇంటికి పెద్దకొడుకుగా బరువుబాధ్యతలనిమోస్తూ కుటుంబ గౌరవాన్ని కాపాడటానికి, అందరికీ ఏ లోటు రానీయకుండా చేయడానికి అహోరాత్రాలు శ్రమించి అలసిపోయిన వ్యక్తిగా గుమ్మడి నటన ప్రేక్షకుల గుండెలమీద చెరగని ముద్రవేస్తుంది. రెండో కొడుకుగా 'అవ్ కోర్స్' పంచాయితీబోర్డు ప్రెసిడెంటుగా నాగభూషణం ప్రతిభావంతమైన నటనని ప్రదర్శించారు. రేచీకటి అల్లుడిగా పద్మనాభం హాస్యం బరువైన కథాగమనంలో ప్రేక్షకులకి మంచి రిలీఫ్ నిస్తుంది. డాక్టర్‌గా, బాధ్యతగల యిల్లాలిగా జయలలిత నటనలో నిండుదనం కనిపిస్తుంది. గుమ్మడి భార్యగా అంజలీదేవి, పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్ శ్రీమతిగా ఎస్. వరలక్ష్మి వారి పాత్రలకి పరిపూర్ణమైన న్యాయాన్ని చేకూర్చారు. కుస్తీపోటీలనీ, కసరత్తులనీ భర్త తనని అలక్ష్యం చేస్తున్నప్పుడు భార్య మనోభావాలని చక్కగా ప్రదర్శించిన గీతాంజలి నటన మెచ్చదగినది.


వాగయ్య, భీమరాజా, సాక్షి రంగారావు, హేమలత, అనిత, బాలసరస్వతి మొదలగువారు పాత్రల పరిధుల మేరకి నటించి రక్తి కట్టించారు. లేడి నటులు రమణారెడ్డి, సూర్యకాంతం కనిపించినప్పుడల్లా ప్రేక్షకుల్ని నవ్విస్తారు. శ్రీరామ నవమి సందర్భంగా జరిగే కోలాటం, ఎమ్యూజ్‌మెంట్ పార్కులో విజయలలిత నృత్యం మామూలు ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంటాయి.

ఈ చిత్రానికి కథ, దర్శకత్వం కె. ప్రత్యగాత్మ, మాటలు శ్రీ ఆత్రేయ, పాటలు శ్రీయుతులు ఆత్రేయ, నారాయణరెడ్డి, కొసరాజు రాశారు. సంగీతం ఎస్. రాజేశ్వరరావు, కెమెరా సెల్వరాజ్ నిర్వహించారు. శ్రీ ఎ. వి. సుబ్బారావు నిర్మించిన 'ఆదర్శ కుటుంబం' అక్కినేని నాగేశ్వరరావు రజతోత్సవ చిత్రం ఈ నెల 6 వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో విడుదలయింది.


— మాధవ్



'జగత్ కిలాడీలు'లో కృష్ణ, వాణిశ్రీ.



తక్కువ ఖర్చులో
హెచ్చు దర్జాయైన
వస్త్రధారణ



'జరిగిన కథ'లో కృష్ణ, కాంచన.

సినిమా

అన్నదమ్ములిద్దరూ ఒకే స్త్రీని ప్రేమించడం, తమ్ముడుకూడా తను ఆరాధించే వ్యక్తినే ప్రేమిస్తున్నాడని తెలిసిన అన్న తన ప్రేమను త్యాగం చెయ్యడం, త్యాగమూర్తి అయిన తన అన్నయ్యను తమ్ముడు అపోహపడడం, చివరికి నిజం బయటపడి కథ యెలా ముగుస్తుందనే సస్పెన్సు మనకు వదిలేయడం "జరిగినకథ" చిత్రంలోని కథాంశం ఈ చిత్రంలో అన్నగా శ్రీ జగ్గయ్య, తమ్ముడిగా శ్రీ కృష్ణ ప్రేమించబడ్డ యువతిగా కుమారి కాంచన తమకిచ్చిన పాత్రల్లో జీవించారనే చెప్పాలి ఈ చిత్రానికి శ్రీ ఘంటసాల సమకూర్చిన సంగీతం సన్నివేశానుగుణ్యంగా వుండి, చిత్రం రక్తి కట్టడానికి దోహదం చేసిందనే చెప్పాలి పట్టుదలగా చేపట్టిన కార్యాన్ని పూర్తిచేసిన అన్నదమ్ములిద్దర్నీ అభినందించాల్సిందే

*   *   *

శ్రీ తాపీ ధర్మారావుగారి కుమారుడు శ్రీ తాపీ చాణక్య మనకున్న ప్రతిభాశాలురయిన దర్శకుల్లో ఒకరు వీరు దర్శకత్వం వహించిన 'రోజులుమారాయి' 'రాముడు భీముడు' 'ఎంగవీట్టుపిళ్ళై' 'రామ్ అవుర్ శ్యామ్' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద విజయ



'కదలడు వదలడు'లో జయలలిత

ఢంకాను మ్రోగించాయి వీరు ప్రస్తుతం హిందీలో బిజీగా వుండడంవల్ల తెలుగు చిత్రాల కంతగా దర్శకత్వం వహించడం లేదు ఇటీవల వీరు తెలుగు 'మదర్ ఇండియా' చిత్రానికి దర్శకత్వ బాధ్యత తను స్వీకరించారు కానీ శ్రీమతి జమున మాతృమూర్తి కానున్నందున ఆ చిత్రం యొక్క షూటింగు వాయిదా వెయ్యబడింది.

శ్రీ చాణక్య తనకుమార్తె సౌభాగ్యవతి జోయాను శ్రీ జి వి అప్పారావు (టిస్కో, తాతానగర్) కుమారుడు చిరంజీవి శ్రీ లక్ష్మణరావుకు యిచ్చి హైదరాబాదులోని తమ స్వగృహంలో మే 28 బుధవారం రాత్రి ఎనిమిది పదిగంటల మధ్య

సినిమా డైరీ

- రామకృష్ణా అండ్ ఎన్ ఎ టి కంబైన్స్, నిర్మిస్తున్న సాంఘిక చిత్రం యొక్క అవుట్ డోర్ షూటింగు పోలవరం బ్రిడ్జి అవతలివైపునుండి తచ్చూర్ కూటరోడ్డు జంక్షన్‌కు మధ్య జరిగింది ఈ చిత్రానికి శ్రీ రామారావు దర్శకుడు
- నవభారత్ కంబైన్స్ "ఉక్కుపిడుగు" షూటింగు వాహినిలోజరిగింది చిత్రంలోని నటీనటులందరూ పాల్గొన్నారు ఈ చిత్రానికి శ్రీ విశ్వనాథన్ దర్శకుడు
- శ్రీ చలం సమర్పించు "సంబరాల రాంబాబు" షూటింగు ప్రసాద్ స్టుడియోలో జరిగింది ఈ సాంఘికానికి శ్రీ శేషగిరిరావు దర్శకుడు
- శ్రీ రెడ్డి అండ్‌కో నిర్మిస్తున్న సాంఘిక చిత్రం యొక్క షూటింగు ఎ వి ఎం లో జరిగింది ఈ చిత్రానికి శ్రీ బి ఎ సుబ్బారావు దర్శకుడు
- చక్రవర్తిచిత్ర నిర్మించే "మరోప్రపంచం" షూటింగు హైదరాబాదులో జరిగింది ఈ చిత్రానికి శ్రీ ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు
- మిత్రా ప్రొడక్షన్స్ వారి "మళ్ళీపెళ్ళి" షూటింగు గోల్డెన్‌లో జరిగింది ఈ చిత్రానికి శ్రీ సి ఎస్ రావ్ దర్శకుడు
- తుఫాను బాధితుల సహాయార్థం శ్రీ యన్ టి రామారావు సాటి నిర్మాతల సహకారంతో ఒక బృహత్పథకాన్ని తయారుచేస్తున్నారు ఆంధ్రప్రదేశ్‌లో తుఫాను దెబ్బకి గురికాని ప్రాంతాలు పర్యటించి నిధిని సేకరించాలని వారిఉద్దేశ్యం.



బాడిగ రామకృష్ణ సమర్పించు ఎం.వి.ఆర్.పిక్చర్సు వారి

ముహూర్తబలం

నిర్మాతలు వై.వి.వి.ఎస్.ఎస్.వి.ప్రసాదరావు ఎం.పి.ఎం.రామదాసు

కో ప్రొడ్యూసర్ ఎం.బాజీరావు దర్శకుడు ఎం.మల్లికార్జునరావు

మాటలు ముళ్ళపూడి సంగీతం కె.వి.మహదేవన్

ఆంధ్రా నైజాం లక్ష్మీ ఫిలింస్ సీడెడ్: జయలక్ష్మి

LAKSHMI

పూర్ణయింపబడ్డ శుభముహూర్తంలో వివాహం జరిపించారు. ఈ వివాహానికి ప్రముఖులనేకులొచ్చి తమ శుభాశీస్సులను వధూవరులకందచేసారు. ఈ కళ్యాణం పెండ్లి కుమార్తె తాతగారు శ్రీ తాపీ ధర్మారావు గారి అధ్వర్యంలో జరిగింది.

*　　　*　　　*

టిప్‌టాప్‌గా డ్రస్సు చేసుకున్న శ్రీ కృష్ణంరాజు, మిలమిల మెరసిపోతున్న విజయలలితను వెంటబెట్టుకుని ఒక ఇంట్లోకి తీసుకొచ్చాడు. విజయలలిత యింట్లోకి ప్రవేశించింది. ఆ ప్రదేశం ఆమెకు కొత్తగా అనిపించింది.

విజయలలిత: ఈ యిల్లు ఎవరిది?

కృష్ణంరాజు: ఇది మా గార్డెన్ హౌసు.

లలిత: మనం ఎందుకొచ్చాం యిక్కడికి?

కృష్ణంరాజు: మా అమ్మ, నాన్న వాళ్ళు కుర్రతనాన్నంతా యిక్కడే గడిపేరట.

లలిత: అయితే?

కృష్ణంరాజు: వాళ్ళ అడుగుజాడల్లో నడుద్దామని...

లలిత: యూ సిల్లీ ఫెలో (అంటూ ఆప్యాయంగా కృష్ణంరాజును గిల్లుతుంది.) చేతిగడియారం చూచుకుని 'చాలా లేటు అయింది. నేను వెళ్తాను' అంటూ బయల్దేరబోతుంది లలిత.

కృష్ణంరాజు: ఓ మైగాడ్. నిజంగా నే లేటు అయింది. పెళ్ళికాని పిల్లవు. ఇంతసేపు నిన్ను యిక్కడుంచడం మంచిది కాదు.

లలిత: మరి వెళ్ళిరానా?

కృష్ణంరాజు: నువ్వు యిక్కడికి రావడం ఒకవిధంగా మంచిదయింది.

లలిత: ఏమిటది?

కృష్ణంరాజు: ఇకమీదట మన మీటింగ్ ప్లేస్ యిది అని నీకు తెలిసింది.—'కట్' అన్నారు దర్శకులు శ్రీ మాధవరావు. ఈ రసవత్తరమయిన సన్నివేశం జయ

మీకు తెలుసా?

అసభ్య చిత్రాలను, భయంకర దృశ్యాలు కలిగిన చిత్రాలను నిర్మించి 'వయోజనులకు మాత్రమే' నని విడుదల చేయడంచేత, అమెరికాలోని బాలురందరూ కలిసి తమ కుపయోగపడే 'మంచి చిత్రాలను నిర్మించాలి' అంటూ థియేటర్లముందు ఆర్భాటం చేస్తున్నారట.

ప్రముఖ హిందినటుడు శ్రీ షమ్మీ కపూర్‌కు తమిళ చిత్రంలోని పాట లంటే చాలా యిష్టమట. ఆయన తరుచూ 'అత్తాన్ ... ఎన్నత్తాన్...' అనెడి పాటను హుషారుగా పాడుతుంటారట.

శ్రీ కె. ఏ. అబ్బాస్ నిర్మించిన 'నాలుగు నగరాల కథ' అనెడి హింది చిత్రంలో ఢిల్లీ, కలకత్తా, బొంబాయి, మద్రాసు నగరాలకు సంబంధించిన నలుగురి జీవిత సమస్యలను చిత్రించి వున్నారట.

భారతదేశ ఉపప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్‌గారు ఒకానొకప్పుడు ఒక హిందిచిత్రంలో 12 నిమిషాలు కనిపించే పాత్రను పోషించారట.

లక్ష్మి ఆర్ట్స్ నిర్మిస్తున్న ప్రసాద్ స్టుడియోలో 'తాళిబొట్టు' చిత్రంలో కనిపిస్తుంది. శ్రీ వెంకట్రామరాజు నిర్మిస్తున్న యీ చిత్రానికి శ్రీ ఆత్రేయ రచనను, శ్రీ మహదేవన్ సంగీతాన్ని, శ్రీ ఎం. కె. రాజు కెమరాను, శ్రీ తోట కళను, శ్రీ హీరాలాల్ నృత్యాలను, శ్రీ వెంకన్న బాబు నిర్మాణ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలోని ముఖ్య పాత్రలను శ్రీయుతులు కృష్ణ, విజయ నిర్మల, విజయ లలిత, రాజబాబు, రమాప్రభ మరియు కృష్ణంరాజు పోషిస్తున్నారు.

శ్రీ ఆదుర్తి శిష్యరికం వృధాపోదు అనిపించే విధంగా యువదర్శకుడు శ్రీ మాధవరావు 'తాళిబొట్టు' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. బిగువయిన కథాంశం



'భలేరంగడు'లో నాగేశ్వరరావు, వాణిశ్రీ.



'ఏకవీర'లో కె. ఆర్. విజయ.

గల యీ చిత్రం ప్రేక్షకులను (ముఖ్యంగా స్త్రీలను) విశేషంగా ఆకర్షించగలదని వూహించబడ్తూంది ఈ చిత్రంయొక్క మొదటి షాటుకు శ్రీ మహదేవన్ స్విచ్ ఆన్ చెయ్యగా, శ్రీ ఆత్రేయ క్లాప్ కొట్టారు.

* * *

ప్రసాద్ నుండి వాహినికి వెళ్ళాను. అక్కడ సురేష్ మూవీస్‌వారి షూటింగు 9 వ ఫ్లోర్‌లో జరిగింది; జరిగినదాన్ని మీరూ తెలుసుకోండి.

అది పెద్ద భవంతి. అందులో ఆడంబరంగా శ్రీ ప్రభాకరరెడ్డి నిలబడివున్నారు. అప్పుడే శ్రీ రావి కొండలరావు అక్కడికి వచ్చారు. ఆయన పిలకజుట్టును చూసి నవ్వువచ్చింది. ఆయన జ్యోతిష్కులట. రాగానే ప్రభాకర రెడ్డిగారితో,

'మీకు భాస్కర్ ఆస్తి యావత్తూ చెందుతుందని శాస్త్రం చెప్తుంది' అని వెల్లడించారు. అలాగా అని చెప్పబోతున్న శ్రీ ప్రభాకరరెడ్డి తటాలున తన చేతికర్రతో కొండలరావుగారిని నొక్కుతూ 'ఏయ్ శాస్త్రులూ "ఆనాడు యేం చెప్పావ్. భాస్కర్ మరణించాడు. ఇక యావదాస్తికి మీరే వార



మేలు అని అన్నాన్. భాస్కర్ ప్రతికే వున్నాడు: ఇవాళ ఈ పని పడతానుండు' అంటూ ప్రభాకరరెడ్డి శ్రీ కొండలరావును చేతికర్రతో అదిమి తొక్కుతున్న సమయంలో దర్శకులు శ్రీ శేషగిరిరావు 'కట్' అనడం, షాటు ఒకే కావడం, లైటింగు మార్చుకునేందుకు గ్యాప్ యివ్వడం జరగడంవల్ల నిర్మాత శ్రీ రామానాయుడును కలిసి షూటింగు పూర్తయిందా, అవుట్ డోర్ 'దృశ్యాలు యెక్కడ తీస్తారు?' అని ప్రశ్నించాను. 'ఇన్‌డోర్ చాలావరకు అయినట్టే. అవుట్ డోర్‌లో నాయికా, నాయకుల యుగళగీతాలను చిత్రీకరించాలి. గోవాలో తీద్దామనుకుంటున్నాను' అని సమాధాన

సినివహా

మిచ్చారు. శ్రీ నాగేశ్వరరావు రెండు వైవిధ్యమయిన పాత్రలను పోషించే యీ సాంఘిక చిత్రకథను శ్రీ తురయాన్ మూర్తి వ్రాసారు. సంభాషణలను శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ, ఛాయాగ్రహణాన్ని శ్రీ భాస్కరరావు, కళను శ్రీ రాజేంద్రకుమార్, స్టిల్సును శ్రీ సత్యం నిర్వహిస్తున్నారు. శ్రీ విశ్వనాథం సంగీతం శ్రావ్యంగా సమకూర్చిన యీ చిత్రంలో యితర ముఖ్యపాత్రలను శ్రీయుతులు జగ్గయ్య, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, రాజబాబు, మిక్కిలినేని, విజయ, భారతి



జన్మభూమి'లో విజయశ్రీ.

పండరీబాయి పోషిస్తున్నారు భారీయెత్తున నిర్మించబడే యీ చిత్రాన్ని మీకు నవయుగా పిక్చర్స్ అతిత్వరలో చూపిస్తారు.

*   *   *

శ్రీ కోదండపాణిచే నేపథ్యగాయకుడిగా పరిచయం చేయబడ్డ శ్రీ బాలసుబ్రహ్మణ్యం తమిళ చిత్రాలలో కూడా బాగా పాడుతూ, శ్రీయుతులు ఎం. జి ఆర్, జెమినీ గణేష్‌ల ప్రోత్సాహాన్ని పొందుతూ, స్వల్ప వ్యవధిలోనే తమిళ సోదరుల హృదిలో తన కొక స్థానాన్ని యేర్పరచుకున్నాడు.

*   *   *

'మంచికుటుంబం', 'మంచిమిత్రులు' వంటి మంచి చిత్రాలను అందించిన మధుపిక్చర్స్ అధినేత శ్రీ పి. మల్లికార్జునరావుకి శ్రీ యార్లగడ్డ వీరరాజు గారి తృతీయపుత్రిక చి॥ సౌ॥ ఇందిరా ప్రభకు జూన్ 6 శుక్రవారం ఉదయం గం 7—50 నిమిషాలకు విజయవాడలోని రైస్ మిల్లర్స్ అసోషియేషన్ హాలులో వైభవంగా వివాహం జరిగింది. వధూవరులను వెండితెర మరియు పారిశ్రామిక ప్రముఖులు వచ్చి ఆశీర్వదించారు.

—శ్రీనివాస్

ఆటలు

క్రికెట్ అభిమానులకి మంచి అవకాశం

ముందు రానున్న క్రికెట్ సీజన్ చాలా బాగుంటుంది. పోయిన సంవత్సరం విదేశీ టీమ్‌లు ఏవీ రాలేదు. ఎమ్. సి. సి. రావటానికి భారత ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఎమ్. సి. సి. టీమ్ దక్షిణ ఆఫ్రికా బదులు ఇక్కడికి వద్దామనుకుంది. భారతదేశం బదులు పాకిస్తాన్‌కి వెళ్లిన ఎమ్. సి. సి. బృందం అక్కడి రాజకీయ పరిస్థితుల వల్ల హడావుడిగా ఇంగ్లాండుకి తిరిగి వెళ్లిపోవలసి వచ్చింది.

ఇక భారతదేశంలో రానున్న సీజన్‌లో ఆడపోయే టీమ్‌లు, పోటీలు—న్యూజిలాండ్ బృందం, మూడు టెస్టులు, వారి తర్వాత ఆస్ట్రేలియా టీమ్, అయిదు టెస్టులు. ఆతర్వాత రంజీట్రాఫీ, ఇరానీ ట్రాఫీ, దులీప్ ట్రాఫీ. భారత క్రికెట్ క్రీడాకారు లందరికీ చేతినిండా పని ఉంటుంది.


మన క్రికెట్ బృందాన్ని ఎన్నుకోవాలి. ఎన్నుకొనేవారు ఎన్నో సమస్యలని ఎదుర్కోవాలి. మనకి మంచి ఓపెనింగ్ బవులర్లు లేరు. అంతేకాదు, ఓపెనింగ్ బాట్స్‌మెన్ కూడా లేరు. ఈ యీ లోట్లని గురించి క్రికెట్ బోర్డు అధికారులు ఆలోచించాలి.

అవసరం అయితే ఇటువంటి ఆటగాళ్లని తరిఫీదు చేసే కేంద్రాన్ని ఒకదానిని తెరవాలి.

ఇకరాబోయే టెస్టు మాచ్‌లు కూడా ఆటగాళ్లకి మంచి తరిఫీదు అవకాశాలు కాగలవు. పాత ఆటగాళ్లు ఎందరో విశ్రమిస్తున్నారు, కొత్తవాళ్లు వస్తున్నారు...

సరియైన చెప్పినట్లు బాగా స్పీడ్‌గా బవుల్ చేసేవారూ, మంచి స్పీడ్ బవులింగ్‌కి తట్టుకునే బాట్స్‌మనూ కావాలి మనకి. పాటవుడీ నవాబు నాయకత్వం కింద ఈ రెండూ వస్తాయని ఆశించవచ్చు.

—కె. యస్. నరసింహన్



ముగ్గురు మూర్ఖులు

(11వ పేజీ తరువాయి)

పురుషుడూ విధిగా సంతాన నిరోధక శస్త్రచికిత్సను చేయించుకోవాలని ఒక శాసనాన్ని యెందుకు చేయకూడదు ?' అని ప్రశ్నించాడు చూడామణి

'మనది ప్రజాస్వామ్యదేశం. అందుచేత యిటువంటి విషయాల్లో నిర్బంధం పనికి రాదు. ఐచ్ఛికంగానే కుటుంబనియంత్రణను అమలు జరపాలని ప్రభుత్వం కోరుతున్నది' అన్నాడు చంచల్రావు

'ముస్లిములు, క్రైస్తవులు కుటుంబ నియంత్రణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ విషయాన్ని వారు బహిరంగంగా చెబుతూనే ఉన్నారు, ఈ పరిస్థితిలో కుటుంబ నియంత్రణ 'ఐచ్ఛికం' అనే పేరుతో హిందువులమీద మాత్రమే ఈ నియంత్రణను రుద్దడం లేదా ? వాస్తవానికి కుటుంబనియంత్రణ అనేది హిందూ కుటుంబనియంత్రణగా మారిపోయింది' అంటూ చూడామణి చెప్పడం ప్రారంభించాడు.

'ఒక మహమ్మదీయుడు నలుగురు స్త్రీలను పెండ్లాడవచ్చును కాబట్టి అతనికి యెక్కువ సంతానం కలుగుతుంది. ఒక్కొక్క ముస్లిముకు ముప్పై నలభై మందివరకు సంతానం ఉంటున్నట్లుగా మనం అప్పుడప్పుడు పత్రికల్లో వార్తలను చూస్తూనే ఉన్నాం. అందుచేత హిందూ జనాభా పెరుగుదల కంటె ముస్లిముల జనాభా పెరుగుదల యెప్పుడూ యెక్కువగానే ఉంటుంది.

క్రైస్తవమత ప్రచారానికి విదేశాల నుంచి పుష్కలంగా డబ్బు వస్తున్నది. 'సంఘసేవ' పేరుతో క్రైస్తవ మత ప్రచారకులు యిక్కడకు దిగుమతి అవుతున్నారు. వారు అనేకరకాల ప్రలోభాలను కలుగజేసి అమాయకులైన హిందువులను క్రైస్తవులుగా మార్చివేస్తున్నారు. అందుచేత హిందువుల పెరుగుదలకంటే క్రైస్తవుల పెరుగుదల కూడా అధికంగానే ఉంటుంది.

'ఈ పద్ధతి ప్రకారమే కుటుంబ నియంత్రణ మరికొంతకాలంపాటు సాగితే భారతదేశంలో హిందువులే అల్పసంఖ్యాక వర్గం కాగలరు' అని నిట్టూర్చాడు చూడామణి.

'అవును నువ్వు చెప్పినప్రకారం కుటుంబనియంత్రణ సరిగ్గా అమలు జరిగితే హిందువులే యీ దేశంలో అల్పసంఖ్యాకవర్గంగా మారిపోతారు కాని ప్రభుత్వం యెన్నోవిధాలుగా కుటుంబ నియంత్రణను అమలుజరుపడానికి ప్రయత్నించినా, అది సరిగ్గా అమలు జరగడం లేదు' అన్నాడు చిదంబరం.

'జనాభా పెరుగుదలను అరికట్టడానికి మన ప్రభుత్వం చాలా తీవ్రంగా కృషి చేస్తూ ఉంది పత్రికల్లోను, సినిమాల్లోను కుటుంబనియంత్రణను గురించి ప్రకటనలు విరివిగా కన్పిస్తున్నాయి అసలు ప్రభుత్వ యంత్రాంగమంతా కుటుంబ నియంత్రణ ప్రచారదళంగా మారిపోయింది. 'కుటుంబ నియంత్రణే ప్రభుత్వంయొక్క యేకైక లక్ష్యం' అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది, అయినా జనాభా పెరుగుదల తగ్గడంలేదు రోజురోజుకు అది యింకా పెరిగిపోతూనే ఉంది అన్నాడు చంచల్రావు

'అవును జనాభా పెరుగుదలను యెవరూ అరికట్టలేరు. దానికి ఒక దేవరహస్యం ఉంది' అన్నాడు చూడామణి

'ఏమిటా దేవరహస్యం? అని చంచల్రావు ప్రశ్నించగా చూడామణి చెప్పడం ప్రారంభించాడు

'భూలోకంలో పుణ్యం చేసిన వారందరూ స్వర్గలోకానికి వెళ్లి, సుఖాలను పొందుతారు పాపం చేసిన వారందరూ నరకానికి వెళ్లి బాధలను అనుభవిస్తారు ప్రపంచంలో పాపం చేసే వారి సంఖ్య యెప్పుడూ అధికంగా ఉంటుంది కాబట్టి నరకానికి వెళ్లేవారి సంఖ్య యెక్కువగా ఉంటుంది. అంతేకాకుండా మానవుడు భూమి మీద డెబ్భై సంవత్సరాలు జీవించాడనుకొందాం. ఈ కాలంలో అతడు చేసిన పాపాలకు పరిహారంగా కొన్ని వందల సంవత్సరాలు అతడు నరకంలో బాధలను పొందవలసి ఉంది. అందుచేత భూలోకంలో జనాభా కంటే నరకంలో జనాభా యెప్పుడూ చాలా యెక్కువ ఉంటుంది.

'ఇదివరకు నరకానికి వెళ్లిన వ్యక్తులందరూ చాలా విచారాన్ని పొందేవారు. కాని యీ మధ్యను నరకానికి వెళ్లిన వారందరూ చాలా సంతోషంగా ఉంటున్నారు. ఇది యమధర్మరాజుకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది.

అప్పుడు యమధర్మరాజు కొత్తగా నరకానికి వచ్చిన వాళ్లను యిలాగ ప్రశ్నించాడు. 'ఇదివరకు యిక్కడకు వచ్చిన వారు చాలా దుఃఖంతో ఉండేవారు. మీరు మాత్రం చాలా సంతోషంగా ఉన్నట్లు కన్పిస్తున్నారు. దీనికి కారణం యేమిటి?

'యమధర్మరాజా! భూలోకంలోను ముఖ్యంగా భారతదేశంలోను యిప్పుడు ప్రజల పరిస్థితి చాలా హీనంగా ఉంది. భారతదేశం యిప్పుడు భూలోకంలో యమలోకంగా మారిపోయింది. అక్కడ మేము పొందిన బాధలతో పోల్చినప్పుడు యిక్కడ మీరు పెట్టబోయే బాధలు మాకు లెక్క లేదు. అక్కడ ఉండే బాధలు మాకు తప్పిపోయాయి. ఇక ముందు నరకంలోనే సుఖంగా ఉండవచ్చును కదా! అని మేము సంతోషిస్తున్నాము ఇదే మా సంతోషానికి కారణం' అని వాళ్లు అన్నారు.

'వెంటనే యమధర్మరాజుకు ఒక ధర్మసందేహం వచ్చింది. 'పాపానికి ఫలితం బాధయే కాని సుఖం కాదు కదా! అటువంటప్పుడు భూలోకంలో పాపాలను చేసిన వారందరూ నరకంలో సుఖాలను పొందుతామంటున్నారు దీనికి యేమిటి చేయాలి?

ఈ సందేహాన్ని యమధర్మరాజు వైకుంఠానికి వెళ్లి విష్ణుమూర్తికి వివరించాడు. అప్పుడు విష్ణుమూర్తి యిలాగ అన్నాడు

'నువ్వు చెప్పింది నిజమే. పాపానికి ఫలితం బాధలే కాని సుఖం కాదు. నరకలోకంలో కంటే భారతదేశంలోనే యిప్పుడు బాధలు అధికంగా ఉన్నాయి కాబట్టి నరకంలో శిక్షింపబడవలసిన వారినందరినీ భారతదేశంలో పుట్టించవలసిందిగా యిప్పుడే నేను బ్రహ్మదేవుని ఆదేశిస్తున్నాను.'

'విష్ణుమూర్తి వెంటనే తన ఆదేశాన్ని బ్రహ్మదేవునకు పంపాడు. ఆ ప్రకారమే యిప్పుడు బ్రహ్మదేవుడు సృష్టిస్తున్నాడు.

'అందుచేత భారతదేశంలో జనాభా పెరుగుదలను యెవరూ అరికట్టలేరు' అని అంటూ చూడామణి జనాభా పెరుగుదలకు గల కారణాన్ని వివరించాడు.

'ఇప్పటికే చాలా ఆలస్యం అయింది' అంటూ చంచల్రావు లేవగానే మిగిలిన యిద్దరూ అతన్ని అనుసరించారు. ●

మే లో కాశ్మీరు

(39 వ పేజీ తరువాయి)

కర్చులు ఎక్కువ అయిపోతున్నాయి; ఇక కాశ్మీరు చాలు వెళ్ళిపోదామనుకున్నాము, అన్నది పెద్దావిడ. వారి యాస కన్నడ యాస విచిత్రంగా ఉంది నాకు తొలి బస్సు అప్పుడే వెళ్ళిపోతోంది...

నా బస్సు మర్నాడు మరికొంత షికారుకి అవకాశం ఉంది. షాలిమార్ బాగ్ కి వెళ్ళాను పెద్ద తోట ఏమీ కాదు. ఊటీతోట ఇంకా పెద్దది...

షాలిమార్ బాగ్ లో రెస్టారెంట్ కి వెళ్ళాను. అక్కడ కాశ్మీరు హైందవుడు ఒకాయన కనిపించాడు.

టీ తాగుతూ రాజకీయాలు మాట్లాడాము. 'షేక్ అబ్దుల్లా అంటే 80 శాతం వారికి ఇష్టం, ఇక్కడ హైందవులు 2 శాతంకన్నా లేదు మాకేమీ ప్రమాదం లేదు మా నవుకర్లు తురకవారే. కాని, వారందరూ పాకిస్థాన్ తో చేరాలంటారు వారి మతాభిమానం అంతేకదా? భారత దేశంలో మతకలహాలు చూస్తే చాలా భయం వారికి,' అని ఆయన అన్నాడు

'శ్రీనగర్ లో బాగా చదువుకున్న వారు న్నారా? మేధావులు?' అని అడిగాను. చాలామంది, అన్నాడాయన. 'మహమ్మదీయులలో?' అని నేనడిగాను

మతం, పాకిస్తాన్

ఆయన నవ్వాడు. 'మహమ్మదీయులలో ఎక్కువమంది కొరాన్, మతం, పాకిస్థాన్— వీటిని గురించే మాట్లాడుతారు,' అన్నాడు.

—కాశ్మీర్ లో అన్నిచోట్లకి వెళ్ళావా? అని అడిగాడు వాన మూలాన నా విలాస యాత్ర చెడిపోయింది, అన్నాను. నవ్వాడు.

—నిషాత్ బాగ్ చూశారా?

—లేదు

—అయితే వెడదాము.

బస్సు ఎక్కాము దారిలో ఆయన మిత్రుడు మరొకాయన కూడా కలిసి మాతో వచ్చాడు

నిషాత్ బాగ్ ఎన్నోరకాల పువ్వులు. చెన్నార్ చెట్లు చాలా పెద్ద చెట్లు.

—ఇటువంటి చెట్లు కాశ్మీర్, ఇరాన్ లలో తప్ప ఎక్కడా కనిపించవు. ఇక్కడికి మొగల్ చక్రవర్తులు తీసుకువచ్చారు

ఇంతలో వడగళ్ళవాన

—ఎన్నివేల చెట్లపువ్వులు నాశనం అయ్యాయో! నన్ను తీసుకువెళ్ళిన ఆయన స్నేహితుడు, ఆయనకిపళ్ళతోటఒకటిఉంది.

తోట ముందు డాల్ సరస్సు ఎంతో చక్కగా ఉంది.

—చలికాలంలో నీరంతా గడ్డకట్టుకు పోతుంది. ఎందరో వచ్చి మంచులో ఆడు కుంటారు ఇది ఒక పెద్ద విలాస ప్రదేశం. పిక్నిక్ స్పాట్...


హోటలుకి తిరిగి వచ్చేశాను బిల్లు కట్టేసి టూరిస్టు సెంటర్ కి వెళ్ళి పోయాను మర్నాడు బస్సు చాలా పెందల కాడే బయలుదేరుతుంది. నేను పడక వేసినహాలులో 200మందిపడుకొనవడ్డారు...


నిద్రపట్టలేదు ఎప్పుడో ఊటీలో సెవాయ్ హోటల్లో దిగినప్పటి సంగతి గుర్తుకి వచ్చింది. కాశ్మీరు సమస్యని గురించి మాట్లాడుకుంటున్నాము. బొంబాయి నుంచి వచ్చిన ఒక జంట, నేనూ అప్పుడు షేక్ అబ్దుల్లా వార్త లోకి ఎక్కాడు.

వదులుకోలేము!


'అయ్యో! కాశ్మీరుని వదులుకోలేము; మనం! ఎంతో అందంగా ఉంటుంది...' అంది అమ్మాయి. అప్పుడు నేను ఇంకా కాశ్మీరుచూడలేదు. ఇప్పుడుచూశాను ఆమె అన్న మాటలతోఏకీభవిస్తానా? ఇప్పుడు? ●

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.








RAMDAS.K
యువకవీంద్రులు
డా॥సి. నారాయణరెడ్డి
కమ్మని పలుకులలో
కళలు వెలార్చిన కమనీయ
ప్రణయగాథ......
పాటలు:-
సి నారాయణరెడ్డి, కృష్ణశాస్త్రి
స్క్రీన్‌ప్లే: పి చంగయ్య, B.A,
కళ: గొడ్‌గాంకర్, వాలి
నృత్యం: వెంపటిసత్యం
కెమెరా: సత్యనారాయణ
సహాయనిర్మాత
బి.ఎ. సీతారాం,
B A. LLB.
సమర్పించు
పద్మాఫిలింస్ వారి
ఏకవీర
విడుదల: ఆంధ్ర:-జ్యోతీ
నైజాం:- దివ్యదత్త
రాయలసీమ:-నవభారత్
దర్శకత్వం....సి.యస్.రావు, B.A.(Litt)
సంగీతం....కె.వి. మహదేవన్
కథ..కవిసమ్రాట్ విశ్వనాథసత్యనారాయణ
JOTHEE